ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 19.08.2025 | సంపుటి :12 సంచిక : 31 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370






## చేనేతలపై జీఎస్టీని ఎత్తేయండి

**కుదేలైన చేనేత రంగం**

**ప్రధాని మోడీకి మంత్రి తుమ్మల లేఖ**



హైదరాబాద్(జనంసాక్షి): చేనేత ఉత్పత్తులపై వెంటనే జీఎస్టీ తొలగించాలని కోరుతూ ప్రధాని మోదీకి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖ రాశారు. జిఎస్టీ భారంతో చేనేత కుదేలయ్యిందన్నారు. చేనేతలను ఆదుకునేందుకు ప్రోత్సహించాల్సి ఉందన్నారు. కేంద్ర హస్త కళలు, చేనేత మంత్రిత్వ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు కూడా లేఖ పంపారు. రాష్ట్ర హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత రంగం, చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జీఎస్టీతో ప్రస్తుతం ఆ రంగం తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటోందని ప్రధాని, కేంద్ర మంత్రి దృష్టికి

మిగతా 2లో..

## యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

రైతులు అవసరాల మేరకే యూరియా కొనుగోలు చేయాలి

పరిశ్రమలకు తరలించకుండా పటిష్ట చర్యలు

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల

2లో..

## యూరియా కోటా విడుదల చేయండి

పార్లమెంట్ ఎదుట కాంగ్రెస్ ఎంపీల ఆందోళన

యూరియా కొరతపై కాంగ్రెస్ వాయిదా తీర్మానం

కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

12లో..

**గతపాలకులు**

# సర్వాయి కోటను కాలగర్భంలో కలిపే కుట్ర



**చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తాం భావితారాలకు అందిస్తాం: సీఎం రేవంత్**

- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడం లేదు
- బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు ఇదో సాకు
- రాహుల్‌తో రాజకీయ వైరం ఉంటే తేల్చుకోండి
- బీసీ రిజర్వేషన్లు మాత్రం అడ్డుకోవడం సరికాదు
- సర్వాయి పాపన్న విగ్రహానికి శంకుస్థాపనచేసిన సీఎం



> బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిరూపించారు. పాపన్న గౌడ్ చరిత్ర, స్ఫూర్తి, కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. భవిష్యత్తు తరాలు గర్వించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. రాహుల్ కుటుంబం దేశానికి గొప్ప వరమని, శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చని ఆయన నిరూపించారు. విద్య, ఉద్యోగాల్లో బహుజనులు ఆర్థికంగా ఎదగాలనేది ఆయన విధానం. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన సర్వే చేశాం. కులగణన సర్వేలో తప్పులుంటే చూపాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు శాసనసభ వేదికగా సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పాం..
>
> -సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిరూపించా రని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జరిగిన పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్ సమీపంలో సీఎం ఆయన విగ్రహానికి శంకుస్థాపన చేశారు. పాపన్న గౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా

మిగతా 2లో..

**ఎట్టకేలకు..**

# తొలగించిన ఓటర్ల జాబితా విడుదల

**ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం**

- 65 లక్షల మంది జాబితాను వెలువరించిన ఈసీ
- బీహార్‌లో ఎస్ఐఆర్ విమర్శలపై స్పందన
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కదిలిన ఈసీ




న్యూఢిల్లీ (జనంసాక్షి) : బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ కింద 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించిన విషయం తెలిసిందే. అయితే ఆ 65 లక్షల మంది ఓటర్ల పేర్లను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ ఓటర్ల జాబితా ఒకరోజు ముందుగానే రిలీజ్ చేశారు. ఆగస్టు 19వ తేదీలోగా డిలీట్ అయిన పేర్లను వెల్లడించాలని సుప్రీం ఆదేశించింది. ఆగస్టు 22లోగా ఆ నివేదికను కోర్టు ముందు సమర్పించాలని సుప్రీం పేర్కొన్నది. సవరించిన ఓటర్ల జాబితాలో ఆబ్‌సెంట్, షిఫ్ట్, డెడ్ ఓటర్లు ఉన్నారు. ఏఎస్డీ జాబితాను రోహతాస్, బెగుసురాయి, అర్వాల్ పోలింగ్ బూత్‌ల్లో ప్రదర్శించినట్లు బీహార్ సీఈఓ తెలిపారు. తొలగించిన 65 లక్షల ఓటర్లలో 18.66 లక్షల మంది మరణించినవారు, 26.01 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు తరలివెళ్లినవారు, 7 లక్షల మంది పలు చోట్ల ఓటర్లుగా నమోదైనవారు ఉన్నారని ఈసీ తెలిపింది. అలాగే 11,484 మందిని గుర్తించలేదు. ఈ ఓటర్లను ఏ ఎస్ డీ ఓటర్లుగా వర్గీకరించారు. ఈ జాబితాలు జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్‌లలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎలక్టర్స్ ఫోటో ఐడెంటిటీ కార్డ్ నంబర్‌తో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు. ఆ ఓట్లను ఎందుకు తీసేశారో కారణాలు కూడా వివరిస్తున్నారు. ఆగస్టు 14, 2025న, సుప్రీం కోర్టు ఈసీని 65 లక్షల ఓటర్ల తొలగింపు వివరాలను, వారి పేర్లతో పాటు తొలగింపు కారణాలను అంటే మరణం, వలస, డూప్లికేట్ ఎంట్రీలు వంటి కారణాలను న్లైన్‌లో ప్రచురించాలని ఆదేశించింది. ఈ జాబితాలు బూత్ వారీగా పంచాయత్ , బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయాల్లో

మిగతా 2లో..

## ఓటరు చోరీపై ఈసీ స్పష్టత ఇవ్వలేకపోయింది

- సుప్రీంకోర్టు ఆదేశాలపై కూడా వివరణ ఇవ్వలేదు
- అధికార పార్టీని ప్రశ్నించే వాళ్లను బెదిరిస్తోంది
- కేంద్ర ఎన్నికల సంఘంపై ఇండియా కూటమి విమర్శలు
- తొలుత 'ఈసీ'నే అఫిడవిట్ ఇవ్వాలని డిమాండ్

2లో..

## సీఈసీపై అభిశంసన!

కాంగ్రెస్ సమాయత్తం

కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్

ప్రతాప్‌గఢీ ప్రకటన

# పండగపూట విషాదం

**శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఊరేగిస్తున్న రథానికి విద్యుత్ షాక్**

**ఘటనాస్థలంలో ఐదుగురు..చికిత్స పొందుతూ ఒకరు మృతి**

- రామంతాపూర్‌లో ఘటనపై సీఎం రేవంత్ విచారం
- ఘటనపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం
- ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్/ఉప్పల్(జనంసాక్షి):రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు విషాదం నింపింది. ఇందులో మొత్తం ఆరురుగు దుర్మరణం చెందారు. రథానికి విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. కృష్ణాష్టమి కారణంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు. రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేశారు. అనంతరం యువకులు రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథం లాగుతున్న తొమ్మిది మందిలో ఐదుగురు అక్కడిక్కకడే మృతి చెందగా.. నలుగురు తీవ్రగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఒకరు చికిత్స పొందుతూ మృతిం చెందారు. ఈ ఘటనతో రామంతపూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన స్థానికులు వెంటనే తేరుకొని ప్రాథమిక చికిత్స చేపట్టి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఐదుగురు మృతిచెందినట్లు

మిగతా 2లో..

# పొంగుతున్న వాగులు.. నిండుతున్న ప్రాజెక్టులు

**భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా నిండుకుండలా జలాశయాలు**

- శ్రీరామ్‌సాగర్ జలాశయం గేట్లు ఎత్తివేత
- మహారాష్ట్రలో జగిత్యాల వాసుల గల్లంతు
- ములుగు ఏజెన్సీలో భారీవర్షాలు.. నిండిన లక్నవరం చెరువు
- అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సీతక్క



హైదరాబాద్(జనంసాక్షి):భారీ వర్షాలతకు తోడు ఎగవ నుంచి వస్తున్న వరదతో నిజామబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1088 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 72.23 టీ-ఎంసీలుగా నమోదైంది. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇదిలావుంటే మహారాష్ట్రలోని ఉద్గిర్ వద్ద జగిత్యాల జిల్లా వాసులు గల్లంతయ్యారు. వీరు మహారాష్ట్రకు వెళ్లి తిరిగివస్తుండగా.. కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో నలుగురు గల్లంతవగా.. ఓ బాలుడి ఆచూకీ లభ్యమైంది. మిగతా వారికోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితులను హసీనా, సమీనా, ఆఫ్రీన్‌గా గుర్తించారు. ములుగు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఏజెన్సీ మండలాలు వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయిలో ఎడతెరిపి లేకుండా వాన దంచికొడుతోంది. కుండపోత

మిగతా 2లో..

# కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతోనే తెలంగాణ నుంచి పారిపోతున్న పరిశ్రమలు

**గుజరాత్‌కు తరలిన రూ.2,800 కోట్ల 'కేన్స్' పెట్టుబడి**

బూడిదలో పోసిన పన్నీరుగా పదేళ్ల బీఆర్ఎస్ శ్రమ

రాష్ట్ర ప్రగతిపై కాదు.. ఢిల్లీకి డబ్బు పంపడంపైనే దృష్టి

ఢిల్లీకి ఏటీఎంలా రాష్ట్రాన్ని వాడుకోవడమే కాంగ్రెస్ ఏకైక అజెండా: కేటీఆర్




హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం, నిర్లక్ష్యపు పాలనా విధానాలతోనే తెలంగాణకు రావాల్సిన భారీ పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో శ్రమించి రాష్ట్రానికి తీసుకొచ్చిన రూ.2,800 కోట్ల పెట్టుబడి, 2 వేల ఉద్యోగాల సామర్థ్యం గల 'కేన్స్' టెక్నాలజీ' సెమీకండక్టర్ల పరిశ్రమ కాంగ్రెస్ సర్కార్ అసమర్థత కారణంగా గుజరాత్‌కు తరలిపోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా పరిశ్రమలు తరలిపోతున్నా ఇప్పటివరకు రేవంత్ రెడ్డి కనీసం స్పందించడం లేదన్నారు. గతంలో తమ ప్రభుత్వం ఎంతో శ్రమించి కర్ణాటకకు వెళ్లాల్సిన కేన్స్ పరిశ్రమను తెలంగాణకు రప్పించిందన్న కేటీఆర్, వారు కోరిన వెంటనే పది రోజుల్లోనే కొంగరకలాన్‌లో

మిగతా 2లో..

## యుద్ధం ఆగాలంటే జెలెన్స్కీ కొన్ని త్యాగం చేయాల్సిందే..



- యుద్ధం ముగింపు అనేది అతడి చేతుల్లోనే ఉంది: ట్రంప్
- ఉక్రెయిన్ నాటోలోనూ చేరడం వీలుకాదని వెల్లడి



వాషింగ్టన్(జనంసాక్షి):పుతిన్‌తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జెలె న్స్కీతో ఉక్రెయిన్ శాంతి చర్చలు జరప బోతున్నారు. అయితే దానికంటే కొన్ని గంటల ముందు ఆయనో కీలక ప్రకటన చేశారు. జెలన్‌స్కీ కాస్త తగ్గి.. కాంప్రమైజ్ కావాలన్న రీతిలోనే సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారాయన. రష్యా నుంచి క్రిమి యాను తిరిగి పొందడం, ఉక్రెయిన్ నా టోలో చేరడం ఈ రెండూ అసాధ్యమేనని ట్రంప్ ఆ పోస్టులో స్పష్టం చేశారు. "తలుచుకుంటే జెలెన్‌స్కీ వెంటనే రష్యా తో యుద్ధాన్ని ముగించవచ్చు. లేదంటే యుద్ధాన్ని కొనసాగించవచ్చు. 12 ఏళ్ల కిందట ఒక్క తూటా పేలకుండానే ఒబా మా క్రిమియా భూభాగాన్ని రష్యాకు అప్పజెప్పారు. అలాగే నాటోలోనూ ఉక్రెయిన్ చేరడం వీలుకాదు. కొన్ని ఎన్నటికీ మా రవు అనే విషయాన్ని గుర్తించాలి" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలస్కా వేదికగా ట్రంప్ మూడు రోజుల కిందట అలస్కాలో భేటీ అయ్యారు. అయితే కాల్పుల విరమణ విషయంలో పుతిన్ అస్సలు తగ్గలేదని తెలుస్తోంది. యుద్ధవిరామం గురించి కా కుండా.. భూభాగాల మార్పిడిపైనే ప్రధానంగా చర్చలు జరిగాయి. పుతిన్ ప్రతిపాదన ప్రకారం..

మిగతా 2లో..

## యుద్ధాన్ని ప్రపంచం నమ్మేలా ముగించాలి


- అలాగే మా భద్రత కూడా హామీ ఇవ్వాలి : జెలెన్స్కీ
- మాకూ సెక్యూరిటీ గ్యారెంటీ కావాలి: రష్యా

కీవ్(జనంసాక్షి):రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ప్రపం చం నమ్మేలా ముగిం చాలి అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడితో శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన కొద్దిసేపటిక్రితమే వాషింగ్టన్ డీసీకి చేరుకొన్నారు. ఈసందర్భంగా ట్రంప్, ఐరోపా నేత లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "యుద్ధం ముగియాలనే బలమైన మా ఆ కాంక్షను తెలియజేశాం. ఉక్రెయిన్‌ను రక్షించుకొంటానన్న నమ్మకం నాకు ఉంది. అదే సమయంలో మా భద్రతకు హా మీ కూడా పొందుతాననే భావిస్తున్నాను. రష్యా ప్రారంభించిన యుద్ధాన్ని అదే ఆపేయాలి" అని వ్యాఖ్యానించారు. గతంలో అంతగా ప్రయోజనం లేని సెక్యూరిటీ గ్యారెంటీ కాకుండా.. ఈసారి భద్రతకు బలమైన హామీ ఇవ్వాలని జెలె న్స్కీ కోరారు. ఉక్రెయిన్ వాసులు వారి భూమి, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారన్నారు. అమెరికా ఐరోపా నుంచి వచ్చే ఒత్తిడితో రష్యా శాంతిఒప్పందం వైపు మళ్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందే ట్రంప్ జెలెన్‌స్కీ కి పూర్తిగా భిన్నమైన ప్రకటన చేశారు. ఈమేరకు ఆయన ట్రూత్‌లో పోస్టు చేశా రు. "ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ తక్షణ

మిగతా 2లో..

## రష్యా నుంచి చమురు కొని భారత్ లాభపడుతోంది

- చైనా శుద్ధి చేసి తిరిగి ఈయూ,ప్రపంచ దేశాలకు విక్రయిస్తోంది
- అందుకే ఆ దేశంపై మెతకవైఖరి.. భారత్‌పై కఠినవైఖరి:అమెరికా



## మోదీకి పుతిన్ ఫోన్

ఎక్స్ వేదికగా తెలిపిన ప్రధాని

## ప్రధాని మోదీతో శుభాంశు శుక్లా భేటీ

9లో..

వాషింగ్టన్(జనంసాక్షి):రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు జరుపుతుందని.. తద్వారా ఉక్రెంయిన్ యుద్ధంలో పరోక్షంగా ఆర్థిక సాయం అందిస్తోందని ఆరోపిస్తూ ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై ఏకంగా 50 శాతం సుంకాలు(25 శాతం పెనాల్టీతో కలిపి) విధించింది. ఈ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా తప్పుబడుతూ.. అదే పని చేస్తున్న చైనా, ఈయూల విషయంలో మినహాయింపు దేనికని అమెరికాను నిలదీసింది. దీనికి తోడు చైనా విషయంలో ట్రంప్ ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంపైనా పలు అనుమానాలు వ్యక్తం చేసింది. అయితే..అమెరికా చైనాను ఎందుకు మినహాయించింది? ఇండియాపై భారీ టారిఫ్‌లు ఎందుకు? అనే ప్రశ్నలకు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో వివరణ ఇచ్చారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయనకు ఈ ప్రశ్నలు ఎదురు కావడంతో ఆయన వివరణ ఇచ్చారు. "భారత్, చైనాలు రష్యా నుంచి చమురు కొనుగోలు జరిపే దేశాలే. ఆ రెండు మాస్కోకు ప్రధాన భాగస్వాములే. అందులో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. కానీ, భారత్‌తో పోలిస్తే చైనా పరిస్థితులు అందుకు కాస్త భిన్నంగా ఉన్నాయి. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేసి లాభపడుతోంది.

మిగతా 2లో..



## మరోసారి సబితకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి): మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందానికి తెలంగాణ హైకోర్టు నోటీ-సులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుతూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో ఇచ్చిన

మిగతా 2లో..

## వాహన లైఫ్‌టాక్స్ పెంపు

జివో 53 విడుదల

14నుంచే అమలు

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19.08.2025



## టీ ఫైబర్ పై సమగ్ర నివేదిక సమర్పించండి

**ప్రజలకు మెరుగైన సేవలందేలా చూడాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):**టీ ఫైబర్ పనులు జరిగిన తీరు... ప్రస్తుత పరిస్థితి... భవిష్యత్‌లో చేపట్టనున్న పనులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టీ ఫైబర్ పై తన నివాసంలో సోమవారం రాత్రి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. టీ ఫైబర్ పనులు చేసిన కాంట్రాక్ట్ సంస్థలకు నోటీసులు ఇచ్చి పనులు చేసిన తీరుపై నివేదిక కోరాలని సీఎం ఆదేశించారు. సంస్థలో ఉద్యోగుల సంఖ్య, వారి పని తీరును సమీక్షించాలన్నారు. ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమమైనందున పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. టీ ఫైబర్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రణాళిక ఉండాలని సీఎం ఆకాంక్షించారు. సమీక్షలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఐటీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, డిప్యూటీ కార్యదర్శి భవేష్ మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతలపై జిఎస్టీని ఎత్తేయండి

తీసుకెళ్లారు. జీఎస్టీ వల్ల నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. సాధారణంగా ఖాదీ రంగం, చేనేత రంగం రెండూ సహజ సిద్ధమైన గ్రామీణ పరిశ్రమలుగా ఒకే విధంగా ఉన్నప్పటికీ.. ఖాదీ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు ఉండగా, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ కొనసాగించడం అన్యాయం. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాలు, కార్మికులు ఈ పన్నును వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ప్రయోజనాలు కాపాడటం తోపాటు- నిరంతరం ఉపాధి కల్పించేందుకు భారతీయ చేనేత కళా వారసత్వం భావితరాలకు అందించడానికి చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే ఈ రంగం.. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారమైందని పేర్కొన్నారు. అందం, నాణ్యత, సృజనాత్మకతకు అద్దం పట్టే పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, నారాయణపేట చీరలు, సిద్ధిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ డబుల్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాయి. వీటిలో ఆరు రకాల ఉత్పత్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదయ్యాయన్నారు.

## యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

**హైదరాబాద్**(జనంసాక్షి):వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణ రావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు లతో కలిసి యూరియా, ఎరువుల లభ్యత పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడం, జూలై, ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురువడం వల్ల రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వంటి వివిధ కారణాల వల్ల కొంత యూరియా సమస్య ఉందని అన్నారు.

## పొంగుతున్న వాగులు.. నిండుతున్న ప్రాజెక్టులు

వర్షంతో రోడ్లపై వరద పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. మంగపేటలో 19 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది. పలు కాలనీలు, ఇళ్లలోకి వరద నీరు చేరింది. వెంకటాపురం శివాల యం వీధిలో రోడ్లు జలమయమయ్యాయి. మంగపేటలో పంట పొలాలు నీట మునిగాయి. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అన్నదాతల ఆశలకు జీవం పోస్తూ.. లక్నవరం జలాశయం మత్తడి పోస్తుంది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయం పూర్తిస్థాయిలో అయిదు అంగుళాల మేర మత్తడి పోస్తుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి మించి వరద ప్రవాహం ఎగువ ప్రాంతం నుంచి వస్తుండడంతో జలాశయం మత్తడి పరవళ్లు తొక్కుతోంది. మొన్నటి వరకు చుట్టు-పక్కల ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా.. గోవిందరావుపేట మండలంలో ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదు. సాగు నీటి అవసరాలు తీరుస్తున్న లక్నవరం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టాన్ని దాటింది. దీంతో దీని కింద ఉన్న 13 వేల ఎకరాల ఆయకట్టుకు భరోసా ఏర్పడింది. కాకతీయుల కాలంలో రైతుల సాగు నీటి అవసరాలకు కోసం నిర్మించిన ఈ జలాశయం ఊహించని రీతిలో ఇప్పుడు పర్యాటకులకు స్వర్గధామంలా విలసిల్లుతోంది. సహజ సిద్ధమైన ప్రకృతి అందాలతో సందర్శకులను మరో లోకంలో విహరింపజేస్తూ.. సంభ్రమాశ్చర్యాలకు లోను చేస్తుంది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం దాతర్ పల్లిలో కట్టు కాల్వ తెగిపోయింది. దీంతో పట్టణంలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. మరోవైపు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.




## సర్వాయి కోటను కాలగర్భంలో కలిపే కుట్ర

నిలబడాలని అభిలాషించారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజులకు ఇచ్చాయని, గతంలో ఖిలాషాపూర్ కోటను కాలగర్భంలో కలపాలని కొంతమంది చూశారని ఆక్షేపించారు.పాపన్న గౌడ్? చరిత్ర, స్ఫూర్తి, కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్న సీఎం రేవంత్? రెడ్డి, భవిష్యత్తు తరాలు గర్వించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరమని, శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని ఆయన నిరూపించారని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో బహుజనులు ఆర్థికంగా ఎదగాలనేది రాహుల్ గాంధీ విధానమని, ఆయన పాలసీని అమలు చేయడమే తన బాధ్యత అని అన్నారు. రాహుల్‌గాంధీ సూచనను నూరు శాతం అమలు చేస్తామని, ఆ క్రమంలో సమస్యలు వస్తే పోరాటంలో ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే లక్ష్యంగా ముస్లిం పేరుతో వాదనలు సృష్టిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మైనార్టీల రిజర్వేషన్లు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ ఎలా అమలులో ఉన్నాయో కేంద్రం పరిశీలించాలని, అక్కడ తొలగించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవచ్చని, కేసులు పెట్టవచ్చని.. కానీ, ఆయన నమ్మిన బీసీ సాధికారత సిద్ధాంతాన్ని దెబ్బతీయొద్దని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలు ముందుకు రావడం రాహుల్ గాంధీ లక్ష్యమని, ఆ సూచనలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్ బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు. గతంలో ఖిలాషాపూర్ కోటను కాలగర్భంలో కలపాలని చూశారని దుయ్యబట్టారు. చరిత్ర స్ఫూర్తి కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరం. శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని గాంధీ నిరూపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియాగాంధీ పదవులు త్యాగం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆ కుటుంబం గొప్ప నాయకత్వాన్ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌ను గుర్తించినట్లే.. గాంధీ కుటుంబాన్ని గుర్తిస్తున్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శం అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్నకు సముచిత గౌరవం ఇవ్వడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. హుస్నాబాద్‌లోని పాపన్న కోటను లీజుకు ఇచ్చిందని, తాము అయితే ఆ కోటను సంరక్షించడానికి చర్యలు ప్రారంభించామని వెల్లడించారు. హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్‌ను పోటీ- చేయించడం కూడా అదే భావనలోనుంచే జరిగిందని అన్నారు. గాంధీ కుటుంబాన్ని దేశానికి గొప్ప వరంగా అభివర్ణిస్తూ.. వారిచ్చే హామీ శిలాశాసనం లాంటిదేనని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ సూచించినట్లు-గా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణనను నిబద్ధతతో పూర్తి చేసామని, తాము చేసిన సర్వేలో తప్పు ఎక్కడ ఉందో చూపించమని

## పండగపూట విషాదం

వైద్యులు ధ్రువీకరించారు. మరో నలుగురిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన వారిలో కృష్ణయాదవ్ (21), సురేశ్ యాదవ్(34), శ్రీకాంత్‌రెడ్డి(35), రుద్రవికాస్(39), రాజేంద్రరెడ్డి(45)తో పాటు- మరొకరు ఉన్నట్లు- గుర్తించారు. వారి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ సైతం ఉన్నట్లు సమాచారం. రామంతాపూర్ ఘనటలో మృతిచెదిన బాధితులకు ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అయితే ఈ ఘటనపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరో 100 మీటర్లలో శోభాయాత్ర ముగుస్తుందనగా ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నామని.. గాయపడిన వారి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. కేబుల్ వైర్ ద్వారా కరెంట్ సరఫరా జరిగి ఈ ప్రమాదం జరిగినట్లు- అధికారులు చెబుతున్నారని అన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశారు. దర్యాప్తు నివేదిక వచ్చాక బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రేటర్ హైదరాబదలో కేబుల్ వైర్లు, కరెంటు తీగలపై స్పెషల్ డ్రైవ్ కు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. నలుగురిలో చికిత్స పొందుతూ.. ఒక వ్యక్తి మృతిచెందినట్లు- వైద్యులు వెల్లడించారు. ఉప్పల్ రామంతపూర్ గోకులే నగర్లో జరిగిన దుర్ఘటన గురించి విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా జరిగిన ఊరేగింపులో విద్యుత్ షాక్‌తో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని తెలిపారు. ఈ విషాదంలో కృష్ణ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సురేష్ యాదవ్, రుద్ర వికాస్, రాజేంద్ర రెడ్డిలు మరణించడం హృదయ విదారకం ఘటన అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు- ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు- చెప్పుకొచ్చారు. ఈ ఘటనలో గాయపడిప వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాని అన్నారు.

## ఓటరు చోరీపై ఈసీ స్పష్టత ఇవ్వలేకపోయింది

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీ బీహార్‌లో 65 లక్షల ఓటర్ల తొలగింపుపై కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ)పై ఇండియా కూటమి విమర్శలు గుప్పించింది. బీహార్ రాష్ట్రానికి సంబంధించి తొలగించిన 65 లక్షల ఓటర్లపై సీఈసీ స్పష్టత ఇవ్వలేదని మండి పడింది.సుప్రీంకోర్టు ఆదేశాలపై కూడా సీఈసీ వివరణ ఇవ్వలేకపోయిందని ఇండియా కూటమి ధ్వజమెత్తింది.మహాదేవపుర ఓటరు మోసంపై సీఈసీ సమాధానం ఇవ్వలేదని పేర్కొంది. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై సైతం సీఈసీ తప్పించుకుందని ఇండియా కూటమి విమర్శించింది. ఓటరు మోసాలపై దర్యాప్తు చేయలేదని, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడంలో ఈసీ విఫలమైందని, అధికార పార్టీని ప్రశ్నించే వాళ్లను ఈసీ బెదిరిస్తోందని ఇండియా కూటమి ఆరోపించింది.కాగా, దేశవ్యాప్తంగా పలు లోక్‌సభ నియోజకవర్గాల్లో లక్షలాది ఓట్లను తొలగించి పరోక్షంగా ఓటుహక్కును అపహరించారన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపణలను సీఈసీ ఖండించింది. ఈ మేరకు ఆదివారం(ఆగస్టు 17వ తేదీ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ మాట్లాడుతూ.. రాహుల్ చేసిన ఆరోపణల మేరకు ఓటు చోరీపై ఏడు రోజుల్లో సమగ్ర అఫిడవిట్ సమర్పించాలన్నారు.లేని పక్షంలో దేశప్రజలకు తక్షణం క్షమాపణ చెప్పాలి" అని ప్రెస్ మీట్‌లో డిమాండ్ చేశారు. "ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్న వారికి ఏడు రోజుల గడువిస్తున్నా. వారి ఆరోపణలపై ఆలోపు ప్రమాణపత్రం సమర్పించాలి. లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పడం మినహా మరో దారి లేదు. ఎలాంటి రుజువులూ లేకుండా మీరు చేస్తున్న ఈ ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలు. అబద్ధాలతో కొన్ని పార్టీలు ఈసీ భుజాల మీదుగా ఓటర్లకు తుపాకీ గురి పెడుతున్నాయి. " అన్నారు.

తొలుత 'ఈసీ' అఫిడవిట్ ఇవ్వాలి: కాంగ్రెస్

ఓట్ల చోరీ ఆరోపణలపై ఆధారాలుంటే.. వారం రోజుల్లో అఫిడవిట్ సమర్పించాలని, లేని పక్షంలో వాటిని నిరాధారంగా పరిగణిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సీఈసీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీన్ని హస్తం పార్టీ ఖండించింది. తొలుత ఎన్నికల సంఘం తన ఓటర్ల జాబితా సరిగ్గా ఉందని సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని డిమాండ్ చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ భాజపా ప్రతినిధిలా మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా విమర్శించారు.

## మరోసారి సబితకు హైకోర్టు నోటీసులు

తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం సబితా ఇంద్రారెడ్డి, కృపానందాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు- సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది.

## ప్రభుత్వ అసమర్థతతోనే తెలంగాణ నుంచి పారిపోతున్న పరిశ్రమలు

ఫాక్స్‌కాన్ పక్కనే భూములు కేటాయించామని తెలిపారు. తమ పారదర్శక పాలన, చిత్తశుద్ధి తో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ఆ సంస్థ, నేడు కాంగ్రెస్ అవినీతి, అసమర్థ పాలన కార ణంగానే రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని కేటీఆర్ విమర్శించారు.పెట్టుబడులు తేవడంలో, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రత్యేక కృషి ఏమీ లేదు..తెలంగాణ ఆటో పైలెట్ మోడ్ లో ఉందని కారుకూతలు కూసిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం వేరే రాష్ట్రాలకు తరలిపోతున్న పరిశ్రమలపై ఏం సమాధానం చెప్తారని కేటీఆర్ నిలదీశారు. రేవంత్ సిఎం అయ్యాక తెలంగాణ ప్రగతి ఆటో-డిస్ట్రక్షన్' (స్వయం విధ్వంసక) మోడ్‌లోకి వెళ్లిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. పదేళ్లపాటు కష్టపడి 'బ్రాండ్ హైదరాబాద్', 'బ్రాండ్ తెలంగాణ' ఇమేజ్‌ను బీఆర్‌ఎస్ నిర్మిస్తే, కొద్ది నెలల్లోనే దానిని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమీషన్ల మీద తప్ప పరిశ్రమలను నిలుపుకోవడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదని కేటీఆర్ మండిపడ్డారు.రాష్ట్రాభివృద్ధి, ఉద్యోగాల కల్పన లను పూర్తిగా గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, విచ్చలవిడిగా తెలంగాణ సంపదను దోచుకుంటుందని కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు తెలంగాణను ఏటీఎంగా మార్చి, ఇక్కడి సంపదను వారికి తరలించడం అనే పని మాత్రమే ఇవాళ ఆటో-పైలట్ మోడ్‌లో నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. తన ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడానికి ఢిల్లీ పెద్దలకు తెలంగాణను రేవంత్ రెడ్డి తాకట్టుపెట్టారని ఆరోపించారు.పెట్టుబడులకు స్వర్గధామంగా తెలంగాణను మార్చేందుకు గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అహరహం శ్రమించిందన్నారు కేటీఆర్. టీఎస్-ఐపాస్ వంటి విప్లవాత్మక విధానాలతో ప్రపంచస్థాయి కంపెనీలను ఆకర్షించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఆ కృషి అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిందని అన్నారు

## ఎట్టకేలకు.. తొలగించిన ఓటర్ల జాబితా విడుదల

కూడా ప్రదర్శించాలని, వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోర్టు సూచించింది. ఓటర్ల గుర్తింపు కోసం ఆధార్ కార్డును కూడా ఒక పత్రంగా అంగీకరించాలని కోర్టు ఈసీకి సూచించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ఈ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఓటరు జాబితాలలోని లోపాలను సరిచేయడానికి ఉద్దేశించినదని, "వోట్ చోరీ" ఆరోపణలను నిరాధారమైనవిగా తోసిపుచ్చారు. బీహార్‌లో జూన్ 24, 2025 నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభించారు. 2003 తర్వాత రాష్ట్రంలో జరిగిన మొదటి ఓటర్ జాబితా పరిశీలన. ఈ ప్రక్రియలో 1లక్ష బూత్ లెవల్ అధికారులు, 4 లక్షల మంది వాలంటీర్లు, 1.5 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు. జూన్ 24, 2025 నాటికి బీహార్‌లో మొత్తం 7.89 కోట్ల ఓటర్లు ఉన్నారు, వీరిలో 90.67% మంది ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించారు. 90.37% డిజిటైజ్ చేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ మొదలైనవి ఇలా చేయడాన్ని "వోట్ చోరీ"గా అభివర్ణించి, ఈసీ బీజేపీతో కుమ్మక్కై ఓటరు జాబితాను మార్చిందని ఆరోపించి

### సీఈసీపై అభిశంసన!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఓట్ల చోరీ జరిగిందని ఆరోపిస్తూ ఎన్నికల సంఘం లక్ష్యంగా విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తోన్న నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసనకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి సంబంధించి నోటీసును తీసుకువచ్చేందుకు ప్రతిపక్ష సభ్యులు యోచన చేస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆ వ్యవహారంపై తాము త్వరలో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ మీడియాకు వెల్లడించారు. సీఈసీని తొలగించాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం. అయితే ప్రతిపక్షాలకు పార్లమెంట్‌లో అంతమంది సభ్యులు లేరు. ఇలాంటి చర్యను బిజెపి కూడా అంగీకరించదు. ఓట్ల చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆందోళన కార్యక్రమం మొదలుపెట్టిన నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ ఆదివారం ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషీతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాహుల్ తదితరులు చేస్తున్న ఆరోపణలకు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. తన ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ తగిన ఆధారాలనైనా సమర్పించాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వద్ద ఆధారాలు ఉంటే వారం రోజుల్లో ప్రమాణపత్రం రూపంలో సంతకంతో సమర్పించాలని అల్టిమేటం జారీ చేసారు. అలా చేయనిపక్షంలో ఆరోపణల్ని నిరాధారంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఈసీ భుజాలపై తుపాకీ పెట్టి ఓటర్లను లక్ష్యంగా చేసుకొని రాజకీయాలు చేసేవారి ఆటలు సాగవని తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలోనే అభిశంసన వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉంటే.. ఓటు- చోరీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టు-పట్టడంతో ఎంపీల నినాదాల మధ్యే లోక్‌సభ కొనసాగుతోంది. మరోవైపు, రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడింది. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఓటు చోరీకి దొరికిన నూతన ఆయుధంగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఈమేరకు తన వాట్సప్ ఛానల్‌లో పోస్టు పెట్టారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసిన వారిని ప్రస్తుత జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు.

## భారత్ రష్యా నుంచి చమురు కొని లాభపడుతోంది

అదే రష్యా నుండి చమురు కొనుగొలు చేసి.. దాన్ని శుద్ధి చేసి ప్రపంచ మార్కెట్‌కు చైనా విక్రయిస్తోంది. ఒకవేళ.. చైనా మీద మీద గనుక అదనపు సుంకాలు విధించాల్సి వస్తే ఆ ప్రభావంతో ప్రపంచ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది" అని రుబియో వ్యాఖ్యానించారు.చైనాలో శుద్ధి అవుతున్న రష్యా చమురు గ్లోబల్ మార్కెట్‌లోకి వెళ్తోంది. ఒకవేళ చైనాపై అదనపు సుంకాలుగానీ, ఆంక్షలుగానీ విధించాల్సి వస్తే.. శుద్ధి చేసిన ఆ చమురు ప్రపంచ మార్కెట్‌కు అందదు. చమురు కొనుగోలు చేసే దేశాలు అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. లేదంటే.. ప్రత్యామ్నాయ వనరులు వెతకాల్సి ఉంటుంది. అంతెందుకు..చైనా నుంచి శుద్ధి చేయబడిన చమురును యూరప్ దేశాలే కొనుగోలు చేస్తున్నాయి. అదే సమయంలో.. యూరప్ దేశాలు స్వయంగానూ చమురు, సహజ వాయువును రష్యా నుంచి కూడా కొనుగోలు చేస్తున్నాయి. ఇంతకు ముందు.. చైనా, అమెరికాపై వంద శాతం సుంకాలు విధించాలనే సెనెట్ బిల్లు ప్రతిపాదనపై యూరోపియన్ దేశాలు పరోక్షంగా ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ ఆందోళన్నింటిని పరిగణనలోకి తీసుకునే ఆ పని చేయడం లేదు అని అన్నారాయన. మరి రష్యా నుంచి చమురు, సహజ వాయువును కొనుగోలు చేస్తున్న యూరప్ దేశాలపై సుంకాలు విధిస్తారా? అనే ప్రశ్నకు రూబియో బదులిచ్చారు. యూరప్ నేరుగా ఆంక్షలు, సుంకాల విధింపు గురించి నా దగ్గర స్పష్టమైన సమాచారం లేదు. కానీ, పరోక్షంగా విధించే అవకాశాలు మాత్రం లేకపోలేదని అన్నారాయన. ఈ విషయంలో యూరోపియన్ దేశాలతో టిట్ ఫర్ టాట్ తరహా వాదనలు చేయడం నాకు ఇష్టం లేదు. కానీ, ఈ సమస్యను పరిష్కరించడంలో యూరోప్ నిర్మాణాత్మక పాత్ర పోషించగలదని మాత్రం నమ్ముతున్నా అని రుబియో అభిప్రాయపడ్డారు.

## జెలెన్స్‌కీ కొన్ని త్యాగం చేయాల్సిందే..

క్రిమియాపై సర్వాధికారాలు రష్యావే. అలాగే ఉక్రెయిన్ నాటోలో చేరకూడదు అనే షరతులు ఉన్నాయి. అయితే జెలెన్స్కీ మాత్రం రక్షణపరంగా కీలక ప్రాంతాలైన తూర్పు భూభాగాల ఉపసంహరణను తిరస్కరిస్తూనే శాంతి చర్చలకు సిద్ధమయ్యారు. అలస్కా సమావేశం తర్వాత.. ట్రంప్ జెలెన్స్కీతో పాటు యూరోపియన్ నేతలతోనూ ఫోన్‌లలో మాట్లాడారు. పుతిన్‌తో జరిగిన చర్చల సారాంశాన్ని వాళ్లను చేరవేశారాయన. అంతేకాదు.. శాంతి చర్చల్లో పురోగతి కనిపించిందని కూడా ప్రకటించారు

### యుద్ధాన్ని ప్రపంచం నమ్మేలా ముగించాలి

మే యుద్ధం విరమించవచ్చు లేదా కావా లనుకొంటే కొనసాగించవచ్చు. కానీ, ఒబామా ఇచ్చేసిన క్రిమియాను మాత్రం తిరిగి పొందలేరు. మరో విషయం ఉక్రెయిన్ నాటో సభ్యత్వం పొందలేదు. కొన్ని విషయాలను మార్చలేము" అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. జెలెన్స్కీ-ట్రంప్ మధ్య గతంలో వివాదం జరిగిన నేపథ్యంలో ఈసారి భేటీకి పెద్దఎత్తున ఐరోపా, నాటో నేతలు తరలివచ్చారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీ ప్రధాని మెలోని, ఫిన్లాండ్ ప్రధాని అలెగ్జాండర్ స్టబ్, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్, నాటో చీఫ్ మార్క్ రుట్టె పాల్గొననున్నారు.

మాకూ సెక్యూరిటీ గ్యారెంటీ కావాలి: రష్యా

భవిష్యత్తులో జరగబోయే శాంతి ఒప్పందంలో తమకు కూడా సెక్యూరిటీ గ్యారెంటీ కావాలనిరష్యా పేర్కొంది. ఈ మేరకు రష్యా ప్రతినిధి మిఖాయిల్ ఉల్యానోవ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "చాలా ఐరోపా దేశాలు భవిష్యత్తు శాంతిఒప్పందంలో ఉక్రెయిన్ శాంతికి హామీ ఇవ్వాలని కోరుకుంటున్నారు. దీనికి రష్యా అంగీకరిస్తుంది. కానీ, అదే రక్షణ హామీ మా దేశానికి కూడా అవసరమే" అని పేర్కొన్నారు.

## వాహన లైఫ్‌టాక్స్ పెంపు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం వాహనాలపై లైఫ్‌టాక్స్ పెంచింది. ఆగస్టు 14 నుంచి కొత్త రేట్లు- అమల్లోకి వచ్చాయి. రవాణా, రోడ్లుభవనాల శాఖ జారీ చేసిన జీఓ నెం.53 ద్వారా మోటార్ వాహనాల పన్ను చట్టం, 1963లోని షెడ్యూల్స్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు రెండు, మూడు, నాలుగు చక్రాల నాన్-ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు పెరిగిన లైఫ్‌టాక్స్ వసూలు చేయనుంది. తాజా నిర్ణయం ప్రకారం, రూ.50 వేలు లోపు ధర కలిగిన రెండు చక్రాల వాహనాలపై ఇప్పుడు 9 శాతం పన్ను విధించనున్నారు. రూ.50 వేలు నుంచి ఒక లక్ష వరకు ఉన్న బైకులపై 12 శాతం పన్ను యథాతథంగా కొనసాగుతుంది. ఒక లక్ష నుంచి రెండు లక్షల మధ్యలో ఉన్న వాహనాలపై 15 శాతం, రెండు లక్షలకు పైబడిన వాటిపై 18 శాతం లైఫ్‌టాక్స్ వసూలు చేస్తారు. ఉదాహరణకు రూ.1.10 లక్షల బైక్ కొంటే ఇంతకుముందు రూ.13,200 పన్ను ఉండగా, ఇప్పుడు అది రూ.16,500కి పెరిగింది. నాన్-ట్రాన్స్‌పోర్ట్ నాలుగు చక్రాల వాహనాలపై కూడా ప్రభుత్వం భారీగా పన్ను పెంచింది. ఐదు లక్షలలోపు ధర కలిగిన కార్లపై 13 శాతం, పది నుంచి ఇరవై లక్షల మధ్య కార్లపై 18 శాతం, ఇరవై నుంచి యాభై లక్షల మధ్య వాహనాలపై 20 శాతం, యాభై లక్షలకు పైబడిన లగ్జరీ కార్లపై 21 శాతం లైఫ్‌టాక్స్ అమల్లోకి తెచ్చారు. అదనంగా కంపెనీల పేరుతో కొనుగోలు చేసే వాహనాలు, రెండో వాహనాలపై మరింత ఎక్కువ పన్ను విధించనున్నారు. కొన్ని కేటగిరీలలో ఇది 25 శాతం వరకు ఉండొచ్చు. అయితే విద్యుత్ వాహనాలకు మినహాయింపు ఇచ్చి వాటిపై ఎలాంటి లైఫ్‌టాక్స్ వసూలు చేయరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రాయితీ 2026 డిసెంబర్ 31 వరకు కొనసాగనుంది. ఈ పెంపుతో ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4,350 కోట్ల ఆదాయాన్ని లైఫ్‌టాక్స్ రూపంలో సమీకరించనుందని అంచనా. కానీ ఈ నిర్ణయాన్ని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు.

## ముంబయిలో రెడ్ అలర్ట్..

**భారీ వర్షాలతో వాణిజ్య రాజధాని అతలాకుతలం**

**మహారాష్ట్రలో వర్షాలు.. జగిత్యాల వాసులు గల్లంతు**



ముంబై(జనంసాక్షి):భారీ వర్షాలు ముంబయి నగరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్ అంతరాయాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.కొన్ని రోజులుగా కురుస్తున్న వానలకు రోడ్లు, రైల్వే లైన్లు, దిగువ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఆగస్టు 21 వరకు మహారాష్ట్ర, ముంబయిలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప పౌరులు ఇళ్ల నుంచి బయటకు రావద్దని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) విజ్ఞప్తి చేసింది. ముంబయిలోని పలు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకొనే అవకాశం ఉన్నందున పలు విమానయాన సంస్థలు అడ్వైజరీ జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందువల్ల ప్రయాణికులు కాస్త ముందుగానే విమానాశ్రయానికి చేరుకోవాలని ప్రముఖ విమానయాన సంస్థలు ఇండిగో , ఆకాశఎయిర్, స్పైస్‌జెట్ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. రోడ్లన్నీ జలమయమైనందున విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులు బయల్దేరే ముందు విమానానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి తమ వెబ్‌సైట్‌ను తనిఖీ చేసుకోవాలని ఇండిగో ప్రయాణికులకు సూచించింది. ప్రయాణికులు వీలైనంత త్వరగా విమానాశ్రయానికి చేరుకోవాలని ఆకాశ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. . కాగా మహారాష్ట్రలోని ఉద్గిర్ వద్ద జగిత్యాల జిల్లా వాసులు గల్లంతయ్యారు. వీరు మహారాష్ట్రకు వెళ్లి తిరిగివస్తుండగా.. కారు వరద నీటిలో కొట్టుకుపోయింది.ఈ ఘటనలో నలుగురు గల్లంతవగా.. ఓ బాలుడి ఆచూకీ లభ్యమైంది. మిగతా వారికోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితులను హసీనా, సమీనా, ఆఫ్రీన్‌గా గుర్తించారు.

# కోటా శ్రీనివాసరావు సతీమణీ మృతి



హైదరాబాద్, ఆగస్ట్ 18 (జనంసాక్షి) : దివంగత నటుడు కోట శ్రీనివాసరావు ఇంట మరో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సతీమణి రుక్మిణి సోమవారం కన్నుమూశారు. కోట శ్రీనివాసరావు జులై 13న తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన ఇకలేరన్న వార్త మరువక ముందే కోటా సతీమణి మృతి చెందడం కుటుంబ సభ్యులతోపాటు అందరినీ కలచివేస్తోంది. కోటా నట జీవితంలో పడి కుటుంబాన్ని సరిగా పట్టించుకో లేకపోయానని అనేకసార్లు పంచుకున్నారు. షూటింగ్స్ ఉండి నెలకో, రెండు నెలలకో ఓసారి ఇంటికి వచ్చిన సందర్భాలు ఉన్నాయన్నారు. తన పిల్లలు చిన్నతనంలో అచ్చటా ముచ్చట పెద్దగా చూసుకుంది లేదని బాధపడ్డారు. ఇక పిల్లలు చదువుకుని బుద్ధిమంతులవడానికి తన సతీమణితోపాటు ఇతర కుటుంబ సభ్యులే కారణమని తెలిపారు. కోట శ్రీనివాసరావుకు ఓర్పు ఎక్కువని, అందరితోనూ సరదాగా ఉంటారని రుక్మిణి ఓ సందర్భంలో పంచుకున్నారు.

# సైబర్ మోసగాళ్ల నుండి రూ.5489 కోట్ల స్వాధీనం

**12 లక్షలకుపైగా మొబైల్స్ బ్లాక్**

**13 లక్షలకుపైగా బ్యాంకు అకౌంట్ల సీజ్**

**సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ (సీఐఎస్) కార్యకలాపాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమీక్షలో అధికారుల వెల్లడి**

**ఆ సొమ్మును త్వరగా బాధితులకు అందేలా రూల్స్ ను సులభతరం చేయాలని ఆదేశం**




న్యూఢిల్లీ (జనంసాక్షి) : సైబర్ మోసగాళ్ల నుండి ఇప్పటి వరకు రూ.5489 కోట్లను రికవరీ చేసినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. ఆ సొమ్మును బాధితులకు రీఫండ్ చేసేలా నిబంధనలను సులభతరం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన కేసుల్లో సైబర్ కమాండోల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్ లోని తన కార్యాలయంలో సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ (సీఐఎస్) కార్యకలాపాలను కేంద్ర మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ) ప్రాధాన్యతను వివరించారు. సైబర్ నేరాలపై పోరాటంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కల్పించే ప్రధాన కేంద్రంగా ఐ4సీ పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సైబర్ మోసాల నియంత్రణలో భాగంగా తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రికి సంబంధిత శాఖ అధికారులు వివరించారు. సైబర్ మోసాల బాధితుల నుండి ఇప్పటి వరకు రూ.5489 కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు 12 లక్షలకుపైగా సిమ్‌లు/మొబైల్ హ్యాండ్‌సెట్లను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. అట్లాగే రూ.4631 కోట్లు విలువైన మోసపూరిత లావాదేవీలను అడ్డోవడం జరిగిందని, అందులో భాగంగా 13.3 లక్షల మ్యూల్ అకౌంట్లను (సైబర్ మోసాల్లో డబ్బు తరలించడానికి వాడే బ్యాంకు ఖాతాలు) ఫ్రీజ్ చేసినట్లు వివరించారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ)లో భాగంగా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్పీ) 1930 – సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎస్), సైబర్ మల్టీ ఏజెన్సీ సెంటర్ (సై మ్యాక్), రిపోర్ట్, చెక్ సస్పెక్ట్ సౌకర్యం, సస్పెక్ట్ రిజిస్ట్రీ, సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్, సైబర్ కమాండోల ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అట్లాగే కేంద్ర రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు, న్యాయమూర్తుల సామర్థ్యాల అభివృద్ధికి సైతం పలు కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# పరవళ్లు తొక్కుతున్న మంజీరమ్మ

*మహారాష్ట్రలో పుట్టి తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద ప్రవేశించే గోదావరి నది పొంగిపొర్లు తుండగా మరో పక్క గోదావరి నదికి ప్రధాన ఉప నది అయిన మంజీరా నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గల రెండు ప్రాజెక్టులైన శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండను తలపిస్తున్నాయి.*

– హైదరాబాద్ (జనంసాక్షి) :



శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి గేట్ల ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడం, ఇన్ ఫ్లో పెరుగడంతో సోమవారం ఉదయం 10.40 నిమిషాలకు 9 వరద గేట్లు ఎత్తి 25,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రవాహం పెరగడంతో అధనంగా 16 గేట్ల ద్వారా 50,000 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. గోదావరి, మంజీరా, హరిద్రా నదుల నుంచి వరద పోటెత్తడంతో ఎస్సారెస్పీ కి 1,25, 400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టియంసీలకు గాను 74.425టియంసీలు గా ఉంది. ప్రాజెక్టుకు లక్షన్నర క్యూసెక్కుల వరద వస్తుండటం, నిజాం సాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడంతో ప్రాజెక్టుకు మరింత వరద పెరిగే సూచనలు ఉన్నాయి. ఉదయం ప్రాజెక్టులోని ఇందిరమ్మ కాలువ ద్వారా నీటి విడుదలను 18,000 క్యూసెక్కులకు పెంచారు. కాకతీయ కాలువ ద్వార 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ 16 వరద గేట్ల, కాలువల ద్వారా 76,867 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది

**నిజాం సాగర్ నుండి 15 గేట్లు ఎత్తివేత**

నిజాం సాగర్ ప్రాజెక్టుకు వరద పోటేత్తడంతో ప్రాజెక్టు అధికారులు వరద గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. అదివారం రాత్రి 7 గేట్లను ఎత్తి 53,500 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదిలిన అధికారులు సోమవారం ఉదయం 13 గేట్లను ఎత్తి 85,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15. 667 టీఎంసీల నీరు నిల్వఉంది. 85,000 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రాజెక్టు అధికారులు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంజీరా నదికి వరదలు రావడం, సింగూర్ డ్యాం నుంచి 43,634 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుండటంతో నిజాం సాగర్ ప్రాజెక్టు నీటి విడుదలను పెంచినట్లు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద నీటి విడుదలను జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ప్రాజెక్ట్ అధికారులు పర్యవేక్షించారు. అనంతరం అధికారులు మరో 3 గేట్లను ఎత్తారు. దీంతో నిజాంసాగర్ నుండి 15 గేట్ల ద్వారా నీరు విడుదల అవుతోంది.

## రామంతపూర్ ఘటనపై మంత్రి కోమటిరెడ్డి విచారం

హైదరాబాద్ (జనంసాక్షి) : రామంతపూర్ గోకులే నగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి శోభాయాత్ర సందర్భంగా జరిగిన దుర్ఘటనలో అయిదుగురు మరణించడం, మరికొంతమంది గాయపడ్డ విషయం తెలిసి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చలించిపోయారు. అత్యంత విషాదఘటనగా పేర్కొంటూ తన బాధను వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారికి అందుతున్న చికిత్స,ప్రస్తుత పరిస్థితి అడిగి తెలుసుకొని,మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు.

## యూరియా కొరతను తీర్చండి

**రాష్ట్ర మంత్రి తుమ్మలకు తెలంగాణ రైతు ఐక్యవేదిక వినతి**



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా తక్షణమే తగు చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హైదరాబాద్ లోని సచివాలయంలో సోమవారంనాడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఏర్పడడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారనీ, వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను కేటాయించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందనీ, వ్యవసాయ పంటలకు సరైన సమయంలో యూరియా వేయకపోతే పంటల దిగుబడి తగ్గి అరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల వ్యవసాయ పంటల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియా కొరత లేకుండా తక్షణమే తగు చర్యలు తీసుకోని రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమర్పించిన వినతి పత్రంలో తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ముంపు ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన



మంగపేట ఆగస్ట్ 18 (జనంసాక్షి) : మండలంలో సోమ వారం తెల్ల వారుజామున నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు. వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి కమలాపురం గ్రామంలోని ఎర్ర వాగు ఉధృతంగా ప్రవహించడంతో మంపు ప్రాంతమైన ఇందిరా కాలనీ జలమయమయ్యింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క స్థానిక అధికారులు, కార్యకర్తలతో కలిసి ఇందిరా కాలనీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఏటూరునాగారం బూర్గంపహాడ్ ప్రధాన జాతీయ రహదారి 163 వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వరద ఉధృతిని పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.


# రామప్ప లక్నవరంలను అభివృద్ధి చేస్తాం

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



ములుగు ప్రతినిధి, ఆగస్టు 18(జనంసాక్షి) : రామప్ప, లక్నవరం ను అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోనే ములుగు ప్రాంతాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు మండలం ఇంచెర్ల గ్రామములో 37 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఎకో ఎత్నిక్ విలేజ్, డెవలప్మెంట్ వర్క్స్ ఫౌండేషన్ స్టోన్ ను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ తెలంగాణ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నానని, వివిధ ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటక ప్రాంతాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యూనిస్కో గుర్తింపు పొందిన రామప్ప, లక్నవరం, మేడారం సమ్మక్క సారలమ్మ, బోగత జలపాతం, బ్లాక్ బెర్రీ, దట్టమైన అటవీ ప్రాంతాలలో పర్యాటకులను ఆకర్షించే విధంగా ఇప్పటికే పలు రకాల పనులను పూర్తి చేయడం జరిగిందని, మిగతా పనులను త్వరతగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. లక్నవరంలో మరో రెండు ఐలాండ్ పనులను చేపట్టడమే కాకుండా పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అదనపు నిధులను తీసుకురావడం జరిగిందని అన్నారు.

## చింతపల్లి సాయి బాబా దేవాలయాన్ని దర్శించుకున్న ఉప్పల





హైదరాబాద్ (జనంసాక్షి) : నల్గొండ జిల్లాలో గల తెలంగాణ షిరిడీ చింతపల్లి సాయి బాబా దేవాలయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నం వేణు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ స్వర్ణ రథం ప్రారంభంలో ఉప్పల**

ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ వాసవి నగర్‌లో శ్రీ శ్రీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో జరిగిన శ్రీ స్వర్ణ రథం ప్రారంభంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నం వేణు, అలంపల్లి నర్సింహులు గుప్తా, భద్రయ్య, రమేష్, స్వర్ణ రథ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పానుగంటి మలయ్య, కార్యదర్శి మురళి, కోశాధికారి వాసా వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణ కార్యదర్శి రాచమల్ల వెంకటేశ్వర్లు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చీదేళ్ల వెంకటేశ్వర్లు కార్యదర్శి ప్రభాకర్ , కోశాధికారి కొత్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక విప్లవానికి తెలంగాణ ఆదర్శం

**సామాజిక న్యాయానికి, ధర్మానికి పాపన్న విగ్రహం పునాది**

**సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

సామాజిక విప్లవానికి దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శమని, సామాజిక న్యాయానికి కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ యావత్ క్యాబినెట్ నిర్ణయాత్మక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని కుల గణన రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా చేపట్టి బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ కు పంపామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య దేశంలోనే చర్చకు దారితీసింది, కేంద్రం అనివార్యంగా కులగనన చేపట్టాల్సిన పరిస్థితిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. అనేక అడ్డంకులు ఉన్నప్పటికీ వాటన్నిటినీ అధిగమించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని ప్రతి బహుజనుడు ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. బహుజన బిడ్డలు భవిష్యత్తులో ఫలాలు పొందేందుకు అందరూ సిద్ధంగా ఉండాలి ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకొని కాపాడాలని డిప్యూటీ సీఎం కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న పోరాట మార్గం, పోరాట స్ఫూర్తి అందరికీ గుర్తుకు వచ్చే విధంగా సెక్రటేరియట్ ముందు భాగాన విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సెక్రటేరియట్ ఎదురుగా పాపన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించడం స్ఫూర్తిదాయకం అన్నారు. సామాజిక న్యాయానికి, ధర్మానికి పాపన్న విగ్రహం పునాది అన్నారు. ఏమీ లేని రోజుల్లోనే పాపన్న అన్ని కులాలను కలుపుకొని అనుకున్నది సాధించారు వారి మార్గంలో మనందరం అడుగులు వేయాలి అన్నారు. విగ్రహ ఏర్పాటు, సెక్రటేరియట్ ఎదురుగా స్థలాన్ని ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలపాలి అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేసింది కొన్ని రాజకీయ పార్టీలు రకరకాలుగా ప్రచారం చేస్తున్నాయి, వారికి స్పష్టంగా సందేశం ఇవ్వడం కోసం నిలబడిన ప్రజా ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గుండెల్లో పెట్టుకొని కాపాడాలి అన్నారు.

# స్వర్ణ ప్రాజెక్టు సందర్శించిన ఎస్పీ జానకి షర్మిల




సారంగాపూర్,ఆగస్టు18 (జనం సాక్షి) : మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల సారంగాపూర్ మండలంలో స్వర్ణ ప్రాజెక్టు తో పాటు కోత గురైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలు వర్షాల కారణంగా జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా సమస్యలుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రాబోయే రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందని ఎస్పీ తెలిపారు. పాత ఇళ్లు, గుడిసెల్లో ఉంటున్నవారు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. స్వర్ణ ప్రాజెక్ట్ పరివాహక ప్రాంత ప్రజలు, పశువుల కాపరులు అటువైపు వెళ్లవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షించడానికి బ్లూ కోల్టు, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్పీతో పాటు ఏఎస్పీ రాజేష్ మీన ఐపీఎస్, రూరల్ ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐ.లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ గణపతి మండపం వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

**పెద్దపెద్ద శబ్దాలు చేసే డీజేలకు అనుమతి లేదు**


**ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి): ప్రతీ గణపతి మండపం వద్ద సీసీ టీవి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అదేవిధంగా పెద్ద పెద్ద శబ్దాలు చేసే డీజేలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. త్వరలో రానున్న వినాయక చవితి పండుగను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం గణపతి మండప నిర్వహ కమిటీ సభ్యులు మరియు హిందూ ఉత్సవ సమితి సభ్యులతో సమన్వయ సమావేశాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం ఉదయం స్థానిక పట్టణంలోని తానిషా గార్డెన్ ఏర్పాటు చేయడం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని మండప నిర్వహణ కమిటీలు సభ్యులకు పలు సూచనలు చేశారు. గణపతి విగ్రహాల ఏర్పాటు అనే పండుగ, ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పోలీసు యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని మండప నిర్వహణ కమిటీ సభ్యులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. మండప నిర్వహణ కమిటీ సభ్యులకు ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకుని వివరాలను నమోదు చేయాలని సూచించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ రూరల్,ఆగస్టు 18(జనం సాక్షి) : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం లక్ష్మణచందా మండలం కనకాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఇటీవల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని,వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్ల చుట్టూ చెత్త,నిల్వ నీరు ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డా.రాజేందర్,మండల ప్రత్యేక అధికారి అంబాజీ,తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధ,వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మోడీ చేతిలో ఎన్నికల సంఘం

# కీలుబొమ్మేనా?




"కనురెప్పలు కాటేస్తే కాపెవ్వరు కంటికి "అన్నచందంగా ఉంది నేటి ఎన్నికల సంఘం తీరుతెన్నులు. ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాం గ సంస్థ అయినప్పుడు ఎన్నికలను నిష్పక్షపాతముగా ఎందుకు నిర్వహించడం లేదు ?, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎందుకు అమలు చేయడం లేదు? ఎన్నికల సమయంలో జరిగే అవక తవకలను ఎందుకు నివారించ లేకపోయింది ? ప్రజాస్వా మ్యానికి వెన్నె ముక లాంటి ఎన్నికల సంఘం మునుపెన్నడు లేనంత అవిశ్వాసా నికి గురి కావడానికి కారణము ఏమి ? గ్లోబల్ లీడర్ గా చలామణి అవుతున్న ప్రధాని మోడీ గారి పరిపాలన రాజ్యాంగ విరుద్ధంగా ఉందని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈసికి సంధించిన ప్రశ్నలు సంచలనం రేకెత్తించాయి

- డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచి పెడుతున్నారు ?
- సిసి ఫుటేజీని ఎందుకు ఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు ?
- నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు ?
- విపక్షాలను ఈ.సి ఎందుకు భయపెడుతుంది ?
- బిజెపి ఏజెంట్‌గా మారిపోయిందా ?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసినా జవాబు ఇవ్వకపోవడం అనుమానాలను మరింత బలోపేతం చేస్తున్నాయి. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ప్రజలకు ఉన్న ఓటు హక్కు పై ఈసీ దాడి చేస్తుందని ఇది కేవలం తన గొంతుక కాదని యావత్ హిందుస్థాన్ గొంతుక అని రాహుల్ గాంధీ చెప్పడం సరైనది ప్రజలు సంకేతాలు ఇస్తున్నారు.. ఇది ఇలా ఉండగా సి.పి. ఎం .పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు బిజెపి నియో ఫాసిస్టు విధానాలను దుయ్యబట్టారు. బిజెపి, నిరంకుశ పరిపాలన చేస్తున్నదని ఎన్నికల సంఘాన్ని తన జేబులో పెట్టుకొని ఆట ఆడిస్తుందని, రాజ్యాంగాన్ని మార్చి మను ధర్మాన్ని అమలు చేస్తుంద న్నారు. రాజ్యాంగ పీఠిక నుంచి లౌకికవాదం, సోషలిస్టు పదాలను తొలగించాలని బిజెపి భావిస్తున్నదని ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమని నొక్కి వక్కాణించారు. మరో పక్క రాహుల్ గాంధీకి ఈసి నోటీస్ ఇచ్చినందుకు ఈసిపై కర్ణాటక డిప్యూటీ సీఎం. డికె శివకుమార్ ఫైర్ అయ్యారు. నోటీసులు ఇచ్చే అధికారం ఈసికి లేదని బిజెపి విధానాలను వ్యతిరేకించారు. ఇంకో పక్క తమిళనాడు ముఖ్యమంత్రి డిఎంకె చీఫ్ ఎం.కె స్టాలిన్ రాహుల్ గాంధీ ఈసీపై చేసిన ఆరోపణలు పూర్తి గా మద్దతు తెలపడం గమనించదగిన విషయం. బిజెపి ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే అపహాస్యం చేస్తుంటే మౌనముగా ఉండలేమని స్టాలిన్ వ్యాఖ్యానించారు. మరో వైపు ఓటరు సరళిని మార్చేందుకు కుట్రలు చేస్తుందని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఎన్నికల సంఘం పై ధ్వజమెత్తారు. బీహార్‌లో 65 లక్షల మంది తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని తమిళనాడు లో 6.5 లక్షల మంది ఓటర్లు పెరగడం ఆందోళనకరమైన విషయమని చెప్పారు.

దేశములో ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆనాటి జర్మని నాజీల పాలన లక్షణాలు గుర్తుకు తెస్తున్నాయని విమర్శకులు, మేధావులు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమర్శించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నారు. విపక్ష పార్టీలు వారి కుటుంబ సభ్యులపై సిబిఐ, ఐటి వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా వారిని బలహీన పరిచే కార్యక్రమం మోదీ ప్రభుత్వం చేస్తుంది నిరంకుశ విధానాన్ని ఎండగడితే కక్ష్య సాధింపు చర్యలా? అధికార పార్టీని ప్రశ్నించినప్పుడే ప్రభుత్వ పాలన గాడిన పడుతుంది. ప్రజాస్వామ్యం లో రాజ్యాంగం ఇచ్చిన హక్కు.దీనిని ఎవరు కాదన లేరు. ఏ లాంటి నేరం చేయక పోయినా, దేశములో అనేక మంది కవులు, రచయి తలు, ప్రొఫెసర్లు, జైళ్లలో మగ్గుతు న్నారు. మీడియాకు స్వేచ్ఛ లేకుండా పోయింది. వివిధ కారణాలతో జర్నలిస్టులను అరెస్ట్ చేస్తున్నారు.ప్రస్తుత ఎలెక్ట్రానిక్ మీడియా ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు చోటివ్వకుండా ప్రభుత్వ భజన చేస్తున్నది. ఇదీ ఒక ప్రజాస్వామ్యమేనా? అని సందేహం వస్తుంది. ఈ విషయం రాజకీ యాలకు అతీతంగా సామాజిక అంశముగా పరిగణించి ప్రతి పౌరుడు స్పందించాలి. ఇది విమర్శ కాదు.

**నేటి భారతంలో బాగోతం.**

ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం యొక్క అరాచకాలను దేశము లోని పలు రాష్ట్రాలలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పకడ్బందీగా రుజువుచేశాడు.దీనితో దేశములో కల కలం పుట్టింది "యదార్ధ వాది లోకవిరోధి ." అన్న చందంగా ఉంది. తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని రుజువు చేసుకో వాల్సిన అవసరం ఉంది కాని చేసిన తప్పులను సమర్థించుకోవడం ఈ సి హెూదాకు సరైనది కాదు. అందుకే దేశము లోని ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఉద్యమ బాట పట్టారు.దాదాపు 300 మంది లోక సభ రాజ్య సభ సభ్యులు పార్లమెంట్ నుండి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. రాహుల్ గాంధీ ని పోలీస్ లు అరెస్ట్ చేశారు .ప్రజల్లో చైతన్య ఎగసి పడితే చట్టాలు ప్రభుత్వాలు ఏమి చేయలేవు ఆ తరుణం కూడా ఆసన్నమైంది. "పండిన పండు నేల రాలక తప్పదు" 14 ఆగస్టు 2025న సుప్రీం కోర్టు ధర్మాసనం జస్టిస్ సూర్యకాంత్,జస్టిస్ ఉజ్జల్, నేతృత్వంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను జిల్లాల వారిగా వెబ్సైట్‌లలో ప్రచురించాలి. ప్రతి తొలగింపుకు కారణాలు స్పష్టంగా పేర్కొనాలి. ఓటర్ ఐడి నెంబర్లతో "సెర్చిబుల్ ఫార్మాట్" లో ఉండాలి.ఆగస్టు 19 లోపు ఈ పని పూర్తి చేయాలని అన్ని వార్తా పత్రికలకు సోషల్ మీడియాకుకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. ఇదే కాకుండా తొలగించిన వారి పేరు తిరిగి చేర్చాలంటే ఆధార్ గుర్తింపు పత్రముగా అంగీక రించాలని కూడా సూచించింది.

కాంగ్రెస్ పార్టీ విపక్షాలు ఈ తీర్పును ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణిం చారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ఓటర్ల హక్కును పునరుద్ధరించడంతో అసలైన జాతీయ పండుగ చేసుకొని హర్షం ప్రకటించారు. అయినప్పటికీ ఎన్నికల సంఘం స్వతంత్ర పై ప్రశ్న. ప్రశ్న గానే ఉండిపోయింది.త్రిసభ్య కమిటీ ఏర్పడింది ఎన్నికల సంఘం ను ఏర్పాటు చేయుటకు.దానిలో ప్రధాన న్యాయమూర్తి ఉండాల్సింది.అతని పేరును తొలగించి కేంద్ర మంత్రి పేరు పెట్టడం లో అంతరార్థ మేమి? మోడీ ప్రభుత్వం ఇష్టం వచ్చిన రీతిలో ఆడుకోవచ్చు అనే ఉద్దేశ్యంతో చేసిన పనే అని అనుకోక తప్పదు.. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.

ఏది ఏమైనా ప్రధాని మోడీ నాయకత్వంలో భారత దేశ ఆర్థిక వ్యవస్థ చురుకుగా ముందుకు సాగుతుందని ఎస్అండ్ పి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం దేశ ఆర్థిక అభివృద్ధికి సంకేతం. ప్రపంచములో అత్యుత్తమ ఆర్థిక వ్యవస్థ లలో భారత్ కూడా ఒకటని వెల్లడించింది. అమెరికా మన దేశ ఎగుమతుల పై 50 శాతం సుంకాలు విధించినా వృద్ధి మందగించ బోదని తెలియచేసింది. మతాల కతీతంగా నిష్పక్షపాతముగా ,రాజ్యాంగానికి లోబడి పరిపాలించిన ఏ నాయకుడు అయినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తాడు అందులో సందేహం లేదు.

**అభివృద్ధికి ఆర్థిక క్రమశిక్షణ కీలకం.**

న్యాయ వ్యవస్థ కలుషితం గాకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడ వలసిన అవసరం ఉంది.అప్పుడే మన దేశం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుంది. అన్ని కోణాలలో ముందు వరుసలో ఉండాలని ఆశిద్దాం.



**పూసాల సత్యనారాయణ**
హైదరాబాద్
9000792400

# గురు గౌరవం

## విలువల పునరుద్ధరణ అవసరం



ఒకప్పుడు సమాజంలో గురువు స్థానమే అత్యున్న తమైనది. "గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వరః" అనే శ్లోకం ప్రతి ఇంట్లో వినిపిం చేది. గురువు మాటే విద్యార్థికి ధర్మం. ఆయన చెప్పిన మార్గమే జీవిత మార్గం. ఆ కాలంలో విద్యార్థులు గురువుల పట్ల భయం, గౌరవం, క్రమశిక్షణతో నిండిపోతూ ఉండేవారు. గురువు చూపిన దిశలోనే నడుస్తూ, ఆయన ఉపదేశాన్ని జీవితాంతం మరిచి పోకుండా పాటించే వారు. కానీ కాలం మారింది.మార్పు మంచి దిశలో కూడా వచ్చింది, కానీ కొన్ని సందర్భాల్లో ఈ మార్పు ప్రతికూ ల ప్రభావాలు చూపిస్తోంది. నేటి తరంలో కొంతమంది విద్యార్థు లు గురువుల పట్ల గౌరవం, మర్యాద తగ్గించుకుంటున్నారు. భయం అనే పదం పూర్తిగా మాయమైపోయింది. "భయం" అనే పదాన్ని ఇక్కడ ప్రతికూల అర్థంలో కాకుండా, క్రమశిక్షణకు బలమైన సాధనంగా భావించాలి. ఒకప్పుడు ఆ భయం విద్యార్థిలో నిబద్ధతను, శ్రద్ధను పెంచేది.

**ప్రస్తుతం గురువు పట్ల ఉన్న తీరు**

ప్రస్తుతం, కొన్ని సందర్భాల్లో గురువుల పట్ల అనుచిత ప్రవర్తన, అవమానకర వ్యాఖ్యలు, శారీరక దాడులు జరగడం మనం చూస్తు న్నాం. ఇది సమాజంలో పెద్ద ఆందోళనకు కారణం. గురువుల పట్ల గౌరవం తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి.సాంకేతిక ప్రభా వం ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉన్న సమాచారంతో విద్యార్థు లు గురువు అవసరాన్ని తక్కువగా అంచనా వేయడం.కొంతమంది తల్లిదండ్రులు పిల్లల తప్పులను కప్పిపుచ్చుతూ, గురువు చెప్పిన సూ చనలను నిర్లక్ష్యం చేయడం. సామాజిక మార్పులు విలువల క్షీణత, వ్యక్తిగత స్వేచ్ఛను తప్పుగా అర్థం చేసుకోవడం వంటివి ఉన్నాయి.

**తీసుకోవాల్సిన చర్యలు**

గురువు ప్రతిష్టను దెబ్బతీసే ఘటనలు, సంఘటనలు ఎత్తి చూపడం. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి, సమాజం మొత్తంగా చర్యలు తీసుకోవాలి పిల్లల్లో చిన్నప్పటి నుంచే విలువల బోధన గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞత, క్రమశిక్షణ నేర్పించడం.తల్లిదండ్రులు గురువుల సమన్వయం పిల్లల సమస్యలు, ప్రవర్తన గురించి ఇద్దరూ కలసి పరిష్కార మార్గాలు కనుగొనడం.సమాజంలో గురువు ప్రతిష్ట పెంపు మంచి గురువుల కృషిని ప్రోత్సహించడం, సన్మానించడం. వంటివి చేయడం మంచిది.చట్టపరమైన రక్షణ గురువులపై అనుచిత ప్రవర్తన జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం వంటివి చేయాలి.గురువువిద్యార్థి బంధం కేవలం పాఠశాలలోనే కాదు, ఒక సమాజపు భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రధాన సంబంధం. ఈ బంధం దెబ్బతింటే, భవిష్యత్తు తరాలు నైతిక విలువలు కోల్పోయే ప్రమాదం ఉంది.కాబట్టి, గురువుల పట్ల గౌరవాన్ని పునరుద్ధరించడం మన అందరి బాధ్యత.ఎందుకంటే "గురువులే జ్ఞాన దీపాలు వారు వెలిగిస్తేనే సమాజం వెలుగుతుంది.

**మలిపెద్ది పవన్ కళ్యాణ్** గుండాల 7093052815.

## ఆనవాళ్లు

పండే పొలాలను
చెరిపే రాజ్యమూ
తలమీది నీడను
తగలబెట్టె పాలనా
అడుగు కదిపి
కదిల్తే నరకము
గొంతెత్తి అడ్గితే
యమ గోసలూ
ప్రజాస్వామికత
ఆనవాళ్ళివేనా
అడిగినోళ్ల ఎల్లరి
బతుకు పాడెనే
ధన స్వాములు
సాదిన దుర్గమిది
కార్పొరేట్ల కిచ్చిన
భూతల స్వర్గము
నా క్షేమం నీ క్షేమం
వీళ్ళకసలు పట్టదు
నీ బిడ్డల నా బిడ్డల
బతుకీడ శూన్యమే
పల్లెటూర్ల దిగమింగి
వన్నెక్కును పట్నాలు
ప్రభుత్వాల ఘనతిది
ప్రజలెల్లా బికారులు

**డా.ఇక్బాల్ పాషా**
9440775732




ధిక్కారపు గర్జనతో విశ్వవిద్యాలయ వేదికను వణికించిన ధైర్యవంతురాలు జీన్ జోసెఫ్! తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి చేతుల మీదుగా పిహెచ్.డి పట్టా తీసుకోవడానికి నిరాకరించి, వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్ నుండి స్వీకరించి, అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. "ద్రవిడ నమూనాను నమ్ముతాను... తమిళ సంస్కృతికి వ్యతిరేకి నుండి డిగ్రీ ఎందుకు?" అంటూ ఆమె ప్రశ్నలు గవర్నర్ దురాగతాలను బట్టబయలు చేశాయి. ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధ నిరసనల్లాగే, ఈ స్నాతకోత్సవంలో జీన్ ధైర్యం ప్రజాస్వామిక గళాలను మరింత బలపరిచింది. గవర్నర్-ముఖ్యమంత్రి ఘర్షణల నేపథ్యంలో, ఆమె చర్య రాజకీయ ఆధిపత్యానికి ఎదురుదెబ్బ! ప్రజానీకం ప్రశంసలు కురిపిస్తున్న ఈ ఉదంతం, విద్యార్థులు సమాజ అన్యాయాలపై ఎలా పోరాడాలో చూపించింది. ధిక్కారస్వరం నినదిస్తున్న ఈ క్షణం, తమిళనాడు చరిత్రలో సరికొత్త అధ్యాయం!

## గవర్నర్‌పై నినదించిన

# ధిక్కారస్వరం

ఇటీవలి కాలంలో విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకలలో చోటు చేసుకుంటున్న నిరసనలు ప్రజాస్వామిక గళాలను సమున్నతంగా ఎత్తిపడుతున్నాయి. అమెరికాలోని ప్రతిష్టాత్మక మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి)లో అభ్యసించిన భారత సంతతి విద్యార్థిని మేఘా వేమూరి మే నెల 29 నాడు 'గ్రాడ్యుయేషన్ డే' సందర్భంగా ప్రసంగిస్తూ ప్రధానంగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధ చర్యలను 'నరమేధం'గా పేర్కొనడం తద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించి స్వేచ్ఛా పాలస్తీనా కోసం సంఘీభావాన్ని ప్రకటించారు. తాజాగా అదే కోవలోనే ఈ నెల 13 నాడు తిరునల్వేలి లోని మనోన్మణియం సుందరనార్ యూనివర్సిటీ (ఎం.ఎస్.యు) 32 వ స్నాతకోత్సవ కార్యక్రమంలో నాగర్కోయిల్ ప్రాంతానికి చెందిన పిహెచ్‌డి స్కాలర్ జీన్ జోసెఫ్ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్. రవి నుంచి తన డాక్టరేట్ పట్టాను స్వీకరించడానికి నిరాకరించి ఉద్దేశ పూర్వకంగా వైస్ ఛాన్సలర్ నుంచి డాక్టరేట్ పట్టాను స్వీకరించి స్నాతకోత్సవ వేదికగా ధిక్కారస్వరంతో నినదించడం విశిష్ట ప్రాధాన్యాన్ని చేకూర్చింది. తద్వారా ఆమె గవర్నర్ ఆర్.ఎన్.రవి అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఆ వేదికగా ద్వారా బాహాటంగానే ఎత్తిచూపారు అని చాలా స్పష్టంగా చెప్పవచ్చు.

జీన్ జోసెఫ్ ఎంబిఏ పట్టా పొందిన తర్వాత పిహెచ్‌డి కార్యక్రమంలో భాగంగా 'మైక్రో ఫైనాన్స్' పై పరిశోధన చేశారు. 'నేను ద్రవిడ నమూనాను నమ్ముతాను. తమిళం మరియు తమిళనాడుకు వ్యతిరేకమైన గవర్నర్ నుండి నేను ఎందుకు డిగ్రీ పొందాలి? డిగ్రీని ప్రదానం చేయడానికి ముఖ్యమంత్రి లేదా ఉన్నత విద్యా శాఖా మంత్రి వంటి వారు మనకు లేరా? అని నాకు నేనుగా ప్రశ్నించుకున్నాను. నేను తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి గురించి అనేకంగా శోధించాను. ఆయన తమిళనాడు సంస్కృతి పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. అలాగే ఆయన తమిళులకు మరియు తమిళనాడుకు ఏమీ చేయకపోగా రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా మరియు తమిళ భాషకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. అందువలన తమిళనాడు గవర్నర్గా ఆయన తమిళం మరియు తమిళనాడుకు పెద్దగా ఏమి చేయలేదు. ఆ విధంగా ఏమి చేయని ఆ గవర్నర్ నుండి నేను డాక్టరేట్ పట్టాను తీసుకోకూడదు అని బలంగా నిర్ణయించుకున్నాను. అందువలన గవర్నర్ నుండి డాక్టరేట్ పట్టాను స్వీకరించడానికి నా మనసు ఇష్టపడలేదు' అని ఆమె చాలా స్పష్టంగా వ్యాఖ్యానించడం గమనార్హం.

ద్రవిడ నమూనా ప్రభుత్వ విధానాలపై గవర్నర్ ఆర్ఎన్.రవి వ్యతిరేకతను కొనసాగిస్తున్న తరుణంలోను ఆయన నుండి జీన్ జోసెఫ్ పిహెచ్‌డి పట్టాను నిరాకరించిన సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు చేయడం సంచలనం సృష్టించడమే కాకుండా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ఈ తరుణంలో ఆమె చూపిన ధైర్యాన్ని ప్రజానీకం ప్రశంసిస్తూనే ఉన్నారు. 'ద్రవిడ మోడల్ ప్రభుత్వంపై నాకు నమ్మకం ఉంది. ద్రవిడ నమూనాను విశ్వసించే వ్యక్తిగా ఏదైనా సాధించిన వ్యక్తి నుండి నేను దానిని పొందడం అవసరమని నేను భావించాను. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ చాలా మంచి పనులు చేశారు. కాబట్టి ఆయన సరైన వ్యక్తి అని భావించి వైస్ ఛాన్సలర్ నుండి డాక్టరేట్ పట్టాని స్వీకరించాలని నేను ముందే నిర్ణయించుకున్నాను. ఎవరి నుండి డిగ్రీ పొందాలి అనే విషయంలో అభ్యర్థి ఎంపిక చేసుకునే స్వేచ్ఛ తప్పకుండా ఉండాలి. నేను స్నాతకోత్సవ వేదిక నుండి నా సీటుకు తిరిగి వచ్చినప్పుడు నా చుట్టూ ఉన్న కొంతమంది నాతోటి అభ్యర్థులు గవర్నర్ను పట్టించుకోకుండా వైస్ ఛాన్సలర్ నుండి డాక్టరేట్ పట్టాను సేకరించిన నా నిర్ణయాన్ని అభినందించారు' అని ఆమె పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించాలి.

నిజానికి గవర్నర్ వ్యవస్థ రాజ్యాంగబద్ధమైనదే అయినను కూడా ఆయా గవర్నర్లు రాజ్యాంగానికి అతీతంగా ఆయా రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న సందర్భాలు ఎన్నో చోటుచేసుకుంటూనే ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రంలో బిల్లులను గవర్నర్ తొక్కిపెట్టిన క్రమంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి మరియు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మధ్య ఘర్షణలు చోటుచేసుకున్న పరిణామాలు సంభవించాయి. ఒక దశలో తమిళనాడు అసెంబ్లీ నుండి ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్. రవి సభ నుండి అర్ధాంతరంగా నిష్క్రమించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చగా మిగిలింది. 'గవర్నర్ ఆర్ఎన్. రవి అనుసరిస్తున్న ఈ రకమైన అప్రజాస్వామిక విధానాలు కూడా జీన్ జోసెఫ్ ఉద్దేశపూర్వకంగా వైస్ ఛాన్సలర్ నుంచి డాక్టరేట్ పట్టాను స్వీకరించడానికి దోహదం చేశాయి' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. అప్రజాస్వామికంగా వ్యవహరించే ఆయా గవర్నర్ల రాజకీయ ఆధిపత్య ధోరణులు ప్రజాస్వామ్యంలో ఏమాత్రం సహేతుకం కావు. అందువలన ఇకనైనను ఆయా గవర్నర్లు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. 'విద్యార్థులు మరియు పరిశోధకులు పట్టాలు స్వీకరించడం కోసమే అన్నట్లు మాత్రమే కాకుండా సమాజంలో చోటుచేసుకుంటున్న అప్రజాస్వామిక విధానాలను సైతం నిరసించాల్సిన ఆవశ్యకతను జీన్ జోసెఫ్ ఉదంతం నొక్కి చెప్తూనే ఉంది' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. అంతిమంగా 'గవర్నర్ ఆర్.ఎన్.రవి అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాల మూలంగా జీన్ జోసెఫ్ ఆయన నుండి పిహెచ్.డి పట్టాను నిరాకరించి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ నుండి స్వీకరించి గవర్నర్పై ధిక్కారస్వరంతో నినదించి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు' అని సగర్వంగా చెప్పవచ్చు.



**జె.జె.సి.పి.బాబూరావు**
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## బిఎస్ రాములు విప్లవ జీవితం నుండి సామాజిక

# వికాస ఆలోచనల వరకు

**(బిఎస్ రాములు 75 - అమృతోత్సవం)**




చాంద్ పాషా అనే విద్యార్థి చనిపోయాడు. రైతు కూలి సంఘాల నేతృత్వంలో గ్రామాల్లో భూస్వాముల ఆక్రమణలో ఉన్న బంజరు, పోరంబోకు భూములను భూమిలేని రైతులు, వ్యవసా య కూలీలు దున్నుకున్నారు. పనులు బందు పెట్టి కూలి రేట్లు, జీతాలు పెంచుకున్నారు. ఈ తిరుగు బాటును దొరలూ జీర్ణించుకోలేకపోయారు. ప్రాణభయంతో ఊర్లు వదిలిపెట్టారు. రోజురోజుకు దావాన లంలా వ్యాపిస్తున్న ఈ ఉద్యమాన్ని అణచివేసేం దుకు, దొరల రక్షణ కోసం గ్రామాల్లో పోలీసు క్యాంపులు వెలిశాయి. విప్లవోద్యమ రహస్య జీవిత కార్యకర్తలు పట్టణాల్లో ఆశ్రయం పొందనారభిం చారు. పౌర హక్కుల నేతలపై, ఉద్యమ సానుభూతిప రుల ఇళ్లపై పోలీసుల నిఘా పెరిగింది. విప్లవ రచయిత లపై దాడి చేయడం మొదలైంది.

అదే సమయంలో 1984లో బిఎస్ రాములు రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నక్సలైట్ కార్యక లాపాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణతో ఆయనను 1984 జనవరిలో పోలీసులు అరెస్టు చేశారు. వారం రోజులపాటు లాకప్‌తో పాటు, 20 రోజులు కరీంనగర్ జైల్లో ఉన్నారు. అప్పటికే హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న బిఎస్ రాములు జైలులో ఉన్నందువల్ల ఉద్యోగం నుండి సస్పెండ్ చేశారు. అలా 1985 నుండి అయిదేళ్ల పాటు రహస్యజీవితంలోకి వెళ్లిపోయారు. ఆ జీవితం ఆయనకు ఎంతో నేర్పింది. అప్పటికే ఎన్నో పుస్తకాలు చదివిన ఆయనకు ప్రపంచ స్థాయి కమ్యూనిస్టు సిద్ధాంత గ్రంథాలు చదివే అవకాశం లభించింది. విప్లవ సైద్దాంతిక మేధావిగా ఎదిగి పార్టీస్థాయి నిర్ణయాలలో కీలక పాత్ర వహించేవారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాల ప్రభావంతో 1977-90 దాకా ఉద్యమంలో కొనసాగారు. క్రూర అణచివేత క్రమంలో ప్రజలపట్ల తీవ్ర నిర్బంధాలు పెరిగాయి. ఉద్యమం పెరుగుతున్నట్టు కనబడుతూ క్రమంగా కుదించుకు పోవడం జరిగింది.

ఆ సమయంలో ఉద్యమ విస్తరణ కోసం అఖిల భారత పర్యటనలో వరవరరావు, గద్దర్, సంజీవ్, దప్పు రమేశ్, డోలకిస్టు రాజుతో కలిసి 12 రాష్ట్రాలు పర్యటించారు. దేశవ్యాప్తంగా ఎందరో రచయితలు, కళాకారులు, సాహితీ వేత్తలు, ఉద్యమ కారులు, పౌరహక్కుల సంఘాల నేతలు, జర్నలిస్టులు, పత్రికా సంపాదకులు, ప్రొఫెసర్లను కలిసే అవకాశం లభించింది. వీరి సంపర్కం బిఎస్‌లో విప్లవోద్యమంపై కొత్త ఆలోచనలకు తోవ చూపింది. ప్రపంచ విప్లవోద్యమం గురించి, దేశీయ విప్లవోద్యమం గురించి వాటిలోని వైరుధ్యాల, ఒడిదుడుకుల గురించి, ఎదురవుతున్న కష్ట నష్టాలు, సమస్యల గురించి ఆత్మావలోకనం చేసుకోవడం జరిగింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో నక్సలైట్ నాయకుడు కేరళ వేణు, నక్సలైట్ పత్రిక మాస్ లైన్ సంపాదకుల ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. వివిధ ప్రాపంచిక మార్పులు, కారణాలవల్ల అర్థ భూస్వామ్య వ్యవస్థ, అర్ధవలస వ్యవస్థ అనే దృష్టితో చేసిన ఉద్యమాలన్నీ పలుచబారినయి. ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో నక్సలైట్ ఉద్యమానికి ప్రతిచోట కుల సమస్య ఎదురైందని, ఉద్యమాలు స్తంభనకు గురయ్యాయని తెలిసింది.

ఇంకొకవైపు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రాజ్‌నంద్‌గామ్‌లో శంకర్ గుహ నియోగి ఒక విశిష్టమైన, సమగ్రమైన, సామాజిక ఉద్యమాన్ని నిర్మిస్తున్నారు. ఉద్యమ నాయకత్వమే హాస్పిటళ్లను, స్కూళ్లను కమ్యూనిటీ హాళ్లను నిర్మింపచేసింది. మద్యపాన నిషేధాన్ని అమలు జరిపింది. భిలాయ్ ఉక్కు గని కార్మికులను సంఘటిత పరిచింది. వారి జీత భత్యాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి కృషి చేసింది. మహిళలపట్ల వివక్షను నిర్మూలించడానికి మహిళా కమిటీలను వేసింది. ఇలా నిర్దిష్ట ప్రాంతంలో వర్గ సామాజిక విప్లవాన్ని, సమగ్ర సామాజిక వికాసాన్ని ఒక ఉద్యమంగా కొనసాగిస్తున్నారు. అది బిఎస్‌ను బాగా ఆకర్షించింది. అలా అఖిల భారత పర్యటనతో తన ఆలోచన విధానంలో మార్పు వచ్చింది. అప్పటినుండి సమస్త వర్గ కుల లింగ జాతి మత భాష వివక్షతలు, అసమానతలు దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా సమగ్ర సామాజిక వికాసమే సమగ్ర సామాజిక విప్లవంగా కొనసాగించాలని అవగాహనకు వచ్చారు. ఈ అవగాహనతో ఆయనకు మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనావిధానంతో పాటు వాటి వ్యూహం, ఎత్తుగడలు కార్యక్రమా లన్నింటిలో ఎన్నో లోటుపాట్లు ఉన్నాయని అనిపించింది. వాటిని మార్క్స్, ఎంగెల్స్ లాగానే తత్వశాస్త్రంలో భాగంగా చర్చించడం అవసరమనిపిం చింది. దాంతో మార్క్సిస్టు తత్వ శాస్త్రాలను పునరధ్యయనం చేశారు.

కమ్యూనిస్టు విప్లవకారులంతా గతితార్కిక ఆర్థికవాదం, గతి తార్కిక భౌతిక వాదం, గతి తార్కిక చారిత్ర క వాదం, ఇట్లా ఆర్థిక పరమైన, రాజకీయ పర మైన విషయాలతో పాటు ప్రపంచ పరిస్థితులను గురించి మాట్లాడుతారు. అయితే రష్యా, చైనాల్లో లాగా మన దేశ ప్రజలు ఒక వర్గానికి చెందినవారు కారు. ఆ దేశాలకు భిన్నంగా ఇక్కడ కుల మత వ్యవస్థలున్నాయి. సామాజికంగా కూడా మనుషుల ంతా సమానమేనని చెప్పడానికి ఈ ఉద్యమంలో జవాబు కనబడలేదు. ఆర్థికంగా మారితే అన్నీ మారతాయని కమ్యూనిస్టు సిద్ధాంతం. మనదేశం ఆర్థికంగా, సాంఘికంగా ఒక్కటేనని చెప్పుకున్నా కులమనేది మూల సూత్రంగా ఉంటుంది. మనిషి హావభావాలు, వేషధారణ, భాష, ప్రవర్తన కూడా కుల సంస్కృతిని సూచిస్తాయి. ఇవన్నీ అణచివేతకు గురవుతున్నాయి. విప్లవం పేదలనుండే వస్తుంది కానీ నాయకత్వం దగ్గర వివక్ష ఏర్పడుతుంది.

అన్ని ఉద్యమాల్లో 70, 80 ఏళ్లుగా బీసీలు, ఎస్సీ, ఎస్టీలు జెండాలు మోసేవాళ్లుగా, లాఠీ దెబ్బలు తినేవాళ్లుగానే మిగిలిపోతున్నారు. ఇది అందరికీ తెలిసిన బహిరంగ విషయం. అందువల్ల తత్వశాస్త్రంలో వ్యూహం, ఎత్తుగడల్లో లోపం ఉందని గమనించారు. మార్క్స్ వద్ద ఆగిపోకుండా ప్లేటో, అరిస్టాటిల్, బుద్ధుడు, నాగార్జునుడు, కాంట్, హెగెల్ తత్వశాస్త్ర అధ్యయనం చేయడం జరిగింది. అలా గతితర్కం యొక్క మౌలిక సూత్రాలను విస్తారంగా చర్చించడం జరిగింది. కొత్త సైద్ధాంతిక భూమిక ప్రతిపాదనతో బిఎస్ విప్లవోద్యమబాటకు దూరమయ్యారు. 1990 ఏప్రిల్ రెండున బిఎస్ రహస్య జీవితం ముగిసింది. ఆ రోజు మంథనిలో జరిగిన రాడికల్ యువజన సంఘం జిల్లా మహాసభల్లో బహిరంగ జీవితంలోకి వచ్చారు. అదేరోజు వరవరరావు, గద్దర్ తదితర మిత్రులు బిఎస్ రాములు వెంట జగిత్యాలకు వచ్చి ఆయనను భార్య శ్యామలకు అప్పగించారు. అదొక ఉద్విగ్న సమయం.

### 3. ఉద్యోగ జీవితం

అప్పటి రోజుల్లో 12వ తరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసయినవాళ్ళకు పోస్టాఫీసులో ఉద్యోగం వచ్చేది. అదే నమ్మకంతో డిగ్రీలో చేరలేదు. జగిత్యాలలో బేసిక్ టీచర్ ట్రైనింగ్ స్కూల్ ఉన్నప్పటికీ ఆ దిక్కు చూడలేదు. ఎందుకంటే ఆ రోజుల్లో టీచర్లకు 96 రూపాయల జీతం ఉంటే పోస్ట్ ఆఫీసులో 240 రూపాయలు ఉండేది. గత సంవత్సరం కన్నా ఎక్కువ మార్కులు ఉన్నవారు ఎక్కువకావడంతో తృటిలో పోస్టల్ ఉద్యోగం చేజారింది. అలా మూడేళ్లు ఎదురుచూపులతోనే గడిచింది. టీచర్ ఉద్యోగమే బాగుంటుందని మిత్రులు చెప్పడంతో మనసు మార్చుకొని ధర్మపురిలో శ్రీలక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర సాయం కళాశాలలో డిఓఎల్ కోర్సులో చేరారు. అదే ఊర్లో న్యూస్ పేపర్ ఏజెన్సీ తీసుకొని పొద్దుటి సమయమంతా న్యూస్ పేపర్ పని చూసుకుంటూ, పగటి వేళ ఓ బీడీల కంపెనీలో పని చేసుకుంటూ సాయంకాలం చదువు కొనసాగించారు. అలా 1970-74 మధ్య ధర్మపురిలో డిఓఎల్, బిఓఎల్ పూర్తి చేయడం జరిగింది. జై తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాల వల్ల నాలుగేళ్ళ కోర్సు అయిదేళ్లు కొనసాగింది.

1973లో ఆదిలాబాద్ జిల్లా డిఎస్సీలో డిఓఎల్ అర్హతతో తెలుగు పండిట్ పోస్టుకు ఎంపికయ్యారు కాని లంచం ఇచ్చుకోలేని పరిస్థితిలో ఆర్డర్ చేతికి రాలేదు. కాని ఆ సెలెక్షన్ లెటర్ విచిత్రంగా జీవిత భాగస్వామిని అందించింది. ఉద్యోగం వచ్చేసిందనే నమ్మకంతో తాను పనిచేస్తున్న బీడీ కంపెనీ యజమానురాలు మిట్టపల్లి ఈశ్వరమ్మ తన అక్క కూతురు శ్యామలను పెళ్లి చేసుకొమ్మని కోరింది. అలా 1973 మే 17వ తేదీన బిఎస్ రాములు శ్యామల ఒక్కటయ్యారు. ప్రభుత్వ ఉద్యోగంకోసం 1967నుండి ఎదురుచూస్తున్న ఆయనకు 1975 డిసెంబర్‌లో సాంఘిక సంక్షేమ శాఖలో

**- బద్రి నర్సన్**
ఫోన్: 9440128169

తరువాయి రేపటి సంచికలో

## ప్రజలకు రాకపోకలు అంతరాయం కలగొద్దు

- ఆర్డీవో మాధవి లత



**ఉప్పునుంతల, ఆగస్టు 18 (జనం సాక్షి) :** గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి అని మండల పరిధిలోని వెల్టూరు గ్రామానికి వెళ్లే రహదారిపై వరద ప్రవాహాన్ని అచ్చంపేట ఆర్డీఓ మాధవిలత సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెల్టూరు గ్రామం తో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలకు వరద ప్రవాహం వల్ల రాకపోకలకు ఇబ్బంది కలవకూడదని అధికారులకు ఆదేశించారు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని అదేవిధంగా గ్రామాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమతం చేస్తూ ఉండాలని వారు సూచించారు రోడ్డు కు అంతరాయం కలగకుండా ముందస్తుగా దగ్గరుండి మట్టిని పోయించారు హెచ్చరిక బోర్డులు పెట్టాలని స్థానిక అధికారులకు సూచించారు కార్యక్రమంలో వారితోపాటు ఉప్పునుంతల తాసిల్దార్ ప్రమీల గ్రామస్తులు మాజీ సర్పంచ్ గుండెమోని లింగమయ్య, పెద్దలు మల్లయ్య బాల్ రెడ్డి, గుద్దటి బాలరాజు, సైదులు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్య నాయక్

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) :** బహుజనుల హక్కులకై పోరాడిన మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్య నాయక్ అన్నారు. సర్వాయి పాపన్న 375వ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఉదయం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బి.సి.సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ముఖ్య అతితులుగా హాజరై సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ మాట్లాడుతూ మొఘల్ రాజులను ఎదుర్కొని, అప్పుడు ఉన్న పరిస్థితులను ఎదుర్కొని బహుజనులకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించి న్యాయం చేశారన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతి సంవత్సరం సర్వాయి పాపన్న గౌడ్ జయంతినీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు బహుజనులకు చేరడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సర్వాయి పాపన్న ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ ను ఇండియన్ రాబిన్ హుడ్గా అభివర్ణించారు. ధనవంతులను దోచి పేద అణగారిన వర్గాలకు పంచిపెట్టారని గుర్తుచేసారు. వనపర్తి మార్కెట్ కమిటీ



చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ట్యాంక్ బండ్ పై నేడు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లాలో శిథిలావస్తలో ఉన్న సర్వాయి పాపన్న కోటను అభివృద్ధి చేసేందుకు రూ. 4.7 కోట్లు కేటాయించినందుకు ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలిపారు. అదేవిధంగా జనగామ జిల్లా పేరు ను సర్వాయి పాపన్న పేరుగా మార్చారాలని ప్రభుత్వాన్ని కోరారు. వనపర్తి పట్టణంలో బి.సి వసతి గృహం అద్దె భవనాల్లో కొనసాగుతుందని, ప్రభుత్వం ద్వారా 1.5 ఎకరాల స్థలం కేటాయిస్తే మంచి వసతి గృహం నిర్మాణం చేసుకుంటామని జిల్లా కలెక్టర్ ను కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను ఆచరణలో పెట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.వనపర్తి గద్దర్ రాజారాం సర్వాయి పాపన్న గౌడ్ పై పాడిన పాట అందరిని ఆకర్షించింది.ఆర్డీఓ సుబ్రమణ్యం, బి.సి.సంక్షేమ శాఖ అధికారి పాండు,జిల్లా అధికారులు, సంఘ నాయకులు మధు గౌడ్ సైతం సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు.

### డాక్టరేట్ పొందిన సతీష్ యాదవ్‌కు వనపర్తి ప్రముఖులతో ఘన సన్మానం

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా వనపర్తి గౌడ సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. పాండిచ్చేరిలో సేవా విభాగంలో డాక్టరేట్ పొందిన అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ ను మార్కెట్ కమిటీ చైర్మన్, గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ,సురేష్ గౌడ్, ఆధ్వర్యంలో సతీష్ యాదవ్ ని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కోళ్ల వెంకటేష్, ప్రజా గాయకుడు రాజారాం ప్రకాష్, బహుజన నాయకుడు గంధం నాగరాజు, మాజీ ఎం.ఈ.ఓ శ్రీనివాసులు గౌడ్ మాజీ కౌన్సిలర్లు బ్రహ్మాచారి, ఉగ్గం తిరుమల్, మధు గౌడ్, ఉపాధ్యాయులు వరప్రసాద్ గౌడ్, బండలయ్య, ఐక్యవేదిక నాయకులు వెంకటేశ్వర్లు, గౌని కాడి యాదయ్య, కొత్తగోళ్ల శంకర్, బొడ్డుపల్లి సతీష్, యువ కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి, జంగిడి రవి, రాహుల్, గౌడ సంఘ నాయకులు, ఇతర మాజీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ హామీ ప్రకారం పెన్షన్లు పెంచాల్సిందే..



**యాచారం, ఆగస్టు 18 (జనం సాక్షి) :** వికలాంగులకు, వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళలకు చేనేత గీత కార్మికులకు పెన్షన్లు పెంచుతానని చెప్పి 20 నెలలు గడుస్తున్న నేటికీ అమలు కాకపోవడంతో సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సదస్సును యాచారం మండల కేంద్రంలో గల డి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందే రాంబాబు పాల్గొని మాట్లాడుతూ పెన్షన్లు పెంపే లక్ష్యంగా సెప్టెంబర్ 9న పెరేడ్ గ్రౌండ్లో లక్షలాదిమంది పెన్షన్ దారులతో చలో హైదరాబాద్ వికలాంగుల మహా గర్జన పేరుతో గ్రామ గ్రామాన తరలిరావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, నరేందర్, ఎలీషా, ఎంఎస్పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇంజన్ వెంకటస్వామి, వీహెచ్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల వెంకటేష్, ప్రచార కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ చారి, జిల్లా అధ్యక్షులు యాచారం జంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము రాములు, మహమ్మద్ సలీం, మండల అధ్యక్షులు దేరంగుల ఈశ్వర్, చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షురాలు రేణుక, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మూలి మహేష్, ఎంఎస్పి మండల అధ్యక్షులు బోడ ముత్యాలు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మస్కు యాదగిరి, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి కందుకూరి కొండల్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బోడ కృష్ణ మాదిగ బండిమీద కృష్ణ మాదిగ అంజయ్య మాదిగ బోడ అభయ మాదిగ కంబాలపల్లి సాయిలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 18 (జనం సాక్షి) :** ప్రజా వాణి కి వచ్చే ప్రజా ఫిర్యాదు లను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికివచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సోమవారము సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ భూ సమస్య లు,ఇందిరమ్మ ఇల్లు ,ఎలక్ట్రిసిటీ, గ్రామ పంచాయతి , విద్యా శాఖ, ఆసరా పెన్షన్ లకు సంబందించి ఫిర్యాదులు సమర్పించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. జిల్లా అదికారులనుద్దేశించి జిల్లా లో జరిగే స్కూల్స్ పెయిన్ టింగ్ పనులు , మైనర్ రిపేర్ పనులు, బయో మెట్రిక్ అటెండెన్స్, ప్యాడి ప్రోక్యూర్ మెంట్, విద్యుత్తు పలు అంశాల పై సంబంధిత అధికారులతో అరా తీశారు. బయో మెట్రిక్ అటెండెన్స్ వంద శాతం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి , డి ఆర్ఓ మంగీ లాల్, ఆర్ డి ఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎ ఓ పర్వీన బేగం, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో 12 ఏళ్ల బాలిక దారుణహత్య


**కూకట్‌పల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి) :** కూకట్పల్లిలో దారుణం 12 ఏళ్ల బాలికపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి హత్య చేసిన ఘటన కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.



కూకట్పల్లిలో ఘోర ఘటన చోటుచేసుకుంది. 12 ఏళ్ల బాలిక సహస్రను గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. కృష్ణ–రేణుక దంపతుల కూతురు సహస్ర (12) ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈ ఘటన జరిగింది. తల్లి రేణుక స్థానికంగా ల్యాబ్ టెక్నీషియన్గా, తండ్రి కృష్ణ బైక్ మెకానిక్గా పని చేస్తున్నారు. ఉదయం స్కూల్‌లో చదువుతున్న తన కుమారుడికి లంచ్‌బాక్స్ అందించడానికి ఇంటికి వచ్చిన కృష్ణ, తలుపు మూసి ఉండడంతో గడియ తీసి లోపలికి వెళ్లాడు. గదిలో మంచం మీద రక్తపు మడుగులో పడి ఉన్న కూతురిని చూసి షాక్‌కు గురయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్‌కి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సూచన అందుకున్న కూకట్పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, క్లూస్ టీం ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. బాలిక శరీరంపై కత్తి దెబ్బలు, గాయాలు ఉండటంతో ఇది పూర్వ ప్రణాళికతో చేసిన దాడి కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతమంతా తీవ్ర విషాదం నెలకొంది. చిన్నారి అమాయకంగా బలి కావడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హత్య వెనుక కారణాలపై విచారణ కొనసాగుతోంది. పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకునే దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 22 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరద ముప్పు తప్పించండి

- హైడ్రా ప్రజావాణికి 39 ఫిర్యాదులు



**హైదరాబాద్, ఆగస్టు 18 (జనం సాక్షి) :** వర్షాల వేళ.. నాలాలు, చెరువుల కబ్జాలపై ఫిర్యాదుల సంఖ్య ఎక్కువగా ఉంది. కాలనీలను, రహదారులను వరద ముంచెత్తడానికి కారణమౌతున్న కబ్జాలను వెంటనే తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించడం ద్వారా వరద ముప్పును చాలావరకు తగ్గించవచ్చునని ఉదాహరణలతో చెబుతున్నారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 39 ఫిర్యాదులందగా నాలాలు, చెరువుల కబ్జాలపైనే ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయ. ఇదే సమయంలో పార్కులు, ప్రభుత్వ భూములు, రహదారుల ఆక్రమణలపైనా ఫిర్యాదులందాయి. సంతోష్‌నగర్ డివిజన్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతాన్ని వరద నీరు ముంచెత్తుతోందని స్థానికుల నుంచి ఫిర్యాదు అందింది. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్, టోలీచౌక్ వంతెన పరిసరాల్లో వర్షం వస్తే ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. సోమాజిగూడ యశోధ ఆసుపత్రి పరిసరాల్లో నీరు నిలిచిపోవడంతో పైన ఉన్న పంజాగుట్ట ప్రాంతంలోని పలు కాలనీలకు ఇబ్బందిగా పరిణమించిందని పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్‌లోని సీవీఆర్ న్యూస్ వద్ద వరద నీరు నిలుచుండిపోతోందని.. పక్కనే ఉన్న కేబీఆర్ పార్కులోకి మళ్లిస్తే సమస్య పరిష్కారమౌతుందని జర్నలిస్టు కాలనీ ప్రతినిధులు ఫిర్యాదునందజేశారు.

## సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు

- ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను తనిఖీ చేసిన డిఎంహెచ్వో
- డిఎంహెచ్‌వో కే. సిద్ధప్ప



**మల్దకల్, ఆగస్టు 18 (జనంసాక్షి) :** విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బందిసమయపాలన పాటించుకుంటే కఠిన చర్యలు తప్పవని జోగులాంబ గద్వాల జిల్లా డిఎంహెచ్వో కే సిద్ధప్ప హెచ్చరించారు.సోమవారం మండలపరిధిలోని పాల్వాయి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజన్ వ్యాధులపై ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.వారంలో రెండు రోజులు డ్రై డే కార్యక్రమాలు చేయాలని, జ్వరం కేసులు ఎన్ని వస్తున్నాయని, ట్రీట్మెంట్ ఏ ఏ మందులు ఇస్తున్నారని ఆరా తీశారు.డెలివరీలు ఎన్ని వస్తున్నాయి, ప్రభుత్వ ఆసుపత్రిలో చేసే విధంగా చర్యలు తీసుకోవాలని,ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లకుండా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రికి ఎందుకు పోతున్నారని, నెలలో డెలివరీ కేసులు ప్రభుత్వాసుపత్రిలో అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీపీ షుగర్ మందులు ఏవిధంగా ఇస్తున్నారని,వాటిని రోగులకు ఏ మందులు ఇస్తున్నారని ఆయన సిబ్బందిని తెలుసుకున్నారు.పెద్దపల్లి పవనపల్లి,బుడిదిపాడు గ్రామాల నుండి ప్రతిరోజు రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రతిరోజు ఉదయం 9:30 నుండి సాయంత్రం నాలుగు 4 గంటల 30 నిమిషాలు వరకు వైద్యులుతోపాటు సిబ్బంది పనిచేయలన్నారు. డిఎంహెచ్ఓ వెంట డాక్టర్ నవీన్, డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి,ఇన్చార్జి డిఎస్ఓ తిరుమలేష్ రెడ్డి,సూపర్వైజర్ శ్రీధర్,ఏఎన్ఎం మనోహరమ్మ ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ముదిరాజులను బీసీ-డీ నుండి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలి



**బొంరాస్‌పేట, ఆగస్టు 18 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ముదిరాజులను బీసీ–డి గ్రూపు నుండి బీసీ–ఏ గ్రూపులోకి మార్చాలని జీవో నంబర్ 15 అమలు చేయాలని కోరుతూ కోడంగల్ నియోజకవర్గానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ముదిరాజులు అన్ని కులాల కన్నా అత్యధికంగా జనాభా ఉండి,ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రత్యేక చొరవ తీసుకొని కమిషన్ రిపోర్టు ప్రభుత్వానికి ఇస్తే ప్రభుత్వం బీసీ–డీ గ్రూపు నుండి బీసీ–ఏ గ్రూపులోకి మార్చడానికి సిద్ధంగా ఉందని కమిషన్ కు ముదిరాజ్ సంఘం నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్,కొడంగల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, వెంకటయ్య, నర్సప్ప, బాలయ్య, సత్యపాల్, వెంకటయ్య, పోల్కంపల్లి మధుసూదన్,ఏబీఎన్ హన్మంతు,జయరాములు, నరసింహా నాయుడు తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**మొయినాబాద్, ఆగస్టు 18 (జనం సాక్షి) :** విద్యార్థులు ఉన్నత విద్యలో అందిపుచ్చుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందని విద్యార్థి కళాశాల కరస్పాండెంట్ జనగాం ఎమ్మెల్యే పల్లె రాజేస్వర్ రెడ్డి అన్నారు. సోమవారము మున్సిపాలిటీ పరిధిలోని విద్యాజ్యోతిఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల కరస్పాండెంట్ జనగాం ఎమ్మెల్యే పళ్ళ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కళాశాల ఎల్లవేళల కృషి చేస్తుందని అన్నారు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహించడం జరిగిందన్నారు నాణ్యమైన విద్యను అందించేందుకు పేకాటి ఎంతో బాగుందని సూచించారు తల్లిదండ్రులు విద్యార్థులను క్రమశిక్షణతో కళాశాలకు పంపించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు క్రమశిక్షణను అలమరుచుకున్నప్పుడే మీకు బంగారు భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు ఉన్నత విద్యతో మీ భవిష్యత్తుకు మంచి



ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు ఉన్నత విద్యను అందిపుచ్చుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులను సాదరంగా ఆహ్వానించారు. ప్రిన్సిపాల్ ప్రొ. డా. ఏ. సృజనా స్వాగత ప్రసంగం చేస్తూ, విద్యా ప్రాముఖ్యత, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, మరియు ప్రపంచ స్థాయి ఇంజనీర్లను తీర్చిదిద్దే లక్ష్యాలను వివరించారు. గుర్తుచేశారు. విద్యార్థులు ఆసక్తి, క్రమశిక్షణ, జీవితాంతం నేర్చుకునే మనస్తత్వంతో తమ ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు. నిబద్ధతను తెలియజేశారు. భావోద్వేగపూరిత మద్దతుగా నిలవాలని కోరారు. ఆయన మాటలు తల్లిదండ్రులకు నమ్మకాన్ని, విద్యార్థులకు ఉత్తేజాన్ని కలిగించాయి. ఒరియంటేషన్ డే, విద్యా జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యొక్క విలువలు, సంస్కృతిని ప్రతిబింబిస్తూ, విద్యార్థుల భవిష్యత్ ప్రయాణానికి పునాది వేసింది.ముగింపులో, ప్రిన్సిపాల్ డా. ఏ. సృజనా, తన విలువైన సూచనలు అందించినందుకు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ యొక్క దృష్టి కోణం నాయకులు, ఆవిష్కర్తలు, సమాజానికి బాధ్యత గల పౌరులను తీర్చిదిద్దడం ప్రారంభం భవిష్యత్తు పట్ల నమ్మకం, ఉత్సాహం, లక్ష్యం కలిగించింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ పల్లా రాజేశ్వర రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సృజన, అకడమిక్స్ డైరెక్టర్ శ్రీమతి జి. శ్రీలత, ర్యాంకింగ్ డీన్ డాక్టర్ ఎ. పద్మజ, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ శ్రీ ఆర్. వెంకటాచలం, హెడ్స్ మరియు ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19 ఆగస్టు 2025

# స్థానిక ఎన్నికల్లో కీలకం కానున్న పింఛన్లు

- 20 నెలలైనా పెరగని ఆసరా
- పథకం పేరు మార్చినా ప్రయోజనం సున్నా
- ఊసేలేని కొత్త పింఛన్ల మంజూరు



**వనపర్తి, ఆగస్టు 18 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారింది. తొలిగండం దాటితే తొంబయ్యేళ్ళ ఆయుష్షు అన్నట్లుగా గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎడాపెడా హామీలిచ్చి అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్‌కు గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే మార్పు తెస్తామని ఇచ్చిన హామీల్లో సామాన్య ప్రజలకు వ్యక్తిగతంగా మేలు కలిగించే పింఛన్ల అంశం సర్కార్ దడ పుట్టింస్తోందనే చర్చలు కొనసాగుతున్నాయి.

## పేరు మార్చినా పెరగని ఆసరా పింఛన్లు

కేసీఆర్ పథకాల ఆనవాళ్ళు లేకుండా చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరాను చేయూతగా మార్చి చేతులు దులుపుకున్నారే తప్పా పింఛన్లు పెంచలేదు. దీంతో లబ్దిదారులు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. ఏ ఆసరా లేని వాళ్లకు చేయూతనందించాలనే ఉద్దేశంతో అప్పటి పాలకులు పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. సమాజంలో స్వశక్తితో తమ అవసరాలు తీర్చుకోలేక ఇతరుల ఆర్థిక సాయం ఉంటే తప్ప జీవితాల్ని నెట్టుకురాలేని పరిస్థితుల్లో ఉన్న వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ.75తో ప్రారంభమైన పింఛన్ కాస్త తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1016 తో ప్రారంభమైన ఆసరా పింఛన్ రూ.2016 అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4016 ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పింది. అయితే పెరగడం మాటేమో గాని పెంచుతామన్న పింఛన్ డబ్బులు కూడా పెంచలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారిలో వృద్ధులు, వితంతువులు వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు, డయాలసిస్, ఫ్లోరోసిస్ ఇతర పింఛన్దారులు కలిపి మొత్తం 44 లక్షల మంది లబ్దిదారులున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజా పాలనలో కొత్తగా పింఛన్ కోసం 24.84 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

## పింఛన్లు అందక ఆందోళనలో లబ్దిదారులు..

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వృత్తిదారులు ఇలా ఏ ఆసరా లేనోళ్లంతా సర్కార్ పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ పైసలొస్తే రోగానికి మందుగోలీలు, నాలుగు మెతుకులు దొరుకుతాయని ఆశతో ఉన్నారు. కానీ రెండు నెలలుగా వారికి పింఛన్ అందడం లేదు. దీంతో ఆసరా పింఛన లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు .అధికారంలోకి వస్తే చేయూత కింద వికలాంగులకు రూ.6 వేలు, మిగతా వర్గాల వారికి రూ.4 వేలకు పెంచుతామని చెప్పిన ముఖ్యమంత్రి ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు కొనసాగుతున్నాయి.

## మహాలక్ష్మి పింఛన్లకు ముహూర్తం ఎప్పుడో..?

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలందరికి కాంగ్రెస్ పార్టీ ఇస్తామన్న రూ.2,500 మహాలక్ష్మి పింఛన్లకు ఇంకా ముహూర్తం కుదరలేదేమో అన్న విమర్శనాస్త్రాలను బీఆర్ఎస్ బీజేపీ నాయకులు ఎక్కుపెడుతూనే ఉన్నారు. మహాలక్ష్మి పింఛన్లను ఎప్పుడిస్తారో ప్రభుత్వం చెప్పకపోవడం ప్రత్యర్థుల వ్యాఖ్యలకు మరింత సపోర్టు లభిస్తోంది. నెలనెలా రూ.2,500 పింఛన్ల గురించిన తీపి కబురు ఇంతవరకు చెప్పనందున మహాలక్ష్మి పింఛన్లు వస్తాయని ఆశల్లో ఉన్న మహిళలు ప్రభుత్వ నిర్ణయం కొరకు ఎదురుచూడడం తప్పడం లేదు. ఆర్థిక భారం తగ్గించుకోడానికి ప్రభుత్వం ఎలాంటి విధివిధానాలను ఖరారు చేస్తుందో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే వివిధ క్యాటగిరీల కింద ఆసరా పింఛన్లు అందుతున్న ఆయా కుటుంబాల్లో ఉన్న మహిళలకు కొత్తగా మహాలక్ష్మి పింఛన్ ఇవ్వరనే ప్రచారం జరుగుతుండడం కొంత కలవరానికి గురి చేస్తున్నది.

## వనపర్తి జిల్లాలో 77,112 మంది పింఛన్ దారులు...

ప్రస్తుతం వనపర్తి జిల్లాలో ఆసరా చేయూత పింఛన్ లబ్దిదారులు 77110 మంది ఉన్నారు. వారిలో వృద్దాప్య పింఛన్లు 30938,దివ్యాంగులు 11881,వితంతులు 29598, ఒంటరి మహిళలు 2626,చేనేత కార్మికులు 638,గీత కార్మికులు 438, బోదకాలు బాధితులు 06,బీడీ కార్మికులు 987 మంది ఉన్నారు.పాత పింఛన్ల లెక్క మేరకు ప్రతి నెల 57 కోట్ల ,82 లక్షల,15 వేల ,760 రూపాయలు పంపిణీ చేయడం గమనార్హం.

# నిమ్జ్ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు

- భూములను అమ్మలేక, కొత్త రుణాలు పొందలేక నష్టపోతున్నాం
- జిల్లా కలెక్టర్‌కు భూ నిర్వాసితుల ఫిర్యాదు



**న్యాల్‌కల్, ఆగస్టు 18 (జనం సాక్షి) :** అర్హులైన యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న జాతీయ ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టుకు మేము ఎంత మాత్రం వ్యతిరేకం కాదని, స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. న్యాల్ కల్ మండలంలోని హద్దునూర్ గ్రామానికి చెందిన పలువురు నిమ్జ భూ నిర్వాసితులు సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన "ప్రజావాణి" కార్యక్రమంలో కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు భూ నిర్వాసితులు జనరల్ అవార్డు క్రింద పరిహారం అందించాలని, అసైన్డ్ భూములతో పాటు పట్టా భూములను సైతం బ్లాక్ లిస్టులో పెట్టడం కారణంగా మా సొంత భూములను అత్యవసరాల కోసం అమ్ముకోలేక, కుదువ పెట్టుకోలేక, కొత్త రుణాలు పొందలేక, పాత రుణాలకు రెన్యువల్ చేసుకోలేక, గతంలో తీసుకున్న రుణాలకు వడ్డీ పెరగడంతో తీవ్రంగా నష్టపోతున్నామని.. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని భూ నిర్వాసితులు కలెక్టర్ కు విన్నవించారు. జనరల్ అవార్డు కింద నష్టపరిహారమైన ఇవ్వండి. లేదా బ్లాక్ లిస్ట్, నిమ్జ ప్రాజెక్టులో నుంచి భూములను తొలగించాలని విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో భూ నిర్వాసితులు షబ్బీర్ ఖాన్, నర్సారెడ్డి, జైపాల్ రెడ్డి, సంగారెడ్డి, రాజు, అంజిరెడ్డి, అశోక్, రాజన్న, కిష్టన్న, శివరాజ్, సంజీవ్, ఖాజ, తదితరులు ఉన్నారు.

## మక్తల్ మినీ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్



**మక్తల్, ఆగస్టు 18 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో అధునాతనంగా స్టేడియాన్ని నిర్మించేందుకు క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మక్తల్ మినీ స్టేడియాన్ని పరిశీలించారు. నూతన మినీ స్టేడియం నిర్మాణం కోసం ఎన్ని ఎకరాల స్థలం అవసరం ? ప్రస్తుతం మైదానం ఎన్ని ఎకరాలలో ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతన మినీ స్టేడియం మ్యాప్ ను పరిశీలించిన కలెక్టర్ ప్రస్తుతమున్న స్టేడియంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం భవనాలను తొలగించే విషయమై ఆమె అధికారులతో చర్చించారు. మైదానంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనాలను కలెక్టర్ వర్షంలోనే పరిశీలించారు. జూనియర్ కళాశాలకు సంబంధించిన ఒక భవనం శిథిలావస్థకు చేరిందని, మరో భవనం బాగుందని డీ వై ఎస్ ఓ వెంకటేష్ కలెక్టర్‌కు తెలపగా భవనాలను ఆమె చూశారు. జూనియర్ కళాశాల లో మొత్తం ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ ప్రశ్నించగా 500 మంది విద్యార్థులు చదువుతున్నారని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. కొత్తగా కళాశాలలో ఎలాంటి నిర్మాణ పనులు చేయించవద్దని ప్రిన్సిపల్ కు ఆమె తెలిపారు. అలాగే డిగ్రీ కళాశాల ను కూడా ప్రైవేట్ భవనంలోకి మార్చాల్సి వస్తుందని అందుకు అనుకూలమైన భవనాన్ని చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మైదానంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని కూడా ఆమె పరిశీలించారు. నూతన మినీ స్టేడియం నిర్మాణానికి ఉన్నత విద్యా శాఖ, క్రీడా శాఖ ఉన్నతాధికారుల సమన్వయం అవసరమని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో రమేష్, మున్సిపల్ కమిషనర్ శంకర్, పీ ఆర్ డీఈ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదు

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**మక్తల్, ఆగస్టు 18 (జనంసాక్షి) :** గణేష్ ఉత్సవాలు, ఇతర మత పరమైన పండగల సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో డీజేలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. సోమవారం మక్తల్ మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాలలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, హిందూ మత పెద్దలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ మక్తల్ సర్కిల్ పరిధిలో అధిక శబ్దం వచ్చే డీజే సౌండ్ సిస్టంల వల్ల పెద్దవారికి ముఖ్యంగా వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు, చిన్న పిల్లలకు, ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి హానికరం కావడంతోపాటు శబ్ద కాలుష్య చట్టాల ఉల్లంఘన, సంప్రదాయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడానికి జిల్లాలో డీజే లను నిషేధిస్తున్నట్టు తెలిపారు. రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా, ఇతర మతపరమైన పండుగలకు డీజేలకు అనుమతి లేదని ముందస్తు డీజేలను ఎవరు బుక్ చేసుకోరాదని, ఒక వేళ డీజే లను ఎవరైనా పెడితే సీజ్ చేసి మండపం యొక్క ఆర్గనైజర్స్ పై కేసు నమోదు చేసి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. డిజెల నిషేధానికి సంబంధించిన ఆర్డిఓ ఆర్డర్ కాపీలను ఉత్సవ కమిటీ సభ్యులకు అందించడం జరిగింది అని ఉత్సవాలలో డీజేలకు బదులుగా చిన్న సౌండ్ బాక్సులను, సాంప్రదాయ నృత్యాలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు. గణేష్ మండపాల వద్ద, ప్రధాన వీధుల్లో ఫ్లాగ్స్, రిబ్బన్స్ ఏర్పాటు చేసుకునేటప్పుడు ఇతరులకు ఇబ్బంది లేకుండా చేసుకొని పండగ ముగిసిన తర్వాత తాము ఏర్పాటు చేసుకున్న వాటిని వారే తీయాలని ఎస్పీ తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న లోకల్ పోలీసులను సంప్రదించి జెండాలను కట్టుకోని, తియ్యాలని, ఎవరు చట్టాన్ని చేతిలోకి తీసుకోరాదని ఎస్పీ తెలిపారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారికి ఎస్పీ పలు సూచనలు చేశారు. గణేష్ మంటపాల నిర్వాహకులు ఆన్లైన్ అనుమతి తప్పనిసరి ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్, ఎస్ఐ లు భాగ్యలక్ష్మి రెడ్డి, అశోక్ బాబు, నవీద్, మక్తల్ సర్కిల్ పరిధిలోని ఉత్సవ కమిటీ ఆర్గనైజర్స్, హిందూ మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న పోరాటాలు, త్యాగాలు మరువలేనివి

- సంగారెడ్డి లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 18 (జనం సాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న పోరాటాలు, త్యాగాలు మరువలేనివని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సర్దార్ సర్వయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవం పురస్కరించుకొని, సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నూతన విగ్రహాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సర్దార్ సర్వయి పాపన్న పోరాటాలు, త్యాగాలు వెనకబడిన వర్గాల గౌరవాన్ని కాపాడటమే కాకుండా సామాజిక సమానత్వానికి మార్గదర్శకమయ్యాయని అన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకలుగా జరపడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ సి చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గం శాసన సభ్యులు చింతా ప్రభాకర్ ,జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 18 (జనం సాక్షి) :** ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం అధికారులను ఆదేశించారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో బాగంగా సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 మంది ఫిర్యాదుదారులతో ఫిర్యాదులు అందుకున్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదా రులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై మొదటగా ఎఫ్ఐ ఆర్ నమోదు చేయాలని అనంతరం క్షేత్ర స్థాయిలో బాధితుల గ్రామాలకు వెళ్లి విచారించి తదుపరి చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఎస్పి తెలిపారు. భూతగాధలకు సంబంధించిన ఫిర్యాదులను రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వ యంతో పనిచేసి త్వరితగ తిన కేసులను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చెరువ చేయడమే లక్ష్యంగా ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధి తుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు. బాధితుల యొక్క ఫిర్యాదులను ఆన్లైన్లో పొందు పరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పి తెలిపారు. ప్రజలు అత్యవసర సమ యంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- విద్యార్థులకు 117 చెస్ బోర్డులు పంపిణీ



**ఉప్పునుంతల, ఆగస్టు 18 (జనం సాక్షి) :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అచ్చంపేట నియోజకవర్గ శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు ఉప్పునుంతల మండల కేంద్రంలోని పియంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సోమవారం పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెస్ బోర్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికితీయుటకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు పాలమూరు ఎన్నారై ఫోరం చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపి వారిని అభినందించారు మండలంలోని 32 పాఠశాలలకు 117 చెస్ బోర్డులను పంపిణీ చేయడం జరిగిందని వారు అన్నారు . ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రశేఖర్, పాలమూరు ఎన్నారై ఫోరం సభ్యులు మాధవరం కరుణాకర్, చెల్ల శేఖర్, రవి ప్రకాష్ రమేష్ రెడ్డి , మహిపాల్ రెడ్డి వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి , పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు నీల శ్రీధర్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థి విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతులు బారులు



**చిలప్‌చేడ్, ఆగస్టు 18 (జనంసాక్షి) :** మండలంలోని సోమక్కపేట సొసైటీ పరిధిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు గత 15 రోజులుగా యూరియా కొరత ఉందని తెలిసినా సరైన సరఫరా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు మండలంలో రైతు ఆగ్రో కేంద్రాలు రెండు ఉన్న వాటికి యూరియా సరఫరా లేకపోవడంతో మండలంలోని రైతులకు చాలా ఇబ్బందికరంగా మారింది ఉన్న రెండు రైతు ఆగ్రో కేంద్రాలకు యూరియా సరఫరా చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సులువుగా అందుబాటులో ఉంటుందని గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఉన్న ఒక్క సొసైటీ లో రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయక రైతులను అరిగోష పెడుతున్న ప్రభుత్వ మూల్యం చెల్లించుకోక తప్పదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 18 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. గురుకుల విద్యా సంస్థలు, హాస్టళ్లు తనిఖీ చేయాలి రెసిడెన్షియల్ పాఠశాలలు,కె. జి. బి.వి.లు, సంక్షేమ హాస్టళ్లు మండల ప్రత్యేక అధికారులు,వివిధ శాఖల అధికారులు తమకు కేటాయించిన వాటిని తనిఖీ చేసి "విద్యా ఐ" అప్ లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో కల్జెక్టర్ వివిధ అంశాలపై సూచనలు చేశారు.మండల ప్రత్యేక అధికారులు,జిల్లా అధికారులు కేటాయించిన హాస్టళ్లు,గురుకుల పాఠశాలలు, కె.జీ.బి.వి.లు తనిఖీ చేసి సమస్యలను గుర్తిస్తే రిపేర్, మౌలిక వసతులు,అత్యవసర పనులను వెంటనే అంచనా వేసి మంజూరు తీసుకొని పనులు చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్లు తనిఖీ చేపట్టకపోవడం పట్ల కల్జెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి వారికి షోకాజ్ జారీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు పి.ఎం. ఏ వై సర్వే చేసి అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యతగా బావించి ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రతి రోజు 10 ఇండ్లు చేయాలని, అప్పుడే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ మంజూరు అవుతుందని తెలిపారు.5 శాతం కంటే తక్కువ సర్వే చేసి అప్లోడ్ చేసిన పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మండల ప్రత్యేక అధికారులు,ఎం.పి.డి. ఓ లు,ఈ అంశంపై ప్రతేక దృష్టి సారించాలని అన్నారు. వాతావరణ శాఖ సూచనలు వర్షాలు పడుతున్నందున అనుసరించి మండల ప్రత్యేక అధికారులు, ఏం.పి.డి.ఓలు, తహశీల్దార్‌లు, జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు మండలం లలో ప్రభుత్వ శాఖలు, పాత గృహాలు, కార్యాలయాలు శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని కూల్చి వేయాలని ఆదేశించారు. రోడ్లపై చెరువులు,కుంటలు నిండి రోడ్లు పై ప్రవహిస్తే బారికెడింగ్ పెట్టి ట్రాఫిక్ డైవర్ట్ చేయాలని,రోడ్లు,చెరువులు గండి పడిన తక్షణ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జడ్‌పిసిఈ ఓఓ వెంకట రెడ్డి, డిఆర్.డి.ఓ నర్సింహులు, గృహ నిర్మాణ శాఖ పిడి వైద్యం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.**



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 18(జనంసాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, ప్రజల కోసం సమాజం కోసం ఉమ్మడి హక్కుల కోసం పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్ లాంటి వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం అధికారికంగా జరపడం జరుగుతుందని, చాలా సంతోషకరమని అన్నారు. ప్రతి ఒక్కరూ మహనీయుల జీవిత చరిత్రను వారి త్యాగాలను గుర్తుంచుకోవాలని మర్చిపోతే మాత్రం మానవ మనుగడకు భవిష్యత్తు కష్టతరం అవుతుందని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ ప్రాంతంలోని ఖిలాషాపూర్ అనే గ్రామంలో జన్మించారని పశువుల కాపరిగా ఉంటూ రాజుల సైన్యాలను వారి ఆగడాలను ఎదిరించి, అరికట్టి ఉమ్మడి హక్కుల కోసం పోరాడారని, అన్యాయాలను ఎదిరించిన ఆయన జీవిత చరిత్ర మనకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో గౌడ్ అన్నలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కరించడం కొరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించేటట్లు చూస్తానని పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాలను త్వరలో ఏర్పాటు చేయుటకు, బీసీ భవన్ ఏర్పాటు చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం బిసి రిజర్వేషన్ 42 శాతం అమలు కు కట్టుబడి ఉందని, బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులకు కాటమయ్య 100 రక్షక కవచాలను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఎక్సైజ్ సిఐ సుధీర్ కుమార్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇంచార్జీ సర్దార్ సింగ్, బిసి కులస్థులు, బిసి సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు ఎంతో గొప్పవి

- ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సామాజిక సమరసత జిల్లా కన్వీనర్ బండారు రఘు
- చిన్నప్పటి నుంచే మంచి అలవాటు చేయడం విశేషం : ములుగు సీఐ డి.సురేష్
- ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా బాలగోకులం
- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో 800ల మంది విద్యార్థుల ప్రదర్శన



**ములుగు,ఆగస్ట్18(జనం సాక్షి):** భారతీయ సంస్కృతీ,సాంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారుల్లో సృజనాత్మకత ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రముఖ ఆధ్యాత్మక వేత్త, సామాజిక సమరసతా జిల్లా కన్వీనర్ బండారు రఘు, ములుగు సీఐ డి.సురేష్ అన్నారు.భిన్నత్వంలో ఏకత్వంలా ప్రజలు కలిసిమెలిసి జీవించడం కేవలం భారతదేశంలోనే కనిపిస్తోందని, మన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. ధర్మజాగరణ ఉత్సవ సమితి అధ్యక్షుడు గంద్రకోట కుమార్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం ములుగులోని డీఎల్ఆర్ గార్డెన్స్‌లో బాలగోకులం నిర్వహించారు. ములుగులోని బిట్స్, సెయింట్ ఆంథోనీస్, సన్‌రైజర్స్, శ్రీ అరవింద, లిటిల్ ఫ్లవర్, సాధన, బ్రాహ్మణి హైస్కూల్, బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్, వెంకటాపూర్‌లోని జోహార్ హైస్కూల్‌లకు చెందిన సుమారు 800లమంది చిన్నారులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణల నడుమ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బండారు రఘు మాట్లాడుతూ భారతీయ విలువలు,సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.శ్రీకృష్ణుడి తత్వం తెలుసుకుంటే ప్రపంచంలో ఉన్నత స్థాయిల్లో వెలుగొందుతారన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతో క్రమశిక్షణ అలవడుతుందని,25ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ములుగు సిఐ సురేష్ మాట్లాడుతూ గోకులాష్టమిని ఉత్తర భారతంలో ఎక్కువగా చూస్తామని,ప్రస్తుతం ములుగులో చిన్నారులు బుడిబుడి అడుగులు వేస్తూ శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలతో కనిపించడం సంతోషంగా ఉందన్నారు. చదువుతోపాటు వివిధ అంశాల్లో చిన్నారులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలను, కార్యక్రమ నిర్వాహకులను సీఐ అభినందించారు. విద్యార్థుల్లో మంచిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని స్పష్టం చేశారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలల యజమానులను సీఐ శాలువాతో సన్మానించి వ్యాస మహర్షి పటం, భగవద్గీత పుస్తకాలను మెమోంటోగా అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కనుకల చంద్రారెడ్డి, గౌతమ్ కళాశాల డైరెక్టర్స్ అంబీర శ్రీకాంత్, ధనుంజయ్, స్కూల్ ప్రిన్సిపల్స్ ఎండి.జాయిద్, కొలగాని రజినీకాంత్, కందాల రమేష్, పెట్టెం రాజు, కర్రా రాజేందర్ రెడ్డి, అక్కల సతీష్, ముద్దం సంతోష్, గిరిగాని కవిత,సముద్రాల మధుసూదనాచార్యులు, సురేందర్ రెడ్డి, ధర్మజాగరణ సమితి సభ్యులు రామగిరి శ్రీనివాస్, కొత్తపల్లి బాబురావు,దేవనూరి జయప్రకాష్, ఇమ్మడి ఓదెలు, తోట తిరుపతి, సల్వాల శ్రీహరి,కుసుమ రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులు నిర్భయంగా సమస్యలు చెప్పాలి

- జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బాధితులు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ సమస్యలను పోలీసులకు చెప్పాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన 18 మంది నుంచి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. పలువురు బాధితులతో మాట్లాడి, వారి సమస్యలు విని అక్కడికక్కడే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.





## గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయం

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్**

**పాలకుర్తి, ఆగస్టు 18 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం అభినందనీయమని, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు, ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ హరిత ఆసుపత్రిని సిఐ కాశీరాం నాయక్ తో కలిసి సందర్శించి పరిశీలించారు, ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ పట్టణ ప్రాంత తరహాలో గ్రామీణ ప్రాంతంలో అధునాతన వసతులతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం గ్రామీణ ప్రాంత ప్రజలకు వరం లాంటిది అన్నారు, అన్ని రకాల వైద్య సేవలు అందించడంలో శ్రీ హరిత ఆసుపత్రి యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఎక్కువగా ఉంటారని, వైద్యపరంగా పేదలను ఆదుకోవడంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సంజయ్ నాయక్, డాక్టర్ హరిత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్.పి**



**ములుగు బ్యూరో,ఆగస్ట్18(జనం సాక్షి):** రాష్ట్రంలో భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో మరియు ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో మరియు గోదావరి పరివాహక ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ఈ సందర్భంగా వరద ప్రవాహం ఉన్న వంతెనలు,కల్వర్ట్, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని, శిధిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్స్‌ఫర్స్ తాకవద్దని,గ్రామాలలో చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయట రావద్దని,వరద ప్రవాహల వద్ద బందోబస్త్ ఉన్న పోలీస్ సిబ్బంది సూచనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని సూచించారు.అదే విధంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని వాగులు, చెరువులు,కుంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని, ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు, ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం కోసం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు (ఎస్డిఆర్ఎఫ్),జిల్లా విపత్తు ప్రతిస్పందన దళాలు (డిడిఆర్ఎఫ్)బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది అని తెలియచేశారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని డయల్ 100 ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఇది తహసీల్ కార్యాలయమే!



**ఖానాపూర్ ఆగస్టు 18 (జనం సాక్షి) :** అసలే ఎడతెరిపి కురుస్తున్న భారీ వర్షాలు... అందులో ప్రజలను అప్రమత్తం చేస్తూ జాగ్రత్తలు పాటించాలని చెబుతున్న రెవెన్యూ శాఖ... ప్రజలను అవగాహన పరుస్తున్న రెవెన్యూ శాఖ సిబ్బంది మాత్రం ప్రమాదపు టంచులో ప్రమాదమని తెలిసినా విధులు నిర్వహిస్తున్నారు. దశాబ్దాల కాలంగా పురాతన భవనంలో విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ శాఖ సిబ్బంది ప్రస్తుతం పెంకులు ఊడిపోయి, చెక్కలు ఊడి కింద పడిపోయిన భవనంలో భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఓ పక్క రికార్డులను తిరగేస్తూ మరోపక్క ప్రమాదాన్ని గ్రహిస్తూ పనులను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సిబ్బంది ఇబ్బందిని గుర్తించి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కన్నాల ఎర్ర చెరువును కబ్జా కోరల నుంచి కాపాడాలని కలెక్టర్‌కు వినతి

- రైతు, సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్




**బెల్లంపల్లి, ఆగష్టు 18 (జనంసాక్షి) :** కన్నాల ఎర్ర చెరువును తిరుమల హిల్స్ రియల్ ఎస్టేట్ కబ్జా కోరల నుంచి కాపాడాలని రైతు- సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు. కన్నాల ఎర్ర చెరువు నుంచి వేల క్యూసెక్కుల నీరు వృధాగా పోతుందన్నారు. ఎర్ర చెరువును పునరుద్ధరించి, చెరువు కింద భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యకారులకు చేపల పెంపకం ఉపాధినిచ్చే చెరువును, గీతా కార్మికులకు ఉపాధినిచ్చే తాడి చెట్లను, సైతం గతంలోనే కబ్జా కోరులు కూకటివేళ్లతో తీసివేశారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపుకున్నారన్నారు. కన్నాల ఎర్ర చెరువుకు పైన సుబ్బారావు తోటలో మరొక రియల్ ఎస్టేట్ వ్యాపారం, ప్లాట్ల బిజినెస్ నడుస్తుందన్నారు. దీంట్లో కూడా ఒక చెరువు ఉందని, దీనికి కూడా గండి కొట్టారని ఆరోపించారు. ఇవి రెండు కూడా లింకు చెరువులని, కరోనా కాలంలోనే అవకాశాన్ని అదునుగా చేసుకొని చెరువు కట్టకు గండి కొట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు. పురాతన చెరువైన ఎర్ర చెరువును గతం నుండి బడా భూ యజమానికి అనుకూలంగా క్రమంగా కుదిస్తూ చెరువు విస్తీర్ణాన్ని తగ్గించి ఆ ప్రాంత బడా భూ యజమానికి అనుకూలంగా రికార్డులు తయారు చేయించుకొని ఎర్ర చెరువును కబ్జాకు గురి చేశారని ఆరోపించారు. ఇప్పుడు తిరుమల హిల్స్ యజమాన్యం ఏకంగా చెరువుకు గండి కొట్టడం ద్వారా నది భూగర్భంలోనే ఇండ్లు నిర్మించుకుంటూ, ఎఫ్టీఎల్, లెవెల్ లో ఫ్లాట్లు విక్రయిస్తున్నారన్నారు. ముంపుకు గురి కాకుండా ఉండడానికి ఏకంగా చెరువుకే గండి కొట్టి దాదాపు నాలుగు సంవత్సరాలు కావస్తున్న దీనిపై కన్నాల, లక్ష్మీపూర్ ప్రజలు, మాజీ సర్పంచు ఫిర్యాదు చేసినప్పటికీ దున్నపోతుపై వాన పడ్డట్టుగా స్పందించకుండా ఉంటున్నారన్నారు. అప్పటి బిఆర్ఎస్ ఎమ్మెల్యే డిఎంఎఫ్టి నిధులతో ఏకంగా ఈవెంచర్లోకి రోడు వేయించడం దానికి బలం చేకూర్చున్నదన్నారు. తమకేది బాధ్యత లేదన్నట్టుగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై, విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఎర్ర చెరువు ఆక్రమణపై సమగ్ర విచారణకు ఆదేశించి సంబంధిత అధికారులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు - సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరామ్ సింగ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎండీ చాంద్ పాషా, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ నాయకుడు గోగర్ల శంకర్, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ అంబాల మహేందర్, గోడిశెల లక్ష్మి, దుగుట రాజ్ కుమార్, చొప్పదండి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## వరదలతో పోటెత్తిన గోదావరి

**కాళేశ్వరం, ఆగస్టు 19 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామంలోని త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉగ్రరూపం దాల్చాయి. అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, మహారాష్ట్రలో భారీ వర్షాల వల్ల ఉభయ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరి పుష్కర ఘాట్ వద్ద వరద ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతూ 9 మీటర్ల చేరువలో ప్రవహిస్తుంది. మేడిగడ్డ బ్యారేజ్ కి ప్రవాహం ఎక్కువ కావడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీస్ ఆదేశాల మేరకు 85 గేట్లని ఎత్తి సుమారు నాలుగు లక్షల ఇరవై తొమ్మిది వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నామని అధికారులు తెలియజేశారు. రాబోయే 3, 4 రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## కార్మిక వాడల్లో చేరిన వరద నీరు



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 18(జనంసాక్షి):** ఆదివారం రాత్రి నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అతలాకుతలం అయ్యారు. వరదనీరు కాలువల పై నుండి ప్రవహిస్తూ కార్మిక కాలనీల్లో చేరాయి. కొన్ని చోట్ల ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎజోన్ లోని సూపర్ బజార్ నుండి రైల్వే స్టేషన్ వెళ్ళే మార్గంలో రోడ్డుపై నుండి వరదనీరు ప్రవహించడంతో అటుగా వెళ్లేవారికి అవస్థలు తప్పలేదు. ఆర్కే వన్ ఏరియాలోని రైల్వే అండర్ పాస్ రోడ్డులో వరదనీరు చేరడంతో మందమర్రి నుండి బిజోన్ కు రాకపోకలు నిలిచాయి. క్యాతనపల్లి మున్సిపాలిటీ లో కురుస్తున్న భారీ వర్షాలకు పుర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ కార్యాలయ ఫోన్ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు

**బోథ్,ఆగస్టు 18(జనంసాక్షి) :** ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగుల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేసిన వ్యక్తిని బోథ్ పోలీసులు అరెస్టు చేశారు.. వివరాలీలా ఉన్నాయి..కరీంనగర్ జిల్లాకు చెందిన మామీడాల సతీష్(39) అను వ్యక్తి రెవెన్యూ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని సంపత్నాయక్ తండా, పర్ది(బి),టివిటి గ్రామాలకు చెందిన యువకులను నమ్మించి రాథోడ్ సంజీవ్,బాపురావు,ఆత్రం జంగూ,బాబు,గణేష్ వద్దల దాదాపుగా ఐదు లక్షల యాభైవేల వరకు అందించారు.సతీష్ నుండి ఎటువంటి సమాచారం రాకపోవడం,ఫోన్ చేస్తే పొంతన లేని సమాధానం చెప్పడం ప్రారంభించారు.దీంతో తమ అంత మోసపోయాం అని భావించి బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు.బాధితుల ఫిర్యాదు మేర విచారణ చేపట్టిన సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ శ్రీ సాయి, సోమవారం సతీష్ ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు..

# ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేయాలి


- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



**వరంగల్ ప్రతినిధి, ఆగసు 18(జనంసాక్షి):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 33, జిడబ్ల్యూఎంసీ 18, గృహ నిర్మాణ శాఖ 9, వైద్య ఆరోగ్య, విద్య శాఖకు 4 చొప్పున, ఇతర శాఖలకు సంబంధించినవి 24 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.అర్జీలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవతా దృక్పథంతో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, రోడ్లు మరియు రవాణా, వైద్య ఆరోగ్య శాఖల జిల్లా అధికారులు శాఖల వారిగా అంతర్గత సమావేశాలు నిర్వహించుకొని పరిస్థితుల కనుగుణంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డిడబ్ల్యూఓ ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల జిల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్‌లో బిజెపి నాయకుల అరెస్టులు

- ఎమ్మెల్యే గృహనిర్బంధం
- ఎఫ్‌డిఓ కార్యాలయం ముట్టడికి ఎమ్మెల్యే పిలుపు
- పోలీసుల చర్యను ఖండించిన ఎమ్మెల్యే హరీష్ బాబు



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 18 (జనం సాక్షి) :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ అటవీశాఖ కార్యాలయం బిజెపి ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు పిలుపునిచ్చారు. జీవో నెంబర్ 49 రద్దు, పోడు భూముల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కాగజ్ నగర్ డివిజన్ అటవీశాఖ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో జిల్లా పోలీసు అధికారులు అప్రమత్తమై బిజెపి నాయకులను, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబును గృహ నిర్బంధం చేశారు. కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు ఎమ్మెల్యే హరీష్ బాబును ఇంటి నుండి బయటకు రాకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు శివకుమార్, బిజెపి నాయకులు సింధం శ్రీనివాస్, గోళం వెంకటేష్ తదితరులను ఇండ్ల నుండి తీసుకెళ్లి అరెస్టులు చేసి స్థానికంగా కాగజ్నగర్ పోలీస్ స్టేషన్కు తరలించకుండా , జిల్లాలో ని కెరమెరి పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. అక్కడ సాయంత్రం ఐదు గంటల వరకు పోలీస్ స్టేషన్లోనే ఉంచుకొని ఆ తర్వాత వదిలివేశారు. అదేవిధంగా చింతలమానపల్లి, దేహగాం తదితర మండలాల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు. పోలీసుల చర్యను ఎమ్మెల్యే హరీష్ బాబు తీవ్రంగా ఖండించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19 ఆగస్టు 2025

# పోలవరం బ్యాక్‌వాటర్‌తో భద్రాచలానికి ముప్పు

- పరిష్కరించవలసిన బాధ్యత కేంద్రానిదే..
- పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామ పంచాయతీలు భద్రాచలంకు ఇవ్వాలి
- పత్రికా సమావేశంలో రాజ్యసభ సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిటాస్




**భద్రాచలం, ఆగష్టు 18 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలవరం ప్రాజెక్ట్ కారణంగా గోదావరి నదీ ప్రవాహం వెనక్కి రావటం వల్ల భద్రాచల పట్టణమే కాక పరిసర గ్రామాలకు ముప్పు మరింత పెరిగిందని సిపిఎం రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిటాస్ అన్నారు. గోదావరి వరదలు ప్రతి ఏటా భద్రాచల పట్టణాన్ని ముంచెత్తుతున్నాయని పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో రాగానే ఈ వరదల తీవ్రత పెరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం కాపర్ డ్యాం వల్ల ప్రజలు ఇప్పటికే గృహ నష్టాలు, జీవనోపాధి తో పాటు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. పోలవరం వల్ల ఉత్పన్నమయ్యే బ్యాక్ వాటర్ ముంపు పట్టణ అభివృద్ధికి అడ్డంకి మాత్రమే కాకుండా ప్రజల ప్రాణాలకు ముప్పు అని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమస్యను కేంద్రం అత్యవసరంగా పరిగణించి నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో భద్రాచలానికి తిరుగులేని నష్టం సంభవిస్తుందని ఆయనన్నారు. చారిత్రిక నేపథ్యం గల భద్రాచలం శ్రీరాముని దేవాలయం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షత వీడాలని అన్నారు.

**పరిష్కరించవలసిన బాధ్యత కేంద్రానిదే..**

పోలవరం జాతీయ ప్రాజెక్ట్‌గా కేంద్రం స్వయంగా గుర్తించినందున దాని ప్రభావం వల్ల కలిగే ప్రతి సమస్యకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని బ్రిటాస్ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ముంపు ప్రాంతాలు పెరుగుతున్నాయి కాని పునరావాసం ఇంకా పూర్తికాలేదు. ప్రభావిత ప్రాంతాల ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యత నుంచి తప్పించుకోవడం కేంద్రానికి సాధ్యం కాదని ఆయనన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని గుర్తుచేశారు. ప్రాజెక్ట్ వ్యయ భారం పునరావాసం పరిహారం చెల్లింపులు రక్షణ గోడల నిర్మాణం అన్నీ కేంద్రం తీసుకోవాల్సిన చర్యలని బ్రిటాస్ స్పష్టం చేశారు.

**పరిపాలనా సౌలభ్యం కోసం ఐదు గ్రామ పంచాయతీలు భద్రాచలానికి ఇవ్వాలి**

భద్రాచలానికి అత్యంత సమీపంలో ఉన్న ఐదు గ్రామపంచాయతీలు ఇప్పటికీ వేరే మండలాల్లో ఉండడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బ్రిటాస్ అన్నారు. రోజువారీ పనులు విద్య, వైద్యం, రవాణా వంటి అంశాల కోసం ఈ గ్రామాల ప్రజలు భద్రాచలం పైనే ఆధారపడుతున్నప్పటికీ పరిపాలనా పరంగా వెనుకబడి పోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ గ్రామాల విలీనం ద్వారా అభివృద్ధితో పాటు, ప్రభుత్వ పథకాలు చేరుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తలచుకుంటే 5 సెకండ్లలో ఐదు గ్రామ పంచాయతీలు తెలంగాణలో కలపవచ్చన్నారు. అలాగే పట్టణ విస్తరణ సహజంగా జరుగుతూ భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రజల డిమాండ్లను గౌరవిస్తూ ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆయన గట్టిగా కోరారు. ఈ పత్రిక సమావేశంలో సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, ఎం.బి నర్సారెడ్డి, మండల కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎలమంచి వంశీ కృష్ణ, బండారు శరత్ బాబు, వై వెంకట రామారావు, డి సీతాలక్ష్మి, నాదెళ్ల లీలావతి, కుంజ శ్రీనివాస్, ఎస్ భూపేంద్ర, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి ఉత్తమ్‌కు వినతి పత్రం అందజేత



**కోదాడ, ఆగష్టు 18 (జనం సాక్షి) :** విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోదాడ విశ్రాంత ఉద్యోగులు రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయ, పెన్షనర్లు, పాత్రికేయులకు ఉచిత వైద్య పథకం అమలు చేయాలని, రిటైర్మెంట్ చాలా సంవత్సరాలు గడిచిన నేటి వరకు బెనిఫిట్స్ అందక విశ్రాంత ఉద్యోగులు చాలా అవస్థలు పడుతున్నారని తక్షణమే ప్రధానమైనటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీలైనంత త్వరలో తమ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, వేనేపల్లి శ్రీనివాసరావు, బొల్లు రాంబాబు, పొట్ట జగన్మోహన్ రావు, విద్యాసాగర్, రఘువర ప్రసాద్, ఖలీల్ అహ్మద్, గడ్డం నరసయ్య, హరిబాబు, పిచ్చిరెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగష్టు 18 (జనం సాక్షి) :** పీడితులు, బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామాన్యుడు, గొప్ప బహుజన విప్లవకారుడు, ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ నగరం పద్మావతి కాలనీ, గ్రీన్ బెల్ట్ లో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ విజయేందిరబోయితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం దాదాపు 350 ఏండ్ల కిందనే కృషి చేసిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, 17వ శతాబ్దంలోనే స్వీయ సైన్యంతో దక్కన్‌పై బహుజనుల సంక్షేమ బాధ్యత తీసుకొని తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు తొలి బహుజన రాజు అని ఆయన చెప్పారు. నిజాం పాలకులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి బహుజనుల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన బాటలో బహుజనులు, గౌడ కులస్తులు నడవాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. పాపన్న గౌడ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా ఉండేలా ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో శంకుస్థాపన చేసుకుంటున్నామని, తెలంగాణలో ప్రతి గ్రామ గ్రామాన ఆయన విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయన చరిత్ర భవిష్యత్ సమాజానికి తెలిసేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## తుంగతుర్తిలో ఆర్ఎంపీ వైద్య సేవలు బంద్

**తుంగతుర్తి, ఆగష్టు 18 (జనం సాక్షి) :** గత రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో ఆర్ఎంపి వైద్యుడు చేసిన ఆపరేషన్ వికటించడంతో మహిళ మృతి చెందింది. దీంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సుమోటోగా స్వీకరించి స్పందించింది. ఈ మేరకు మెడికల్ కౌన్సిల్ కు సంబంధించిన డాక్టర్లతో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రైవేట్ ఆసుపత్రికి సందర్శించి పాలు కీలక విషయాలు రాబట్టారు ఈ సమయంలో ఆసుపత్రి నిర్వహకుడు పరారీలో ఉన్నాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దీంతో జిల్లా అధికారులు తుంగతుర్తి ప్రాంతంలో ఉన్న ఆర్ఎంపి క్లినిక్లపై దృష్టి పెట్టడంతో వారు తనిఖీల కోసం వస్తున్నారని విషయం తెలిసిన మండల పరిధిలోని కొందరు ఆర్ఎంపీలు తమ క్లినిక్ లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. అధికారులు మాత్రం మండలంలో ఎవరికి కూడా క్లినిక్లు నడుపుకోవడానికి అనుమతులు లేవని తెలిపారు ఆర్ఎంపీ డాక్టర్లు కేవలం ఫస్ట్ ఎయిడ్ చేయడానికి పరిమితమని వాళ్లు ఎలాంటి ఆపరేషన్లు చేయటం గాని క్లీనిక్లలో బెడ్లు సైతం ఏర్పాటు చేయరాదని తెలుపుతున్నారు అలా చేసిన పక్షంలో వారిపై తనిఖీలు నిర్వహించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆర్ఎంపీలు తమ క్లినిక్లలో బెడ్లు ఏర్పాటు లేకుండా తాము కేవలం ఫస్ట్ ఎయిడ్ వైద్యమే చేస్తామని చెప్తున్నారు . ఎవరో ఒకరిద్దరూ ఆర్ఎంపి వైద్యులు చేసిన పనికి తాము అందరికీ వర్తింపజేయడం సబబు కాదన్నారు. తాము 24 గంటలకు ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేవలము ప్రాథమిక వైద్యమే చేస్తున్నామే తప్ప ఎలాంటి ఆపరేషన్ నిర్వహించడం లేదని పలువురు ఆర్ఎంపి వైద్యులు వాపోతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి

- సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా
- రాబోవు భవిష్యత్తు యువతరానిదే..



**ఖమ్మం రూరల్, ఆగష్టు 18 (జనం సాక్షి) :** గెలుపు అవకాశాలను అధ్యయనం చేసుకుంటూ సిపిఐ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం అవ్వాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. సోమవారం పల్లెగూడెం గ్రామంలో ఖమ్మం రూరల్ మండలం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఇటీవల మృతి చెందిన పార్టీ సభ్యులు , సానుభూతిపరులకు రెండు నిమిషాలు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నువ్వుల మోహన్ రావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో మౌలానా మాట్లాడుతూ... ఎదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం సిపిఐ పార్టీకి బలమైన కేంద్రాలు అన్నారు. అందుకు తగ్గట్టుగానే ఎన్నికలలో గల మన కీలక భూమిక ను ప్రజల్లోకి వెళ్లేలా దిశా నిర్దేశం చేశారు.కలిసివచ్చే అంశాలను సద్వినియోగం చేసుకుంటూ ఎర్రజెండా రెపరెపలాడేందుకు ప్రతి కార్యకర్త సైనికుల కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ... మున్ముందు యువతరం సిపిఐ లో కీలక భూమిక పోషించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సైతం ఈ సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి అన్నారు. అందుకు అనుగుణంగానే ఈ ప్రాంత పరిధిలోని యువతను నాయకత్వ దిశగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సంస్థాగతంగా బలోపేతం అయ్యేలా విస్తరణ వైపు ప్రయత్నం చేయాలని గ్రామ నాయకత్వానికి సూచించారు. . జిల్లా పార్టీ నుంచి ఇందుకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం పార్టీ గుర్తించిన ఎంపీటీసీ స్థానాలలో గెలుపు దిశగా చర్చించారు. ఆయా పరిధిలలో శాఖ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అలాగే ఎదురవుతున్న రాజకీయ ప్రతికూల పరిస్థితులపై కులం కుశంగా సభకు కౌన్సిల్ సభ్యులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు లింగ వెంకట నారాయణ ఎడ్లపల్లి శంకరయ్య పగిళ్ల వీరభద్రం వెంపటి సురేందర్, ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు సీతామాలక్ష్మి, సిపిఐ సీనియర్ నాయకుడు తేలపూడి కిషన్ రావు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సహాయ కార్యదర్శి బానోతు రామ్మూర్తి ,కళింగ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వినాశానికి యుద్ధాలే మూలం

- శాంతిని కోరుకుందాం..! యుద్ధాలను ఆపేద్దాం...!!
- గాజాపై ఇజ్రాయిల్ దాడులను పండిస్తూ దేవరకొండలో భారీ ర్యాలీ

**దేవరకొండ, ఆగష్టు 18 (జనం సాక్షి) :** పాలస్తీన్ గాజాలో జరుగుతున్న యుద్ధాలకు వ్యతిరేకంగా ఆ దేశ ప్రజలకు సంఘీభావంగా దేవరకొండ పట్టణంలో జమీయత్ వులేమా ఏ హింద్, ఇస్లాహే ముఅష్రా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద జరిగిన మానవహారంలో జమీయత్ నేత ముఫ్తి మొహమ్మద్ జావిద్ హుస్సేన్ ఖాస్మి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు శాంతిని కోలుకోవాలని, యుద్ధాలు మానవాళికే ప్రమాదమని, 1,70,000 మంది ప్రజలు గాజా లో మృతి చెందారని, తిండి లేక అల్లాడారని పసిపిల్లలు సైతం మరణించారని, ప్రపంచ వినాశానికి యుద్ధాలు ఒక మూలమని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఈ యుద్ధాలు ఆపాలని ఆ విధంగా ఐక్యరాజ్యసమితికి లేఖ పంపాలని భారతదేశ రాష్ట్రపతి గారికి ఈ నిరసన ద్వారా విన్నవించుకుంటున్నామని తెలిపారు. గాజాలో నివాసం లేక తిండి లేక లక్షలాదిమంది ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. తక్షణమే యుద్ధాలు ఆపి ప్రపంచ శాంతిని కోరుకోవాలని ఆ విధంగా అన్ని దేశాలు ముందుకు రావాలని కోరారు. మహిళలు, యువకులు వేలాదిగా తరలివచ్చి మానవహారం చేపట్టి ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని ఆరోపించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. స్థానిక సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసుల బందోబస్తు ఏర్పాటుచేసి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాథం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఏ సిరాజ్ ఖాన్, తయ్యబ్ మౌలానా, సయ్యద్ మాజిద్ మౌలానా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి యూనూస్, ఎండి ఇలియాస్ పటేల్, మహమ్మద్ నజీర్ మౌలానా, ఖాజామొయినుద్దీన్, సిపిఎం నాయకులు నల్ల వెంకటయ్య, ఎం ఏ అంజత్, మహమ్మద్ మునీర్, ఎండి అతిఖ్, ఉమెర్, సయ్యద్ మోయిన్, ఇస్మాయిల్, ఎండి నజీర్,ఇల్యాస్ బాబా,తదితరులు పాల్గొన్నారు.






## ఈ నెల 21న సీఎం రేవంత్ రెడ్డి చంద్రుగొండ పర్యటన

- పర్యటన వివరాలు తెలియజేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



**చంద్రుగొండ, ఆగష్టు 18 (జనం సాక్షి) :** ఈ నెల 21న సీఎం రేవంత్ రెడ్డి చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామానికి విచ్చేయనున్న సందర్భంగా అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ పర్యటన వివరాలు తెలియజేశారు. 21 మధ్యాహ్నం రెండు గంటలకు చంద్రుగొండకు ముఖ్యమంత్రి చేరుకుంటారని, 2:10 బెండలంపాడు చేరుకుని 2:20 కు లబ్ధిదారుల ఇళ్ల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ఒక్కో ఇంటి వద్ద 15 నిమిషాలపాటు లబ్ధిదారులతో మాట్లాడే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2:50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 3:00 గంటల నుంచి ప్రజాసభలో పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. హెలిప్యాడ్, లైటింగ్, తాగునీరు, పార్కింగ్, ప్రజా సౌకర్యాలు, డయాస్ ఏర్పాటు, మీడియా కోసం ప్రత్యేక వేదిక, బారికేడింగ్, భద్రత వంటి అంశాలన్నీ విభాగాలవారీగా సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన రోజున ఎక్సైజ్, సిపిఓ, పోలీసు అధికారులు సమగ్రంగా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

# ఈ నెల 21న చంద్రుగొండకు రానున్న సీఎం రేవంత్ రెడ్డి

- లక్ష మందితో సభ ఏర్పాట్లకు సన్నాహాలు



**చంద్రుగొండ, ఆగష్టు 18 (జనం సాక్షి) :** నాడు వైఎస్ఆర్ హాయంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలు చేపడితే , నేడు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టింది. రాష్ట్రంలో రూ. 5 లక్షలతో ఇళ్ళు నిర్మిస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలుస్తుందని రెవెన్యూ, గృహ, సమాచార శాఖల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అది బిజెపి పాలిత రాష్ట్రాల్లో సైతం రూ. 5 లక్షలతో పేదలకు ఇళ్ళు నిర్మించలేదని ఆయన విమర్శించారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 25 లక్షల ఇళ్లు నిర్మించగా, గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ళు నిర్మిస్తే కమిషన్లు రావని బడుగుల ఆశలపై నీళ్లు చల్లి ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి సర్కారు తొలి విడతగా నిర్మిస్తున్న నాలుగున్నర లక్షల ఇళ్లలో 2.52 లక్షల ఇళ్లు ఇప్పటికే వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. రాబోయే మూడు సంవత్సరాల్లో ఇంకా రాని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసి నిర్మిస్తామన్నారు.

**బెండలపాడులో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి**

ఈనెల 21న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రుగొండ మండలం బెండలపాడు పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**బెండలపాడు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి : ఎమ్మెల్యే జారే**

చంద్రుగొండ మండలం బెండలపాడు సమీపంలోని కనకగిరి గుట్టల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. రాష్ట్రంలోనే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఎస్పీ రోహిత్ రాజ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే రాందాస్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి నిర్మాణ ప్రాంతాలను, హెలిపాడ్, సభాస్థలిని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మువ్వా విజయ్ బాబు, కార్తీక్, నాగ సీతారాములు, భోజ్య నాయక్, అంకిరెడ్డి, నల్లమోతు వెంకటరమణ, తుమ్మలపల్లి సురేష్, అశ్వారావుపేట కాంగ్రెస్ సేవాలాల్ ప్రధాన కార్యదర్శి ఫజల్ భక్ష్, జిల్లా దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్, బోయిన భోగి కోటేశ్వరరావు, సారేపల్లి శేఖర్, సుంద్రు విజయ్, ఇమ్రాన్, వసీమ్ పాషా , కిరణ్ రెడ్డి, కృష్ణవేణి, గుగులోతు రాములు, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలోను ఉద్యమకారులకు అన్యాయం

- సెప్టెంబర్ 12న టీయుజేఏసీ మహా ధర్నా




**సూర్యాపేట ప్రతినిధి, ఆగష్టు 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని భావిస్తే చివరికి అన్యాయమే జరిగిందని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర మహిళా వింగ్ అధ్యక్షురాలు కోతి మాధవి రెడ్డి,తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుండాల సందీప్ యాదవ్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని రైతు మార్కెట్ రోడ్డులో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సెప్టెంబర్ 12న ఇందిరా పార్కు వద్ద జరిగే టియుజేఏసీ మహాధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర పీడితను తొలగించుకొని తెలంగాణను తెచ్చుకున్న ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తమకు ఇంటి స్థలాలు, పెన్షన్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరికి వెళ్లిన ఇంత వరకు ఉద్యమకారులను ఎవరు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మాజీ సీఎం కేసీఆర్ తన కుటుంబమే తప్ప తెలంగాణ కోసం ఉద్యమకారులు చేసిన పోరాటాలు మాత్రం గుర్తు పెట్టుకోలేదని తెలిపారు. సెప్టెంబర్ 12న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద టియు జేఏసీ మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ధర్నాలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు, విద్యార్థి సంఘాలు, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాధర్నా తర్వాత తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో టీయుజేఏసీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి మురళి, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర నాయకులు మల్లయ్య యాదవ్,తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు వీరబోయిన రవి యాదవ్, మల్లయ్య యాదవ్, సంతోష, కమలమ్మ, గణేష్, రాజు, సుధాకర్, చంద్ర రామ్మూర్తి, శ్రీనివాస్, రాఘవులు, విజయ్ పాల్గొన్నారు.




# టయోటా స్పెషల్ ఎడిషన్

## 25.4 కిమీ/లీ మైలేజ్

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**ప్రముఖ వాహన తయారీ సంస్థ టయోటా.. దేశీయ మార్కెట్లో కొత్త 'క్యామ్రీ స్ప్రింట్ ఎడిషన్'ను రూ. 48.50 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరతో లాంచ్ చేసింది.కంపెనీ లాంచ్ చేసిన ఈ స్పెషల్ ఎడిషన్ స్పెషల్ యాక్సెసరీ కిట్‌తో లభిస్తుంది. కాబట్టి ఇది స్టాండర్డ్ మోడల్ కంటే కూడా చాలా కొత్తగా కనిపిస్తుంది.టయోటా క్యామ్రీ స్ప్రింట్ ఎడిషన్.. ఎమోషనల్ రెడ్, ప్లాటినం వైట్ పెర్ల్, సిమెంట్ గ్రే, ప్రెషియస్ మెటల్ %డ% డార్క్ బ్లూ మెటాలిక్ అనే కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. అయితే బానెట్, రూఫ్ వంటివి మ్యాట్ బ్లాక్ కలర్ పొందుతాయి. ఈ కారులోని 18 ఇంచెస్ అల్లాయ్ వీల్స్ బ్లాక్-అవుట్ ఫినిషింగ్‌ను పొందుతాయి.క్యామ్రీ స్ప్రింట్ ఎడిషన్.. లోపలి భాగంలో యాంబియంట్ లైటింగ్, పుడిల్ లాంప్స్ వంటివి పొందుతుంది.12 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, డిజిటల్ డ్రైవర్ డిస్ప్లే, పవర్డ్ అండ్ వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, 3 జోన్ క్లైమేట్ కంట్రోల్, హెడ్స్ అప్ డిస్ప్లే వంటి వాటితో పాటు 9 స్పీకర్ జేబీఎల్ సౌండ్ సిస్టమ్ వంటివన్నీ కూడా ఈ స్పెషల్ ఎడిషన్లో ఉన్నాయి.టయోటా లాంచ్ చేసిన క్యామ్రీ స్ప్రింట్ ఎడిషన్ డిజైన్ పరంగా అప్డేట్ పొందినప్పటికీ.. యాంత్రికంగా ఎలాంటి మార్పులు పొందలేదు. కాబట్టి ఇందులో సాధారణ క్యామ్రీలోని 2.5 లీటర్ నాలుగు సిలిండర్స్ పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. ఇది 187 హార్స్ పవర్, 221 న్యూటన్ మీటర్ టార్క్, ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 7.2 సెకన్లలోనే 0 నుంచి 100 కిమీ వరకు వేగవంతం అవుతుంది. ఇది లీటరుకు 25.4 కిమీ మైలేజ్ అందిస్తుంది. దీంతో ఈ కారు భారతదేశంలో అమ్మకానికి ఉన్న అత్యధిక మైలేజ్ కార్ల జాబితాలో ఒకటిగా మారింది.

## ఇంటెల్ రహస్య పత్రాలు దొంగలించి మైక్రోసాఫ్ట్‌లో..

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**చట్టవిరుద్ధంగా కంపెనీ రహస్య పత్రాలను దొంగలించి మైక్రోసాఫ్ట్‌తో పంచుకున్న ఇంటెల్ మాజీ ఇంజినీర్‌కు రెండేళ్ల జైలు శిక్షతోపాటు 34,000 డాలర్ల(సుమారు రూ.29 లక్షలు)కు పైగా జరిమానా విధించిం చారు.ఇంటెల్‌లో ప్రొడక్ట్ మార్కెటింగ్ ఇంజినీర్‌గా దాదాపు పదేళు పనిచేసిన వరుణ్ గుప్తాకు ఇటీవల ఈమేరకు శిక్ష ఖరారు చేశారు. ఈ దుష్ప్రవర్తన కారణంగా మైక్రోసాఫ్ట్ కూడా వరుణ్‌ను పదవి నుంచి తొలగించింది.అసిస్టెంట్ యూఎస్ అటార్నీ విలియం నరస్ తెలిపిన వివరాల ప్రకారం.. గుప్తా ఇంటెల్ కంపెనీకి 2020లో రాజీనామా చేయడానికి ముందు సంస్థ కేటాయించిన కంప్యూటర్ నుంచి వేలాది రహస్య ఫైళ్లను వ్యక్తిగత హార్డ్ డ్రైవ్‌కు బదిలీ చేసుకున్నాడు. తర్వాత కంప్యూటర్ ప్రాసెసర్లతో కూడిన ఒప్పందంతో మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగంలో చేరాడు. ఇంటెల్‌లో దొంగలించిన ఫైళ్లను కొంత కాలానికి మైక్రోసాఫ్ట్‌లో యాక్సెస్ చేశాడు. గుప్తా యాక్సెస్ చేసిన డాక్యుమెంట్లలో ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంది. ఇది ఇంటెల్ ధరల వ్యూహాన్ని సూచిస్తుంది.


రాబర్ట్ కియోసాకి.. వారెన్ బఫెట్

# పెట్టుబడి మంత్ర

## బంగారం, వెండి, బిట్‌కాయిన్ ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**

బంగారం, వెండి, బిట్‌కాయిన్.. ఈ మూడు గత ఒక సంవత్సరంలో పెట్టుబడిదారులకు భారీ రాబడులను ఇచ్చాయి. అంతకు ముందుతో పోలిస్తే బంగారం ధర 40 శాతం పెరిగింది. దీంతో 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.లక్ష దాటేసింది. కేజీ వెండి ధర రూ.1.16 లక్షల వద్ద ట్రేడవుతోంది. బిట్‌కాయిన్ అద్భుతాలు చేస్తోంది. దీని విలువ 111 శాతం పెరిగి, కోటి రూపాయలు దాటేసింది. ఈ మూడింటిలో దేనిని ఎంచుకోవాలని కొందరు పెట్టుబడిదారులు సతమతమవుతుంటారు. ఈ ప్రశ్నకు రాబర్ట్ కియోసాకి వారెన్ బఫెట్ ఏం చెబుతారంటే.. 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి.. బంగారం, వెండి, బిట్‌కాయిన్ 'నిజమైన డబ్బు' అని చెబుతారు. ఎందుకంటే డబ్బును అదా చేస్తే.. దాని విలువ పెరగదు. వీటిపై (బంగారం, వెండి, బిట్‌కాయిన్) ఇన్వెస్ట్ చేస్తే విలువ పెరుగుతుంది,



సంపన్నులవుతారని అంటారు. డాలర్ లాంటి కరెన్సీలను ఆయన 'నకిలీ డబ్బు' అని పిలుస్తారు.పేదలు, మధ్యతరగతి వారు దాదాపు డబ్బును బ్యాంకుల్లోనే దాచుకుంటారు. ఆ డబ్బు బ్యాంక్ ఖాతాలోనే ఉంటుంది. దాని విలువ ఎప్పటికీ పెరగదు. కానీ డబ్బును రియల్ ఎస్టేట్, బంగారం, చమురు, షేర్స్ వంటి వాటిలో ఇన్వెస్ట్ చేస్తే.. మీ సంపద పెరుగుతుందని కియోసాకి చెబుతారు. ప్రపంచంలోని గొప్ప పెట్టుబడిదారులలో ఒకరైన వారెన్ బఫెట్.. పెట్టుబడిదారుడిగా అతని జ్ఞానాన్ని పెట్టుబడి ప్రపంచంలో బైబిల్‌గా పరిగణిస్తారు. అయితే బంగారం పనికి రానిదని, వెండి మంచిదని, బిట్‌కాయిన్‌కు విలువ లేదని చెబుతారు. బంగారం ఏమీ చేయదు.. అక్కడే ఉంటుంది. ఏదైనా ఆస్తి ఉత్పాదకంగా ఉన్నప్పుడు మాత్రమే విలువ పెరుగుతుందని బఫెట్ విశ్వసిస్తారు.బంగారం మీద పెట్టుబడి చూపడానికి ఆసక్తి చూపని బఫెట్.. వెండి మీద ఇన్వెస్ట్ చేయడానికి సుముఖత చూపుతారు. ఎందుకంటే.. వెండి ఎలక్ట్రానిక్స్, సౌర ఫలకాలు, వైద్య పరికరాల వంటి వాటిలో ఎక్కువగా ఉపయోగిస్తారు. భవిష్యత్తులో దీనికి మంచి వాల్యూ ఉంటుందని చెబుతారు. బిట్‌కాయిన్ లేదా క్రిప్టోకరెన్సీ ఏ ఉత్పాదక కార్యకలాపాలతోనూ సంబంధం లేదని ఆయన నమ్ముతారు.

## హైదరాబాద్‌లో మోంట్రా ఎలక్ట్రిక్ డీలర్‌షిప్

**హైదరాబాద్,జనంసాక్షి:**మురుగప్ప గ్రూప్.. క్లీన్ మొబిలిటీ విభాగం అయిన మోంట్రా ఎలక్ట్రిక్, శ్రీరామ్ హర్షతో కలిసి హైదరాబాద్‌లో తన మొట్టమొదటి ఎలక్ట్రిక్ స్మాల్ కమర్షియల్ వెహికల్ డీలర్‌షిప్‌ను ప్రారంభించింది. మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌ను పరిష్కరించడానికి మాత్రమే కాకుండా.. కంపెనీ తన ఉనికిని విస్తరించడంలో భాగంగా డీలర్‌షిప్ ప్రారంభించింది.మోంట్రా ఎలక్ట్రిక్ డీలర్‌షిప్‌లో కమర్షియల్ వెహికల్స్ ప్రదర్శిస్తారు. ఇవి తక్కువ పేలోడ్ కెపాసిటీ కలిగి.. చిన్న వ్యాపారాలకు అనుకూలంగా ఉంటాయి. వీటి మెయింటెనెన్స్ కూడా చాలా సులభంగా ఉంటుంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న లాజిస్టిక్స్ కంపెనీలు, ఫ్లీట్ యజమానులు, వ్యవస్థాపకుల నెట్‌వర్క్ వంటి వాటికి సేవలు అందించడానికి కంపెనీ డీలర్‌షిప్ ప్రారంభించింది. వెహికల్ 80 కిలోవాట్ మోటారు ద్వారా 300 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 245 కిమీ రేంజ్ అందిస్తుందని ధ్రువీకరించబడినప్పటికీ.. రియల్ వరల్డ్ రేంజ్ 170 కిమీ కంటే ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. కంపెనీ ఈ వెహికల్ కొనుగోలుపై ఏడు సంవత్సరాలు లేదా 2.5 లక్షల కిమీ వారంటీ అందిస్తోంది.హైదరాబాద్‌లో డీలర్‌షిప్ ప్రారంభ కార్యక్రమానికి.. ఐటీ క్లీన్ మొబిలిటీ చైర్మన్ అరుణ్ మురుగప్పన్, టీఐ క్లీన్ మొబిలిటీ మేనేజింగ్ డైరెక్టర్ జలజ్ గుప్తా, ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ సాజు నాయర్ మొదలైనవారు పాల్గొన్నారు.



టెక్ దిగ్గజం కొత్త రూల్..

## జనవరి నుంచే అమలు!

**న్యూఢిల్లీ,జనంసాక్షి:**ప్రముఖ టెక్ కంపెనీలలో ఒకటైన.. మైక్రోసాఫ్ట్ తన హైబ్రిడ్ పని నియమాలను మరింత కఠినతరం చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఉద్యోగులు ఎక్కువ సమయం ఆఫీసులో ఉండాలని..వారానికి మూడు రోజులు తప్పనిసరిగా ఆఫీసుకు రావాలని చెబుతోంది. ఈ రూల్ జనవరి నుంచి అమలులోకి వచ్చే అవకాశం ఉంది.వచ్చే ఏడాది ప్రారంభం నుంచి ఉద్యోగులు ఆఫీసుకు రప్పించడానికి.. మైక్రోసాఫ్ట్ అన్ని ఏర్పాట్లను చేస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను కంపెనీ సెప్టెంబర్‌లో విడుదల చేసే అవకాశం ఉంది. 2020 చివర నుంచి సౌకర్యవంతమైన పని జీవితాన్ని అందించిన మైక్రోసాఫ్ట్.. ఇప్పుడు కొంత కఠినంగా వ్యవహరిస్తోంది.వర్క్ ఫ్రమ్ హోమ్ పాలసీ అమలు చేసిన తరువాత చాలామంది ఇంటి నుంచి పనిచేయడానికే అలవాటు పడిపోయారు. అయితే ఈ విధానానికి స్వస్తి చెప్పడానికి కంపెనీ తగిన ఏర్పాట్లను చేస్తోంది. ఇందులో భాగంగానే వారానికి మూడు రోజులు ఆఫీసుకు రావాలనే కొత్త విధానం అమలు చేయడానికి సంకల్పించింది. చాలామంది ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి అలవాటు పడిపోవడం చేత.. మళ్ళీ ఆఫీసులకు రావాలంటే కొంత కష్టంగానే భావిస్తారు.




# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**జనంసాక్షి:**సోమవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 676.09 పాయింట్లు లేదా 0.84 శాతం లాభంతో 81,273.75 వద్ద, నిఫ్టీ 245.65 పాయింట్లు లేదా 1.00 శాతం లాభంతో 24,876.95 వద్ద నిలిచాయి.పెన్నార్ ఇండస్ట్రీస్, లక్ష్మీ ఆర్గానిక్ ఇండస్ట్రీస్, %×ఖీదీ% ఇండస్ట్రీస్, సదరన్ పెట్రోకెమికల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, రవీందర్ హైట్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ప్రీతి ఇంటర్నేషనల్, అగర్వాల్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, డేటామాటిక్స్ గ్లోబల్ సర్వీసెస్, ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్, %చీణూ% వెంచర్స్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.90 | ₹ 4.92 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 92,750 (22 క్యారెట్లు) | ₹ 1,01,180 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,27,000

భారత్-పాక్‌లలో పరిస్థితులను

# గమనిస్తూనే ఉన్నాం

- ట్రంప్‌కు రూబియో వంతపాట

**వాషింగ్టన్,జనంసాక్షి:**భారత్- పాక్‌లలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను అమెరికా అనుక్షణం గమనిస్తున్నదని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో వెల్లడించారు.సుదీర్ఘ ఘర్షణల తర్వాత కాల్పుల విరమణను కొనసాగించడం సవాలుగా మారుతుందని అందుకే అమెరికా.. భారత్-పాక్‌లపై ఓ కన్నేసి ఉంచిందని ఆయన పేర్కొన్నారు.ప్రపంచంలోని ఇతర ఉద్రిక్తతల దేశాలతో పాటు భారత్-పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న పరిస్థితిని అమెరికా ప్రతిరోజూ గమనిస్తున్నదని, ప్రస్తుత, భావి సంఘర్షణలను నిరోధించే శాంతి ఒప్పందం లక్ష్యంగా అమెరికా దృష్టి సారించిందని రూబియో అన్నారు. 'ప్రతిరోజూ పాకిస్తాన్-భారతదేశం మధ్య ఏమి జరుగుతున్నదో, కంబోడియా- థాయిలాండ్ మధ్య ఏమి చోటుచేసుకుంటున్నదో తాము నిరంతరం గమనిస్తూనే ఉన్నామని రూబియో మీడియాకు తెలిపారు. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడు అమెరికా కాల్పుల విరమణకు పిలుపునిస్తున్నదని, అయితే శత్రుత్వం కొనసాగుతున్నప్పుడు చర్చలు జరపడం కష్టమని రూబియో తన అభిప్రాయం వ్యక్తం చేశారు. యుద్ధ విరమణకు ఏకైక మార్గం ఇరుపక్షాలు పరస్పరం కాల్పుల విరమణకు అంగీకరించడమేనన్నారు. అయితే రష్యన్లు ఇందుకు



అంగీకరించలేదని, ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. సుదీర్ఘ ఘర్షణల తర్వాత కాల్పుల విరమణ అనేది చాలా త్వరగా విచ్ఛిన్నమవుతుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం మాత్రమే కాకుండా, భవిష్యత్తు సంఘర్షణలను నిరోధించేలా శాంతి ఒప్పందం కుదరడం లక్ష్యంగా ఉండాలని రూబియో పేర్కొన్నారు.కాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో తాను భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించానని, పదేపదే చెబుతూ వచ్చారు. తన జోక్యంతో రెండు అణ్వాయుధ దేశాల మధ్య కాల్పుల విరమణకు సహకరించానని ట్రంప్ వాదించారు. అయితే భారత్ ఈ వాదనలను తిరస్కరించింది. పాకిస్తాన్‌తో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారం ద్వైపాక్షికంగానే జరుగుతున్నదని, మూడవ పక్షం మధ్యవర్తిత్వం పాత్ర ఏమీలేదని స్పష్టం చేసింది.

# ఉక్రెయిన్‌ను ఇరుకున పెట్టిన పుతిన్

- జెలెన్‌స్కీతో ట్రంప్ కీలక భేటీ

**వాషింగ్టన్,జనంసాక్షి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం(అమెరికా కాలమానం ప్రకారం) జెలెన్‌స్కీతో వైట్‌హౌస్‌లో భేటీ కానున్నారు. పుతిన్‌తో భేటీ వివరాలు, ప్రతిపాదనలను ఆయన ముందుంచనున్నారు.భేటీ విజయవంతమైతే ఈయూ దేశాల అగ్ర నేతలతోనూ ట్రంప్, జెలెన్‌స్కీ సమావేశం అవుతారు. ఈ నేపథ్యంలో యుద్ధం ఎలా మొదలైందో ఓసారి గుర్తు తెచ్చుకోవాలని జెలెన్‌స్కీకి ట్రంప్ సూచించినట్టు సమాచారం. ఇక, శాంతి ఒప్పందానికి పుతిన్.. ట్విస్ట్ ఇస్తూ కీలక ప్రతిపాదన చేసినట్టు తెలిసింది. డోన్బాస్ తూర్పు ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌పై పుతిన్ అజమాయిషీ కోరుతున్నట్టు జెలెన్‌స్కీకి ట్రంప్ చెప్పారని సమాచారం. అవిచ్చేస్తే యుద్ధం ఆపేస్తానని పుతిన్ ప్రతిపాదించినట్టు వివరించారు. అందుకు జెలెన్‌స్కీ ఒప్పుకోలేదని తెలుస్తోంది. సోమవారం ముఖాముఖిలో ఇందుకు జెలెన్‌స్కీని ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నారు. తూర్పు డోన్బాస్ అంశమే శాంతి ఒప్పందానికి కీలకమని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. తూర్పు డోన్బాస్‌ను ఇచ్చేశాక పుతిన్ తాత్కాలికంగా యుద్ధాన్ని ఆపేసినా, తమపై రష్యా భావి దండయాత్రకు అదే కారణంగా మారవచ్చు అనేది జెలెన్‌స్కీ ఆందోళనగా కనిపిస్తోంది.మరోవైపు.. డొనాల్డ్ ట్రంప్‌తో భేటీకి ఒంటరిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని పంపేందుకు ఐరోపా నేతలు భయపడుతున్నారు. ఫిబ్రవరిలో ట్రంప్‌ను కలిసేందుకు అమెరికా వెళ్లిన జెలెన్‌స్కీకి వైట్‌హౌస్‌లో చేదు అనుభవం ఎదురైన సంగతి తెలిసిందే. మూడో ప్రపంచయుద్ధం



వచ్చేలా చేయొద్దంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ట్రంప్ ఆ భేటీలో విరుచుకుపడ్డారు.ఈ నేపథ్యంలో ఈసారి జెలెన్‌స్కీకి తోడుగా బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ తదితరులు పాల్గొంటారు. ఇక?, ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరకున్నా అదే తరహాలో రక్షణ హామీ ఇచ్చేందుకు ట్రంప్ ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్టు ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డీర్ లేయిన్ చెప్పారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ యుద్ధం ఆపేందుకు అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్ మధ్య రెండున్నర గంటలకు పైగా జరిగిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే.

## మోదీకి పుతిన్ ఫోన్

**మాస్కో(జనంసాక్షి):**అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై చర్చలు జరిగిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో వ్లాదిమిర్ పుతిన్ తనకు ఫోన్ చేసినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో'ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో జరిగిన సమావేశం గురించి ఫోన్‌లో మాట్లాడి, తన అభిప్రాయాలను పంచుకున్నారు. నా స్నేహితుడు పుతిన్‌కు ధన్యవాదాలు. ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని భారత్ నిరంతరం కోరుకుంటుంది.ఈ విషయంలో జరుగుతున్న అన్నీ ప్రయత్నాలకు భారత్ మద్దతు పలుకుతుంది'అని పేర్కొన్నారు..

## మోదీతో శుభాంశు భేటీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం యాత్రను పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా నేడు ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శుభాంశు తన రోదసి ప్రయాణ విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. యాత్ర విజయవంతంపై మోదీ ఆయన్ను అభినందించారు. "శుభాంశు శుక్లాతో సంభాషణ గొప్పగా సాగింది. అంతరిక్షంలో ఆయన అనుభవాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగతి, భారత్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'గగన్‌యాన్' మిషన్ సహా అనేక అంశాలపై చర్చించాం. రోదసిలో శుభాంశు సాధించిన ఘనత పట్ల యావత్ దేశం గర్విస్తోంది" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు."దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన సర్వే చేశాం. కులగణన సర్వేలో తప్పులుంటే చూపాలని రాజకీయ పార్టీలకు సవాల్ విసిరాం. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు శాసనసభ వేదికగా సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పాం" అని అన్నారు.

# 'రాధాకృష్ణన్‌తో లాభం లేదు

## ఇండియాకు మనం గట్టి అభ్యర్థిని నిలబెడదాం'

**చెన్నై,జనంసాక్షి:** ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలో ఇండియా కూటమిలో చర్చలు జరుగుతున్నాయి. కూటమి తరఫున ఎవరిని బరిలో నిలపాలి అనే చర్చ నడుస్తోంది.ఈ నేపథ్యంలో తమిళనాడుకు చెందిన వ్యక్తినే ఎంపిక చేయాలని డీఎంకే సీనియర్ నాయకుడు తన అభిప్రాయం వ్యక్తం చేశారు. సదరు నేత అంతటితో ఆగకుండా.. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌తో తమిళనాడుకు ప్రయోజనం లేదని చెప్పడం మరింత ఆసక్తికరంగా మారింది.వివరాల ప్రకారం.. ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దించే అంశంపై విపక్ష 'ఇండియా' కూటమి నేతలు సోమవారం సమావేశమయ్యారు. కూటమి పార్లమెంటరీ పక్ష నేతలు.. రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో డీఎంకే సీనియర్ నాయకులు ఇళంగోవన్ స్పందించారు. మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక కావడం కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది భారత ఉప రాష్ట్రపతి పదవి. రాధాకృష్ణన్ బీజేపీ అభ్యర్థి.. ఆర్ఎస్ఎస్ వ్యక్తి. ఆయన తమిళనాడుకు చెందిన వ్యక్తి అయినప్పటికీ మా రాష్ట్రానికి ప్రత్యేకంగా జరిగే మంచి ఏమీ ఉండదు. దీన్ని భాష ద్వారా మాత్రమే కాకుండా రాజకీయంగా చూడాలి.బీజేపీ నేతృత్వంలోని బీజేపీ.. ఇప్పటికే పలుమార్లు తమిళులను అవమానించింది. బీజేపీ.. తమిళుల కోసం పనిచేయలేదు. కేంద్రంలోని పెద్దలు.. తమిళనాడు విద్యార్థులకు ఎటువంటి సాయం అందించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా డీఎంకే నుంచే అభ్యర్థి ఉంటేనే రాష్ట్రానికి మంచి జరుగుతుంది. అందుకే రాధాకృష్ణకు పోటీగా తమిళనాడు నుంచే.. అది కూడా డీఎంకే నుంచి అభ్యర్థి ఎంపిక చేయాలని కోరుతున్నాను అని అన్నారు. చివరగా.. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో ఇండియా బ్లాక్ తీసుకున్న నిర్ణయానికే తమ పార్టీ కట్టుబడి ఉంటుందని చెప్పుకొచ్చారు.మరోవైపు.. ఇండియా కూటమిలో కొంత మంది నేతలు



ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టకూడదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా బీహార్ ఎన్నికలు దగ్గరలో ఉన్నందున అధికార పక్షం క్రాస్ ఓటింగ్ ద్వారా తమ బలాన్ని పెంచుకుంటే.. అది బీహార్ ఓటర్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని వారు భావించారు.కాంగ్రెస్ వర్గాల సమాచారాల ప్రకారం.. విపక్ష అభ్యర్థి కాంగ్రెస్ నుంచే ఉండాలనే నిబంధన ఏమీ లేదు. మిత్రపక్షాలు తటస్థ, స్వచ్ఛమైన నేపథ్యం ఉన్న అభ్యర్థి పేరును సూచిస్తే, కాంగ్రెస్ కూడా దానికి అంగీకరించే అవకాశం ఉంది. అయితే బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా ఒక అభ్యర్థిని నిలబెట్టి, సిద్ధాంతపరమైన పోరాటాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ కోరుకుంటుంది. సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ.. ఎన్నికల బరి నుంచి తప్పుకోవడం అంటే బీజేపీకి స్వేచ్ఛగా మార్గం ఇవ్వడమేనని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ విషయంపై రాహుల్ గాంధీ చర్చించనున్నట్లు తెలుస్తోంది. రాహుల్ ఈ నెల 19న సాయంత్రం ఢిల్లీకి తిరిగి వచ్చి మళ్లీ 21న బీహార్ వెళ్లనున్నారు. ఈ సమయంలో అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే అభ్యర్థి పేరును ప్రకటించే అవకాశం ఉంది.

# 19 ఏళ్లకు వెదుక్కుంటూ వచ్చిన అదృష్టం..

## వేలమందికి విందు..

**ఛండీగఢ్,జనంసాక్షి:**హర్యానా ఇటీవలి సంవత్సరాలలో గణనీయమైన పురోగతి ఉన్నప్పటికీ, లింగ నిష్పత్తితో చాలా వెనుకబడి ఉన్న రాష్ట్రం. ఈ ప్రాంతంలో లింగ నిష్పత్తి చాలా కాలంగా సామాజిక సవాలుగా ఉందిబీ 2024లో 1,000 మంది పురుషులకు 910 మంది మహిళలు మాత్రమే ఉన్నారు.ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో 'బేటీ బచావో, బేటీ పఢావో' ప్రచారంతో సహా అనేక కార్యక్రమాల అమలుపై ఎక్కువ దృ?ష్టిపెట్టారు. అయితే ఇటీవల అక్కడ ఒక అరుదైన సంఘటన చోటు చేసుకుంది.హర్యానాలోని జింద్‌లోని తువా గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. రెండు దశాబ్దాల తర్వాత ఆడబిడ్డ పుట్టడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.చుట్టుపక్కల 21 గ్రామాల నుండి 8 వేల మందితో గొప్ప విందును ఏర్పాటు చేశారు.సురేంద్ర , కృష్ణ దంపతులకు పెళ్లైన 19 ఏళ్లకు ఆడబిడ్డకు జన్మనించారు. పాపాయి భూమి దేవి అని పేరు పెట్టుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత తమ ఇంట్లో పాపాయి పారాడటంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.ఇక తమకు పిల్లలు పుట్టరని భావించి, భర్త మేనల్లుడిని దత్తత తీసుకున్నారు. ఆ వేళా విశేషమో ఏమో కానీ కానీ జూలైలో, ఎలాంటి వైద్య చికిత్స తీసుకోకుండానే అద్భుతం జరిగింది. సాధారణంగా అబ్బాయి పుట్టినపుడు నిర్వహించే బావిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, బంధువులు, చుట్టు పక్కల 8 వేలమందికి విందును ఏర్పాటు చేశారు. తువా, తపా ఖాప్‌లతో సహా 25 ఖాప్‌ల నుండి సర్పంచ్‌లు నవజాత శిశువును ఆశీర్వదించడం విశేషం. హర్యానా గ్రామీణ ప్రాంతంలో ఆలోచనలను మార్చే దిశగా ఒక అడుగుగా ఈ కార్యక్రమాన్ని చాలా మంది ప్రశంసించారు. "మా కుమార్తె ఒక వరం, కొడుకు పొందే ప్రతి గౌరవానికి ఆమె అర్హురాలు ఈ సందేశాన్ని చాటాలనుకున్నాం అందుకే ఈ విందు" అని తండ్రి సంతోషంగా చెప్పారు. మా సొంత బిడ్డ పుట్టడం మా జీవితాల్లో వర్ణించలేని ఆనందం.. అలాగని దత్తత కొడుకు మీద ప్రేమ ఏ మాత్రం తగ్గదు అంటూ తల్లి చెప్పింది.





## నలుగురు కాపరులు, 656 గొర్రెలు

# వరదలో సురక్షితం

### కామారెడ్డి రెస్క్యూ ఆపరేషన్ విజయం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (జనం సాక్షి) :** నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.వరదలో చిక్కుకున్న నలుగురు గొర్రెల కాపరుల మరియు 656 గొర్రెలు సురక్షితం రెస్కు ఆపరేషన్‌లో పాల్గొన్న అందరినీ జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత వలన లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తలు తీసుకో వాలి. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయబడటంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. ఈ నేపథ్యంలో బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని శెట్లూర్ గ్రామ పరిసరాల్లో గొర్రెలను మేపడానికి వెళ్లిన నలుగురు గొర్రెల కాపరులు మరియు సుమారు 656 గొర్రెలు చుట్టూ వరద నీరు ఉండడంతో ఎటు వెళ్లలేక చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే రెవెన్యూ, పోలీస్ శాఖలు మరియు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రక్షణ చర్యలు ప్రారంభించాయి. ముందుగా గొర్రెల కాపరులను ఎత్తైన ప్రదేశాలకు పంపించి, అనంతరం బోటు సహాయంతో వారిని సురక్షితంగా రక్షించినారు, అదేవిధంగా 656 గొర్రెలను సురక్షితంగా కాపాడారు.ఈ రక్షణ చర్యలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. బాన్సువాడ సబ్ కలెక్టర్, బాన్సువాడ డిఎస్పి విట్టల్ రెడ్డి కూడా అక్కడే ఉండి రక్షణ చర్యలను పర్యవేక్షించారు.జిల్లాలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశా రు. ముఖ్యంగా నిజాంసాగర్, కౌలాస్, కళ్యాణి ప్రాజెక్టుల పరిసర ప్రాంతా లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదని సూచించారు. చేపల వేటకు గానీ, చెరువులు చూడటానికి గానీ, లోతట్టు ప్రాంతాలకు గానీ వెళ్లడం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేశారు. రహదారులపై గాని, గ్రామాల్లో గాని ఏ సమస్య తలెత్తినా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని, అవసరమైన అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పోలీసులు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ రెస్కు ఆపరేషన్ లో పాల్గొన్న అందరినీ జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల వల్ల ఏ ఆపద వచ్చిన లోకల్ పోలీస్ అధికారులకు లేదా డయల్-100 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్లు 08468-220069, 8712686133,కు సమాచా రం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేస్తున్నారు.

## సర్వాయి పాపన్నగౌడ్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

### నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 18 (జనం సాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ ఎంతో ప్రశంసనీయమైనదని కొనియాడారు. దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా సమర శంఖం పూరించిన ధీశాలి సర్వాయి పాపన్న మహరాజ్ అని గుర్తు చేశారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం న్యూ అంబేడ్కర్ భవన్ లో నిర్వహించిన వేడుకల్లో వక్తలు మాట్లాడుతూ, రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న ఆ రోజుల్లో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఓ సాధారణ వ్యక్తి కుల వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ అసామాన ధైర్య సాహసాలతో పోరాటం చేయడం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని సర్వాయి పాపన్న తెగువను కొనియాడారు. నాటి మొఘల్ రాజుల దౌర్జన్యాలను ఎండగడుతూ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నుల వ్యవస్థ లేని గొప్ప పరిపాలనను పాపన్న గౌడ్ అందించారని కొనియాడారు. గోల్కొండ కోటను సైతం పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపురం రైల్వే బ్రిడ్జిపై కదలిక

### ఎంపీ వద్దిరాజు లేఖకు రైల్వే మంత్రి స్పందన



**చింతకాని, ఆగస్టు 19 (జనంసాక్షి) :** చింతకాని మండలం రామకృష్ణాపురం 107 రైలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణంపై కదలిక వచ్చింది. ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలన లో ఉందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్.. రాజ్య సభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు తెలిపారు. ఈ మేరకు ఎంపీ రవిచంద్ర ఆగస్టు 7వ తేదీన రైల్వే మంత్రికి రాసిన లేఖలో.. రామకృష్ణాపురం గ్రామ సమీపంలోని 107 లెవల్ క్రాసింగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరు తూ విజ్ఞప్తి చేశారు. తరచూ గేటు మూసి ఉంచ డం వల్ల గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్.. ఎంపీ రవిచంద్ర కు తిరిగి లేఖ రాశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం 107 లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ నిర్మాణం కోరుతూ చేసిన వినతిపై సాధ్యాసాధ్యలను సంబంధించి సమగ్ర నివేదిక కోరుతూ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశించడం జరిగిందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆ లేఖలో బదులిచ్చారు. దీంతో రామకృష్ణా పురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణం దిశగా కృషి చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి



- శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- చింతాకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదునపు తరగతి గదులను ప్రారంభించిన విప్

**కథలాపూర్,ఆగస్టు 18 (జనం సాక్షి) :** ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.సోమవారం కథలాపూర్ మండలం భూషణ రావుపేట గ్రామంలో ఎక్కడ అర్హులైన 41 మంది లబ్ధదారులకు 15 లక్షల 76 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనంతరం చింతకుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 లక్షల తో నిర్మించిన అదున్నపు తరగతి గదులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందన్నారు.. వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసిల ద్వారా ఇప్పటి వరకు 22 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంలో పెను మార్పులు తీసుకు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి మేలు జరిగేలా కార్యక్ర మలు చేపడుతున్నారని అన్నారు. చింతకుంట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణనికి భూమి పూజ చేశారు.



## సాలూరు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

**బోధన్, ఆగస్టు 18 (జనంసాక్షి) :** సాలుర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తనిఖీ చేశారు. ఈ మేరకు ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీయడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. మండల పరిధిలోని గ్రామాల్లో మెరుగైన వైద్యాన్ని అందచేందుకు వైద్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిదారించాలని, ప్రస్తుత వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి రోగాలు దరిచేరకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





## హైడ్రా కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి

**హైదరాబాద్, ఆగస్టు 18 (జనం సాక్షి) :** శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375 వ జయంతిని హైడ్రా ఘనంగా నిర్వహించింది. హైడ్రా కార్యాలయంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, హైడ్రా ఎస్పీలు అశోక్, సుదర్శన్, హైడ్రా అదనపు సంచాలకులు పాపయ్యతో పాటు ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి





### కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) :** సామాజిక సమానత్వానికి కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి కలెక్టర్ పమేలా సత్పతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సర్దార్ సర్వాయి పాపన్న కుల వ్యవస్థ, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని, సామాజిక సమానత్వం కోసం కృషి చేశారని అన్నారు. ఆయన విషయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... పాపన్న ఆనాటి మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే కాకుండా ప్రజలలో పోరాట పటిమ పై దశ, దిశ, నిర్దేశం చేశారని అన్నారు. సర్వాయి పాపన్న అట్టడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కృషి చేశారని, కోటలు కట్టించారని, సాగునీటి మీద పోరాటం చేశారని తెలిపారు. అనంతరం అల్గునూర్ వంతెన వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, సర్వాయి పాపన్న గీతాకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరశు రాములు గౌడ్, జిల్లా బిసి సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్ , గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ళ శ్రీనివాస్ గౌడ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల స్వామి గౌడ్, పట్టణ అధ్యక్షులు దూలం అంజయ్య, రాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్, బుర్ర ముత్తయ్యా గౌడ్, తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్, మార్క రాజు గౌడ్, పురుషోత్తం ,ఆశిష్ గౌడ్, సాగర్ గౌడ్, అనిల్ గౌడ్ గనగోని సత్యం, బండారి గాయిత్రి, శరణ్య, ఉయ్యాల శ్రీనివాస్ , బైరీ రాజు గౌడ్, బిసి సంఘం నాయకులు శ్రీధర్, నేరుమట్ల మల్లేశం పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా..

### టిపిసీసీ రాష్ట్ర లీగల్ సెల్ ఛైర్మెన్ పొన్నం అశోక్ గౌడ్




**కామారెడ్డి జిల్లా ప్రసిద్ధి ఆగస్టు 18 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లాకేంద్రం లో స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి లీగల్ సెల్ మీటింగ్ కి టిపిసీసీ రాష్ట్ర లీగల్ సెల్ ఛైర్మెన్ పొన్నం అశోక్ గౌడ్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవాదుల కు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అయన అన్నారు.న్యాయవాదుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విదంగా ప్రయత్నిస్తానని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి లీగల్ సెల్ చైర్మన్ దేవరాజ్ గౌడ్,మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను టిపిసిసి రాష్ట్ర లీగల్ సెల్ ఛైర్మెన్ పొన్నం అశోక్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదులకు ఇండ్ల స్థలాల కేటాయించాలని, జ్యూడిషల్ కమిటీ ఏర్పాటు చేయాలనీ, న్యాయవాదుల మెడిక్లయిమ్ 2లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని, 41-A సిఆర్‌పిసిని వెంటనే రద్దు చేయాలనీ, కామారెడ్డి జిల్లా లో శాశ్వత కోర్ట్ బిల్డింగ్‌ని అతిత్వరలో 50 కోట్లతో నూతన భవనము నిర్మించాలని, వెంటనే పై సమస్యలు ప్రభుత్వానికి తెలిపి న్యాయవాదుల సమస్యలు తీర్చాలని, ఆయనకి తెలిపారు. ఈ పై సమస్యల పై స్పందించిన పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ వెంటనే పై సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.. అదేవిదంగా కామారెడ్డి జిల్లా న్యాయవాదులను ముఖ్యమంత్రిని కలిపించే విదంగా, వారి సమస్యలు ను విన్నవించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కామారెడ్డి న్యాయవాదు లకు కలిపిస్థానానికి అయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్ రావు,స్టేట్ లీగల్ సెల్ సోషల్ మీడియా ఇంచార్జి ముబిన్, పీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ ఉమాశంకర్ వెంకటేశ్వర్ రెడ్డి, అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద రమేష్, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, శ్యాం గోపాల్ రావు, నర్సింహారెడ్డి, సిద్దారాములు, జడల రజనీకాంత్, గ్రంథాలయం సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్ లీగల్ సెల్ అధ్యక్షులు, నాలుగు జిల్లల న్యాయవాదులు, కామారెడ్డి జిల్లా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతన్నల పాట్లు



**షాబాద్, ఆగస్టు 18 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఐతాబాద్ కోపరేటివ్ సొసైటీలో యూరియా కోసం రైతన్నల పాట్లు. సోమవారం సొసైటీ కార్యాలయంలో ఆన్లైన్ సైట్ మొరాయించడంతో యూరియా కోసం రైతులు పడిగపుల పడ్డారు. సకాలంలో యూరియా అందకపోవటంతో పంట నష్టపోతున్నామని వాపో యారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సమస్యలను పునరావతం కాకుండా తగు చర్యలు తీసుకోగలరని కోరారు.




## తక్షణం నూలు సబ్సిడీ చెల్లించాలి

### సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) :** మరమగ్గాల కార్మికులకు సంబంధించి రావలసిన నూలు సబ్సిడీ డబ్బులను తక్షణం విడుదల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమలు కార్మికులు రావలసిన నూలు సబ్సిడీ, త్రిప్ట్ పథకానికి సంబంధించిన డబ్బులను తక్షణం విడుదల చేయాలని కోరుతూ ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందజేశారు కార్యక్రమంలో కోడం రమణ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ... భవితకు నిచ్చైన


- కెసి క్యాంప్‌లో బిఎన్‌రావు ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం
- హాజరైన ట్రస్టు వ్యవస్థాపకులు డా. బిఎన్‌రావు, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ శ్రీనివాస రావు



**కరీంనగర్ జిల్లా బ్యూరో /హుజురాబాద్, (జనంసాక్షి) :** మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిఎన్‌రావు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బిఎన్‌రావు అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి కేసీ క్యాంపు లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ కేంద్రంలో బిఎన్‌రావు హెల్త్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిఎన్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిథిలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం గ్రంథాలయంలో పుస్తకాలను అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నాక్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, శిక్షకురాలు సబిత, మహిళలు పాల్గొన్నారు

## హెూంగార్డ్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఎస్పీ మహేష్ బి. గీతే
- హెూంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి) :** హెూంగార్డుగా విధులు నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న శివకుమార్ కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ మహేష్ గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెూంగార్డ్ శివకుమార్ కుటుంబానికి 55 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ శివకుమార్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ ఐ యాదగిరి, రమేష్ శివకుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డుకు కబ్జాదారుల నుండి విముక్తి కల్గించాలి

**మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్, కాలనీ వాసుల డిమాండ్**




**శామీర్ పేట్ ( జనంసాక్షి) :** తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోనిరెడ్డి కాలనీ లో వెంచర్ చేసి 133 ప్లాట్లు చేసి అమ్ముకొని తిరిగి రోడ్డును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తుంకుంట మాజీ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి, మాజీ సర్పంచ్ నాగేష్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం రెడ్డి కాలనీ వాసులతో కలిసి ఎద్దు లక్ష్మి, నాగేష్ యాదవ్‌లు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెల్పి టిపిఓ శ్రీధర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తూముకుంట మున్సిపాలిటీ పరిధిలో సర్వేనెంబర్ 286, 322 లో వెంచర్ చేసి 133 ప్లాట్లు అమ్మి ఇప్పుడు ప్రస్తుతం 30 కుటుంబాలు ఇల్లు కట్టుకొని నివసిస్తున్నారు. వెంచర్ లో ఉన్న రోడ్డును సుమారు మూడు నెలలు నుండి సత్తిరెడ్డి, వెంకట్ రెడ్డి, అనే వ్యక్తులు రోడ్డును మూసివేసి ఈ స్థలం నాది అని అక్కడ నివసిస్తున్న వారిని రాకపోకలు లేకుండా రోడ్డును మూసివేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాలనీవాసులు తూము కుంట మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా నిరసన కార్యక్రమం చేపట్టి తూముకుంట టిపిఓకు కలిసి వారి సమస్యను గత రెండు నెలలుగా చెబుతు న్న పట్టించుకోవడంలేదని ఇకనైనా మా సమస్యకు పరిష్కారం చూపే విధంగా చూడాలని కోరారు.వారికీ మద్దతుగా మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి లు సమస్య పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్డి కాలనీ అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

- చేవెళ్ల మాజీ శాసనసభ్యులు కెఎస్ రత్నం
- 375వ జయంతి ఉత్సవాలు



**మొయినాబాద్ ఆగస్టు 18, (జనంసాక్షి) :** పేద, బడుగు బలహీన వర్గాలకు చెందినవారికి సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. సోమవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ శాసనసభ్యులు కేఎస్ రత్నం మాట్లాడుతూ. ..బడుగులను ఐక్యం చేసుకొని ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని గోల్కొండ కోటను జయించిన సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శమని అన్నారు. బడుగు బలహీనవర్గాల ఐక్యత, సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్వెల్లి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్ గౌడ్, చేవెళ్ల ఓబిసి కన్వీనర్ ఎల్గాని వెంకటేష్ గౌడ్, మండల బిజెపి అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు మాదాపురం శ్రీకాంత్, ఉపాధ్యక్షులు షాబాద్ కిషన్, జేల్లెల రవి యాదవ్, వీరేష్, రవీందర్ యాదవ్, మహేష్, విక్రమ్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీక్ ఘటనలో మరొకరు మృతి

**12 రోజుల్లో ఒకే ఇంట్లో ముగ్గురు మృతి**

**ఝరాసంగం, ఆగస్టు18(జనం సాక్షి):** మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలో ఈనెల 6న ఇంట్లో గ్యాస్ లీక్ కావడంతో ముగ్గురు తీవ్ర గాయాలకు గురయ్యారు. తల్లి గొర్రె కంటి శంకరమ్మ (65) ను గ్యాస్ లీకేజీ నుంచి కాపాడేందుకు ఇద్దరు కుమారులు వెళ్లగా వారికి కూడా తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే.మొదట తల్లి శంకరమ్మను చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు ఈమె చికిత్స పొందుతూ 8 వ తేదీన ఉదయం మృతి చెందింది. రెండో కుమారుడు ప్రభు (38) పటాన్ రువులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 15వ తేదీన మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటనను మరువకముందే మూడవ కుమారుడు విట్టల్ (30)సోమవారం ఉదయం మృతి చెందాడు. సంఘటన జరిగిన 12 రోజుల్లోనే ఒకే కుటుంబంలో తల్లి ఇద్దరు కుమారులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ముగ్గురికి కూడా తండ్రి బక్కన్న అంతిమ సంస్కారాలు చేశారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి






- సీజనల్ వ్యాధుల నివారణ, సింగూర్ డ్యాం మరమ్మత్తులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 18( జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్లు, సింగూరు ప్రాజెక్టు నుండి సాగునీటి సరఫరా, ప్రాజెక్టు భద్రత, వరద ఉధృతి, ఎరువుల సరఫరా, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై చర్చించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా వైద్య, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి శుక్రవారం గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. 632 గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, బాధితులకు తక్షణ వైద్య సాయం అందేలా మందులు, డాక్టర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. సింగూరు డ్యాం మరమ్మత్తులపై ఎన్‌డిఎస్‌ఏ నివేదిక ఆధారంగా ఉన్నత స్థాయి కమిటీ నియమించాలని, మరమ్మత్తుల సమయంలో నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని, ఈఎన్‌సి స్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి డిపిఆర్ సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. గత పదేళ్లుగా సింగూరు డ్యాం మరమ్మత్తుల్లో నిర్లక్ష్యం జరిగిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, శాశ్వత మరమ్మత్తులకు ప్రభుత్వం ఎంత ఖర్చైనా సిద్ధంగా ఉందని, అత్యున్నత సాంకేతికతతో డ్యాం పరిరక్షణకు డిపిఆర్‌లు సిద్ధం చేయాలని తెలిపారు. సింగూరు కాలువల లైనింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, పెద్దారెడ్డిపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సర్వే పనులు వేగవంతం చేసి డిపిఆర్ సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో సిపిఓ బాలశౌరి, జిఎం-డిఐసి తుల్జా నాయక్, డీఈవో వెంకటేశ్వర్లు, డిఐఈవో గోవింద్ రామ్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, టిజిఈడబ్ల్యూఐడిసి, టిజిఎంఐడిసి అధికారులు, జిల్లా వైద్యాధికారి నాగ నిర్మల, మిషన్ భగీరథ ఎస్ఈ, ఈఈ-ఇరిగేషన్ తదితరులు హాజరయ్యారు.

## గొప్ప బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న

**పిఎసి చైర్మన్ అరికెపూడి**



**శేరిలింగంపల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి) :** వందల సంవత్సరాలు భారతదేశాన్ని అన్నీ తామై పరిపాలించడంతోపాటు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను సర్వ నాశనం చేసిన మొగల్ చక్రవర్తుల పాలిట అసలు సిసలైన యముడై వారిని ఓడించి అన్ని వర్గాల ప్రజలను ప్రజారాజకంగా పాలించిన బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అభివర్ణించారు. ఈ మేరకు పాపన్న గౌడ్ 375 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ చౌరస్తాలో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన పూలమాలను సమర్పించే ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ ఉప్పలపాటి, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులతో కలిసి అరికెపూడి మాట్లాడుతూ... అలనాటి మొగలుల పాలనలో హిందువులపై దాడి, అరాచకాలు, సాంఘిక దురాచారాలు, బహుజనులపై చిన్న చూపును క్షుణ్ణంగా పరిశీలించి తట్టుకోలేక బడుగులు, బహుజన వర్గాలలోని సామాన్యులనే మెరుకలు తిరిగిన సైనికులుగా తయారుచేసి, కాకి వంటి పశుపక్షాదులను సైతం తన గొప్ప శిక్షణతో వేగులుగా మార్చుకొని భారతదేశంలోనే పేరెన్నిక గలిగిన మొగల్ చక్రవర్తులపై యుద్ధాన్ని ప్రకటించి అందులో విజయం సాధించడం ద్వారా గోల్కొండ రాజ్యానికి చక్రవర్తిగా పరిపాలనను అందించడంతోపాటు బహుజనులకు ప్రముఖ స్థానాన్ని అందించి కుల మతాల హెచ్చుతగ్గులకు చరమగీతం పాడిన గొప్ప అభ్యుదయ చక్రవర్తిగా ఆయనను అభివర్ణించారు. సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఎందరికో శిరోధర్యమని, రాజకీయ సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండ ను ఏలిన గొప్ప చక్రవర్తిగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంతి లక్ష్మీ నారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ గౌడ్, యూత్ కమిటీ అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్, నాయకులు కరుణాకర్ గౌడ్, ఓం ప్రకాష్ గౌడ్, నాగేశ్వర్ గౌడ్, సురేష్ గౌడ్, రాములు గౌడ్, యాదగిరి గౌడ్, దాత్రినాథ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, అనిల్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్ ఎమ్మెల్యే నిరవధిక నిరాహార దీక్ష

**జీఓ 49 రద్దు, పోడు రైతుల సమస్య పరిష్కారం**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 18 ( జనంసాక్షి) :** ఫారెస్ట్ కన్జర్వేషన్ రిజర్వ్ జీవో నంబర్ 49 రద్దు, పోడు రైతుల సమస్య పరిష్కారం కోసం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. సోమవారం ఎమ్మెల్యే తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. సోమవారం నాడు కాగజ్ నగర్ డివిజన్ అటవీశాఖ ముట్టడికి ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. కానీ పోలీసులు ముట్టడిని అడ్డుకొని, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఎక్కడికి అక్కడే అరెస్టు చేసి ముట్టడిని విఫలం చేశారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు నాయకులు, కార్యకర్తలు చర్చించి, నిరవధిక నిరాహార దీక్ష చేస్తేనే ప్రభుత్వ నుంచి స్పందన వస్తుందని భావించి దీక్షకు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ చింతలమానే పెల్లి మండలం దింద గ్రామానికి చెందిన రైతులు రాష్ట్ర రాజధాని హైదరాబాద్కు వెళ్లి ప్రభుత్వానికి తమ ఇబ్బందులను తెలుపుతామని పాదయాత్రగా వేల్లగా ప్రభుత్వం పోలీసులచే అరెస్టు చేయించి, తిరిగి దింధా గ్రామానికి బలవంతంగా పంపించారని అన్నారు. సోమవారం దిమ్మ గ్రామానికి చెందిన రైతులను అటవి శాఖ పిలిపించుకొని బెదిరింపులకు గురి చేశారని అన్నారు. ఆందోళన, నిరసనలు చేపడితే ఉన్న భూములు సైతం తీసుకుంటామని బెదిరించాలని ఎమ్మెల్యే హరీష్ బాబు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు కావాలనే రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ.. ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. జీవో నెంబర్ 49 అమలు అయితే జిల్లాలో గిరిజన, గిరిజన ఇతరుల ప్రజల ఉనికే కోల్పోతారని అన్నారు. మారుమూల గిరిజన అటవీ గ్రామాలకు రోడ్లు వేయడానికి అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. అదే మంత్రి సీతక్క నియోజకవర్గమైన ములుగు జిల్లాలో రోడ్లు వేయడానికి అభ్యంతరాలు లేవని తెలిపారు. ప్రభుత్వం ఈ విధంగా వ్యత్యాసాలు చూపడం సరికాదని అన్నారు. ఎమ్మెల్యే దీక్షకు సంఘీభావం తెలిపిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, నాయకులు కొప్పుల శంకర్, సిద్ధం శ్రీనివాస్, గోళం వెంకటేశం తదితరులున్నారు.



## పౌర హక్కుల సంఘం మహేష్‌పై హత్యాయత్నం

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 18 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూర్ గ్రామంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్‌పై హత్యాయత్నం చేసిన నీలి బీసన్నపై చట్టరీత్యా చర్య తీసుకొని వారిని కఠినంగా శిక్షించాలని వివిధ ప్రజా, దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఎల్కూర్ గ్రామంలో నీలి బిసన్న అక్కడే మాట్లాడుతున్న మహేష్‌పై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేయడంతో స్పృహ కోల్పోవడం జరిగిందని అక్కడున్నవారు వెంటనే స్పందించి గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చినట్లు దళిత, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. హత్యాయత్నం చేసినవారిపై హత్య నేరంతో పాటు, ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత,ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్, హనుమంతు,దళిత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఆర్. మోహన్, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్ తదితరులు ఖండించారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి





**నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్గొండ బ్యూరో (జనంసాక్షి) :** పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పారిశుధ్యంపై మండలాల ప్రత్యేక అధికారులు దృష్టి కేంద్రీకరించాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యా దులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో పలు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ప్రజలు కుక్క కాటుకు గురవుతున్నారని, అందువలన ప్రజలు కుక్కల నుండి జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి వహించాలని సూచించారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రత్యేకించి అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో టాయిలెట్లు, పారిశుధ్యంపై ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. రానున్న 15 రోజులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎవ్వరూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 69 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 32, రెవెన్యూ శాఖకు 37 ఫిర్యాదులు వచ్చాయి. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రామోత్సవ్ క్రీడలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ కె. సీతారామారావు, ఇన్చార్జి డీఆర్ఓ వై. అశోక్ రెడ్డి, ఆర్డీఓ లు రమణారెడ్డి, శ్రీదేవి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.





# యూరియా.. ఏదయా?

## రైతులకు యూరియా అందించండి

- గూడూరు బస్టాండ్ సెంటర్లో ధర్నా చేసిన రైతులు

**గూడూరు/ పాలకుర్తి, ఆగస్టు18(జనంసాక్షి):** రైతులకు సరిపోయేంత యూరియాను సప్లై చేయాలని గూడూరు మండల రైతులు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బస్టాండ్ సెంటర్లో భారీ ఎత్తున ధర్నా చేపట్టారు. సోమవారం గూడూరు సొసైటీ దగ్గర తెల్లవారుజామునుండే భారీ ఎత్తున రైతులు క్యూ లైన్ ఏర్పాటు చేయగా యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు రావడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.అయితే తగినంత యూరియాను సప్లై లేదని రైతులు గూడూరు బస్టాండ్ సెంటర్లో ధర్నా చేపట్టగా విషయం తెలుసుకున్న గూడూరు వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్, గూడూరు సిఐ సూర్యప్రకాష్,ఎస్సై గిరిధర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని రైతులను వారించే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా ఏవో అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియాను సప్లై చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అయితే ఇప్పటికే గూడూరు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మరియు ఆగ్రో సెంటర్ అదేవిధంగా ప్రైవేట్ షాపులకు మొత్తం 1100 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందని రైతులకు సరిపడా యూరియా తెప్పించడం కోసం అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని ఇదే విషయాన్ని రైతులు అర్థం చేసుకోవాలని సూచించారు అదేవిధంగా యూరియా వాడకాన్ని రైతులు తగ్గించి నానో యూనియన్ వాడుకోవాలని,నానో యూరియా కూడా బాగానే పనిచేస్తుందని,వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు. గూడూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 360 మంది రైతులకు బస్తాల నిమిత్తం చీట్టిలు ఇవ్వగా త్వరలో యూరియా రాగానే రైతులకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు,ఈ సందర్భంగా రైతులు ధర్నా చేపట్టగా సిఐ, ఎస్ఐలు రైతులతో మాట్లాడి శాంతింప చేసేందుకు కృషి చేయడం జరిగింది. రైతులు రోడ్డు మీద ధర్నా చేయగా కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**యూరియా కోసం తిప్పలు..**

యూరియా కోసం రైతులు తిప్పలు తప్పడంలేదు.. సోమవారం మండల కేంద్రంలోని ఎఫ్ఎస్సీఎస్ ఎదుట యూరియా కోసం రైతులు బారులు తీరారు. పరిమితంగా యూరియా ఇవ్వడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 1100 యూరియా బస్తాలు మాత్రమే రావడంతో వెయ్యి మందికి పైగా రైతులు సహకార సంఘానికి చేరుకున్నారు. క్యూలైన్లో గంటల తరబడి వేచి ఉన్న కొందరికే యూరియా బస్తాలు అందడంతో మరికొందరు రైతులకు బస్తాలు దొరకక నిరాశతో వెనుదిరిగారు. ఎకరానికి నాలుగు యూరియా బస్తాలు ఇవ్వాల్సి ఉండగా. ఎంత భూమి ఉన్న రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోయారు. ఇప్పటి వరకు 10 వేల బస్తాలను రైతులకు పంపిణీ చేసినట్లు ఎఫ్ఎస్ సీస్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. యూరియా కొరత లేదని ఇంకా లారీ లోడు తెల్లారేసరికి తెప్పిస్తున్నట్లు తెలిపారు.

## శ్రీశైలం కృష్ణానది 10 గేట్లు ఎత్తివేత

**కొనసాగుతున్న వరద ఉధృతి**



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాల వల్ల శైలం జలాశయం వద్ద కృష్ణమ్మ పరవళ్ళు తొక్కి ప్రవహిస్తుంది. భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. అటు జూరాల, ఇటు తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయం నిండుతోంది. దీంతో అధికారులు 10 గేట్లను పైకి ఎత్తి నాగార్జునసాగర్ కు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 881 అడుగులకు చేరింది. ఉదృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ పాలకడలిని తలపిస్తోంది.



## భద్రాద్రిలో మొదటి ప్రమాద స్థాయిలో గోదావరి

**38 అడుగుల నీటిమట్టం**

**భద్రాచలం ఆగస్టు 18 (జనంసాక్షి) :** భద్రాచలంలో గోదావరి నది ప్రవాహం సోమవారం సాయంత్రం 6 గంటలకు 38 అడుగులకు చేరి మొదటి ప్రమాద స్థాయి చేరుకునే అవకాశం ఉంది. గోదావరి పరివాహక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు తో పాటు వాగులు వంకలు పొంగి ప్రవహించడం వల్ల గోదావరి నీటిమట్టం గణనీయంగా పెరుగుతున్నది. ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు 33 అడుగులు చేరుకున్న గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 38 అడుగులు చేరుకొని ఇంకా పెరుగుతూనే ఉన్నది. ఇదేవిధంగా మంగళవారం వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇదే విధంగా పెరుగుతూ మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. గోదావరి నీటిమట్టం పెరుగుతూ ఉండటంతో స్నాన ఘట్టాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. అంతేకాకుండా పర్ణశాల సమీపంలోని సీతవాగు సైతం పొంగి ప్రవేశించడం వల్ల శ్రీ సీతా రామచంద్రులు సంచరించిన నారచీరల ప్రాంతం పూర్తిగా నీట మునిగింది. అలాగే భద్రాచలం డివిజన్‌లోని తాలి పేరు ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద 38 అడుగులకు నీటిమట్టం పెరుకోగానే 7, 19, 875 క్యూసెక్కుల నీరు క్రిందకి ప్రవహిస్తున్నది.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19 ఆగస్టు 2025

# హుజూర్‌నగర్‌ను సస్యాశ్యామలం చేస్తాం

- ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తాం
- తెలంగాణ భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హుజూర్ నగర్ నీటిపారుదల శాఖ సమీకృత డివిజన్ కార్యలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- ప్రాంతీయ ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





**హుజూర్ నగర్, ఆగస్టు 18 (జనంసాక్షి):** నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి సాగు నీరు అందించి సస్యాశ్యామలం చేస్తానని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హుజూర్ నగర్ పట్టణంలో 7.99 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హుజూర్ నగర్ నీటిపారుదల శాఖ సమీకృత డివిజన్ కార్యాలయ-3 భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదల డివిజన్ పునర్వ్యవస్థీకరణ సమయంలో నీటిపారుదల డివిజన్ నెం. 3 పరిధిలో ఉన్న ఇరిగేషన్ సబ్ డివిజన్ నం. 2, 3, 4 సబ్ డివిజన్‌కార్యాలయాలు కలిపి హుజూర్ నగర్ ప్రధాన కార్యాలయంగా ఏర్పడ్డాయని, పైన పేర్కొన్న సబ్ డివిజన్ ల కార్యాలయంతోపాటు, డివిజన్ కార్యాలయం జనవరి-2021 నుండి అద్దె ప్రాతిపదికన ప్రైవేట్ భవనాల్లో పనిచేస్తున్నాయని తెలిపారు. నీటిపారుదల సర్కిల్, కోదాడ నియోజక వర్గ పరిధిలోని 2,29,961 ఎకరాలు, హుజూర్ నగర్ నియోజకవర్గంలోని 1,50,181 ఎకరాల ఆయకట్టుతో కూడిన నాగార్జున సాగర్ గ్రావిటీ కాలువలు, ఎత్తి పోతల (ఎల్ఐ) పథకాల నీటిపారుదల సౌకర్యాలను ఈ కార్యాలయం చూసుకుంటుందని, కోదాడ సర్కిల్ పరిధిలోని 258 ఎంఐ ట్యాంకులలో 149 ఎంఐ ట్యాంకులను కూడా చూసుకుంటుందని తెలిపారు. పాలకీడు మండలం గుండెబోయిన గూడెంలో కృష్ణ నదిపై జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గుండెబోయినగూడెం, జానపాడు, అలింగాపురం, బొత్తలపాలెం, కోమటికుంట, గుండ్లపహాడ్, మీగడం పాడు తండా, చెరువు తండా, రాఘవాపురం, యల్లాపురం, సజ్జపురం, పాలకీడు నాగిరెడ్డిగూడెం పరిధిలో, 10,000 ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. పాలకీడు మండలంలో బెట్టే తండా గ్రామం వద్ద బెట్టేతండా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 33.83 కోట్లతో బెట్టే తండా, పాడే తండా, సజ్జపురం గ్రామాల పరిధిలోని 2041ఎకరాలకు సాగు నీరు అందిస్తామని, 10.23 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మిస్తున్నామని అన్నారు. చింతలపాలెం మండలం నక్కగూడెం వద్ద నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించటం ద్వారా 37.70 కోట్లతో కిష్టాపురం, చింత్రియాల, నక్కగూడెం పరిధిలో 3200 ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. చింతలపాలెం మండలం బుగ్గమాధారం వద్ద పులిచింతల ప్రాజెక్టులో విద్యుత్ తయారు చేసి వృధాగా సముద్రంలో కలిసే నీరు ద్వారా చింతలపాలెం, మేళ్లచెర్వు, కోదాడ, చిలుకూరు, హుజూర్ నగర్ మండలాల పరిధిలోని గ్రామాలలో 14,100 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు 394.10 కోట్లతో రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ఈ నాగభూషణ్ రావు, ఈఈ రామ కిషోర్, సత్యనారాయణ, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే హుజూర్ నగర్ ప్రాంతీయ ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మూడు కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఓపి బ్లాక్ నూతన విభాగం, ధోబిఘాట్, పార్కింగ్ షెడ్లకు శంకుస్థాపన చేశారు. కోటి 25 లక్షల రూపాయల వ్యయంతో ఆస్పత్రిలో నిర్మించిన డయాలసిస్ రక్త నిధి కేంద్రాలను ప్రారంభించారు. అంతేకాక మూడు కోట్ల రూపాయల వ్యయంతో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ మిషన్ ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, డి సి హెచ్ ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఎంహెచ్ ఓ జయ మనోహరి, ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ప్రవీణ్ , గైనకాలజిస్ట్ వనజ, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యాబోధనకు

# ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను వినియోగించుకోవాలని మంత్రి సీతక్క ఆదేశాలు
- అంగన్‌వాడీల కోసం పైలట్‌గా 34 పాఠశాలలు గుర్తింపు
- ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేస్తున్నాం : మంత్రి సీతక్క



దేశానికి ఆదర్శంగా తెలంగాణ అంగన్‌వాడీలు : సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 18 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలతో అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ప్రస్తుతం అనేక అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే గదిలో నడుస్తున్నందున ప్రీ-ప్రైమరీ తరగతులు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా, జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 21 జిల్లాల్లో 61 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. అందులో 34 పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉన్నందున అక్కడికి అంగన్‌వాడీ కేంద్రాలను మార్చి, పూర్వ ప్రాథమిక విద్యా తరగతులను ప్రారంభించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అనుగుణంగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జీ.సృజన జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. పాఠశాలల ప్రస్తుత పరిస్థితులను తక్షణమే పరిశీలించి, అనువుగా ఉంటే జిల్లా విద్యా అధికారులతో సమన్వయం చేసి భవనాలను అంగన్‌వాడీ కేంద్రాల కోసం కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 1 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసి పూర్వ ప్రాథమిక విద్యా బోధనను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ప్లే స్కూల్లకు ఏమాత్రం తీసిపోకుండా అంగన్‌వాడీలు ఇప్పటికే పిల్లలకు నాణ్యమైన విద్య, సంరక్షణ అందిస్తున్నాయని గుర్తుచేశారు. "ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి, అంగన్‌వాడీల్లో ప్రీ-ప్రైమరీ సామర్థ్యాన్ని పెంపొందించి పిల్లలను ప్రాథమిక విద్యకు సిద్ధం చేస్తున్నాం. చిన్నారి జీవితంలో ప్రారంభ దశలో ఇచ్చే సరైన సంరక్షణ, విద్య వారికి జీవితాంతం సానుకూల ఫలితాలు ఇస్తాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీల ద్వారా అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాక, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను వినియోగించడం ద్వారా ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన ప్రారంభ విద్య అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.

# ఇదో చెత్త సర్కార్

## ప్రభుత్వంపై కెటిఆర్ ఆగ్రహం



**హైదరాబాద్, ఆగస్ట్18 (జనంసాక్షి) :** తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు పనితీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇదొక చెత్త సర్కారు..!. రాష్ట్ర మున్సిపల్ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్త కుప్పలతో హైదరాబాద్ నగరం, రాష్ట్రంలోని ఇతర పట్టణాలు కంపుకొడుతున్నాయి. ఈ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు- దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి.' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ హయాంలో వర్షాకాలానికి 2 నెలల ముందు నుంచే సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై మున్సిపల్ శాఖ, జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖలు సమీక్షా, సమన్వయ సమావేశాలు నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టేవి. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదు. ప్రజలు ఈసురోమని అలమటిస్తుంటే పాలకులు మాత్రం 'ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లలో బిజీగా ఉన్నారు..!' అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు.

# భారతీయ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్





- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- జాతీయ ఫిల్మ్ అవార్డు గ్రహీతలకు సన్మానం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్ ను నిలపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సినిమా రంగం ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతనందిస్తామని ఆయన తెలిపారు. 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఎంపికైన సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అవార్డు గ్రహీతలైన భగవంత్ కేసరి సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి, హను మాన్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, హను మాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్ కు సంబంధించి వెంకట్, శ్రీనివాస్, టీమ్ సభ్యులు, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, బేబి సినిమా డైరెక్టర్ సాయి రాజేశ్, సింగర్ రోహిత్ లను సన్మానించారు. కార్యక్రమంలో హను మాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా అతలాకుతలం

- సముద్రాన్ని తలపిస్తున్న జిల్లా కేంద్రం
- ఇళ్లలోకి నీరు చేరడంతో జనం యాతన



**ఆదిలాబాద్ ప్రతినిధి, ఆగస్ట్18 (జనంసాక్షి) :** భారీ వర్షలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అల్లకల్లోలం అయిపోయింది. ఎప్పుడూ లేని వాన.. ఎన్నడూ చూడని వరద.. జిల్లాను ముంచేసింది. రోడ్లపై నదులు ప్రవహిస్తున్నాయి. ఊర్లన్నీ చెరువుల్లా మారిపోయాయి. ఇళ్లలోకి వరద నీరు చేరుకుని ఇంట్లో ఫర్నీచర్, కూరగాయలు, బియ్యం, బట్టలూ.. ఇలా అన్నీ నీళ్ల పాలయ్యాయి. ఇంటా బయట మోకాలి ఎత్తు నీళ్లు చేరుకోవడంతో ఏం చేయాలో.. ఎటుపోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అదిలాబాద్ జిల్లా అతలాకుతలం అయ్యింది. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి సోమవారం జిల్లా కేంద్రం సముద్రాన్ని తలపిస్తోంది. పట్టణంలో కాలనీలన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని దోబి కాలనిలో ఇండ్లలోకి భారీగా చేరిన వరదనీరు చేరుకుంది. వరదనీటిలో ఫర్నిచర్, తిండి గింజలు అన్నీ మునిగి పోయాయి. దీంతో నిత్యావసర వస్తువులకు ఇబ్బందులు పడుతున్నారు ప్రజలు. ఆహార పదార్థాలు వరద నీటిలో కూరుకు పోవడంతో ఆకలికి అలమటి స్తున్నారు. అదుకోవాలని అధికారులను కోరుతు న్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు వాగులు, వంకలూ పొంగి పొర్లుతున్నాయి. ఉట్నూర్ మండల కేంద్రంలో ఎడతెరిప లేకుండా కురుస్తున్న వర్షాని శంభు మత్తడిగూడ ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తోంది. రాకపోకలన్నీ నిలిచిపోయాయి.



# లక్ష్మీ బారాజ్‌కు భారీగా వరద

**మహదేవపూర్, ఆగస్టు 18 (జనంసాక్షి):** మూడు రోజుల నుండి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కాళేశ్వరం ప్రాణహిత గోదావరి నిండుకుండలా ప్రవహిస్తుంది. మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీలో భారీగా వరద నీరు చేరడంతో 4,29,020 క్యూసెక్కుల నీరు గోదావరిలో చేరగా అదే నీరును మేడిగడ్డ లక్ష్మీబారేజ్ 85 గేట్లు ఎత్తి దిగువకు వదిలినట్లు ప్రాజెక్ట్ ఇంజనీర్లు వెల్లడించారు.

# ఉద్యోగాన్ని వదిలి.. కెమెరా పట్టి..

- ఫోటోగ్రఫీ శిక్షణ ఇస్తూ, ఫోటోగ్రఫీలో కొత్త టెక్నాలజీ పరిచయం చేస్తూ రాణింపు



**భూపాలపల్లి, ఆగస్టు 18 (జనం సాక్షి):** ఫోటోగ్రఫీ పై ఇష్టంతో ఉన్నత చదువులు చదివిన ఉన్నత ఉద్యోగం వచ్చిన మనసుకు నచ్చిన పనిచేస్తూ నలుగురికి ఉపయోగపడాలని ఉద్దేశంతో ముందుకు పోయిన ఒక వ్యక్తి మారుమూల ఆజంనగర్ గ్రామం భూపాలపల్లి జిల్లా నుంచి బయలుదేరిన యువకుడు కార్కూరి శ్రీనివాస్ తన కష్టపడి సాధించిన ప్రయాణంతో నేటి యువతకు ప్రేరణగా నిలుస్తున్నాడు. చదువు పూర్తికాకముందే కెమెరా పట్టుకొని ఫోటోగ్రఫీ రంగంలో అడుగుపెట్టిన శ్రీనివాస్, చదువుతో పాటు తన అభిరుచిని కొనసాగిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. డిగ్రీ చదువుతూనే ఫోటోగ్రఫీ రంగంలోకి తొలి అడుగు పెట్టి , తర్వాత కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో క్యాంపస్ సెలెక్షన్ ద్వారా సీటు సాధించి ఎంబీఏ ను ఫస్ట్‌క్లాస్‌లో పూర్తి చేశాడు. ఆపై క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగ అవకాశాలు వచ్చినా వాటిని వదిలేసి తన మనసుకు దగ్గరైన ఫోటోగ్రఫీ రంగాన్నే ఎంచుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే ఐబీపీఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా, ఉద్యోగం కన్నా కెమెరాపై ఉన్న మక్కువతో మళ్లీ తన కలల రంగమైన ఫోటోగ్రఫీకే ప్రాధాన్యం ఇచ్చాడు. కెమెరాను వృత్తిగా మాత్రమే కాకుండా, మరికొందరికి ఉపాధి కల్పించే సాధనంగా మార్చుకున్నాడు. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాలో యువతకు ఫోటోగ్రఫీ శిక్షణ ఇస్తూ, కొత్త టెక్నాలజీలను పరిచయం చేస్తూ పదిమందికి బతుకుదెరువు చూపిస్తున్నాడు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆధునిక ఫోటోగ్రఫీ శైలులను నేర్పిస్తూ, తనతో పాటు మరెందరినో ముందుకు నడిపిస్తున్నాడు. ప్రస్తుతం భూపాలపల్లి ఫోటోగ్రఫీ కార్యవర్గ సభ్యునిగా తన బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నాడు నా వంటి ఫోటోగ్రాఫర్లు మరెందరో రావాలి. ఫోటోగ్రఫీ అనేది కేవలం వృత్తి కాదు, ఒక కళ. అది మన అనుభూతులను, ఆనందాలను, కన్నీళ్లను, అనుబంధాలను ఎప్పటికీ నిలబెట్టే అద్భుత భాష అని కార్కూరి శ్రీనివాస్ పేర్కొన్నాడు.

# యూరియా కోసం
# కాంగ్రెస్ ఎంపీల పోరు..

- పార్లమెంట్ వద్ద ప్లకార్డులతో ధర్నా




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** యూరియా కోసం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పోరుబాట పట్టారు. బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తెలంగాణకు యూరియాను కేటాయించడం లేదని ఆరోపించారు. యూరియా కోటాను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. పార్లమెంట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. ధర్నా చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ఇస్తామని చెప్పిన 8 లక్షల టన్నుల యూరియాను ఇవ్వకుండా.. 5 లక్షల 32 వేల టన్నులు మాత్రమే ఇచ్చారని, ఇంకా దాదాపు 3 లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని, ప్లాన్ ప్రకారం కాకుండా.. తక్కువ యూరియాను ఇచ్చారు. దీనివల్ల అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూరియా కొరత ఏర్పడిందని తెలిపారు. యూరియా కోసం రైతులు ఉద్యమం చేసే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే తెలంగాణకు యూరియా ఇవ్వడం లేదు. తెలంగాణకు చెందిన పెండింగ్ ఇష్యూలపైనా పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా ఇస్తాం' అని స్పష్టం చేశారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణలోని రామగుండంలో యూరియా ఫ్యాక్టరీ ఉంటే.. నోయిడాలో ఆఫీసు పెట్టారు. 40 మంది స్టాఫ్ రామగుండంలో కాకుండా నోయిడాలో పని చేస్తున్నారు. ఇదేంటని చాలాసార్లు ప్రశ్నించామని తెలిపారు. రామగుండంలో తయారైన యూరియాను తెలంగాణకు ఇవ్వడం లేదని, తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎంపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణకు చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు కూడా నడ్డా దగ్గరకు రావాలని, వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారని, వారు వీలైనంత వరకు ప్రెజర్ పెట్టాలి. మేమంతా చిత్తశుద్ధితో యూరియా కోసం ప్రయత్నాలు చేస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే యూరియా కొరత ఉందని, ఈ విధంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్షచూపుతున్నారని తెలిపారు. ఎంపీ అనిల్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ ఎంపీలు మాతో కలిసి రావాలి. యూరియా సమస్యను పరిష్కరించాలని వ్యాఖ్యానించారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ గతంలో ఆర్ఎఫ్‌సీఎల్ మూతపడితే.. గడ్డం వివేక్ ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో మాట్లాడి.. రూ.10 వేల కోట్ల రుణమాఫీ చేయించి.. రీ ఓపెన్ చేయించారు. అక్కడ మిస్ మ్యానేజ్ స్పష్టంగా కనిపిస్తోందని, తెలంగాణకు సంబంధించి.. ఏ ఇష్యూ పైనా బీజేపీ పోరాడటం లేదని, బీజేపీ ప్రభుత్వం అన్ని విషయాల్లో ఫెయిల్ అయ్యింది' అని విమర్శించారు.



ములుగు జిల్లా, ములుగు మండలంలోని తన స్వగ్రామమైన జగ్గన్నపేటలో అంగన్‌వాడీ, పాలన కేంద్రాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఘనంగా ప్రారంభించారు.
- ములుగు ప్రతినిధి (జనంసాక్షి)

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370